కేమోమిల్లా

అలనాటి కథానికల సంకలనం



ముదిగొండ వీర భద్రయ్య

కేమోమిల్లా

(అలనాటి కథానికల సంకలనం)

ముదిగొండ వీరభద్రయ్య

కేమోమిల్లా

(అలనాటి కథానికల సంకలనం)

రచన

ముదిగొండ వీరభద్రయ్య

వెల: రూ॥ 120/-

ప్రతులకు:

హైదరాబాద్ పుస్తకాల షాపులలో

డిజిటల్ పుస్తకం ఉచితం

http://mudigondaveerabhadraiah.blogspot.com

అంకితం

ఆత్మీయులు, విద్వన్మిత్రుడు, సహాయశీలి, రాయప్రోలు సుబ్బారావు గారి కళా దృక్పథాన్ని, సిద్ధాంతాలను గాఢంగా అధ్యయనం చేసి సాహిత్య లోకంలో ప్రకాశింపచేస్తున్న నిత్య పరిశోధకుడు, నన్ను ప్రేమిస్తూ నా బాగోగులు నిరంతరం కనుక్కొంటూ చేదోడు వాదోడుగా ఉంటూ, విశ్వసనీయత కలిగిన ఆప్త మిత్రుడు అయిన ఆచార్య కె. యాదగిరి గారికి ఈ కథానికా సంపుటిని ప్రేమ పూర్వకంగా అంకితమిస్తున్నాను.

30.03.2023
శోభకృత్ శ్రీరామనవమి

ముదిగొండ వీరభద్రయ్య
పుట్టపర్తి

స్వీకృతి

మానవీయ ప్రబోధాత్మక కథలు

కథ కన్నతల్లి లాంటిది. ఆలించి లాలించి ఓలలాడించే తల్లిలాగా వయోబేధం లేకుండా పసివయసు నుండి వృద్ధుల వరకు అందర్నీ సమానంగా తన ఒడిలో మాతృత్వాన్ని, మానవత్వాన్ని, సామాజిక చైతన్యాన్ని, ప్రేమ, ఆదరణ మొదలైన సకల సద్గుణాలను అందించే మహత్తర శక్తి కథామతల్లికి ఉంది. ఈ లక్షణం పురాణకాలంనుండి ఈ నాటివరకు కొనసాగుతూనే ఉంది. ఈ సృష్టి ఉన్నంతవరకు మనిషితో పాటు కథ కూడా వెన్నంటే ఉంటుంది. అందుకే సకల మానవులు తమ తమ జీవితాల్ని కథలో చూసుకుంటూ సంతోషిస్తుంటారు, సంతృప్తిని చెందుతుంటారు. అందువల్లనే సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ కథ ప్రక్రియకు ప్రథమస్థానం లభించింది. మానవీయ విలువల్ని నిరంతరం ప్రబోధించే కథకు కాలాతీత చైతన్య లక్షణం సహజంగానే ఒనగూడింది. సావిత్ర, అనసూయ, సీత, అహల్య, అరుంధతి, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, హరిశ్చంద్రుడు, నలుడు, ధర్మరాజు, కుచేలుడు మొదలైన పురాణ పాత్రలన్నింటినీ ఈ నాటికీ జనులకు నీతిబోధకాలుగా ప్రవచించడం చూస్తూనే ఉన్నాం. కాబట్టే ప్రపంచ సాహిత్యంలో కథకు ప్రథమ స్థానం లభించింది.

ప్రముఖ కవి, విమర్శకులు, ఆధ్యాత్మికవేత్తలు ఆచార్య శ్రీ ముదిగొండ వీరభద్రయ్యగారు యాభై ఏండ్లకు పూర్వం యువకుడిగా ఉన్నపుడు సంప్రదాయ కుటుంబంలో ఉంటూనే అభ్యుదయభావాలు కలిగి ఉండటం కారణంగా ఆయనలోని సృజనాశక్తి ప్రథమంగా కథారూపంలో వెలువడి ఈ ఆరు కథలు ఆనాటి పత్రికల్లో అచ్చు కావటం ఒక విశేషం. మానవీయ సూత్రం అంతర్లీనంగా ఉన్న ఈ ఆరు కథలు ఆనాటి సమాజంలోని వివిధ సంఘటనలకు ప్రతిరూపాలుగా ఉన్నా ఈ నాటికీ వాటిలోని విలువలు ప్రబోధాత్మకంగా కనిపించడం మరొక విశేషం. ఎంతోమంది తెలుగు రచయితలు ఆధునిక సాహిత్య అవతరణలో కథా రచనతోనే తమ సాహిత్య కృషిని ప్రారంభించిన విషయం మనందరికీ తెలిసిందే.

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు ఎప్పుడో రాసి మరచిపోయిన ఈ ఆరు కథలు మళ్ళీ వెలుగులోకి రావడానికి కారణం ఆ కథల్లో ఉన్నటువంటి కాలాతీత చైతన్య లక్షణమే. 'కేమోమిల్లా' (అలనాటి కథానికల సంకలనం) పేరుతో మళ్లీ సాహిత్యరంగంలో అడుగుపెడుతున్న ఈ ఆరు కథలు – ఏనిమల్ సైకాలజీ; తరంగాలు అంతరంగాలు; కేమోమిల్లా; డామిట్ కథ అడ్డం తిరిగింది; మళ్లీ చిగిర్చిన వసంతం; మూడు చక్రలా సైకిల్; – ఇవి కథాగుచ్ఛంగా సహృదయ లోకానికి వీరభద్రయ్యగారు అందించిన ఆరు మానవతా పరిమళ గంథ సుమాలు. ఈ కథా సంపుటిలో ఒక్కొక్క కథ ఒక్కొక్క ప్రత్యేక లక్షణాన్ని కలిగినవిగా కనబడతాయి.

1970కి పూర్వం తెలుగుదేశంలో పట్టణ నాగరికతకు దూరంగా ఊళ్లలో ప్రతియేడు వినోదం కొరకు సర్కస్‌లు ప్రదర్శించడం పరిపాటి. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని శ్రీ వీరభద్రయ్యగారు '**ఏనిమల్ సైకాలజీ**' కథను రచించారు. ఇందులో ఊళ్లలో ఉండే ధనస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నాగభూషణం పాత్రను సృష్టించారు. సర్కస్‌లో జంతువుల మనస్తత్వాన్ని అధ్యయనం చేసే అలవాటున్న మిసెస్ శాంతి పాత్రను రూపొందించారు. ఈ ఇరువురి (నాగభూషణం, మిసెస్ శాంతి) మధ్య జరిగిన సంభాషణే ఈ కథగా రూపొందించింది. సర్కస్‌ని కాపాడేందుకు డాబు, దర్పం, కీర్తి అన్నీ ఉన్న పాశవిక ప్రవృత్తి కలిగిన నాగభూషణంతో సర్కస్‌లో నటించే శాంతిని, ఆమె సౌందర్యాన్ని చూసి వ్యామోహితుడై ఆమెను తన గృహానికి ఆహ్వానించడం, శాంతి నాగభూషణంతో తెలివిగా ప్రవర్తించి లక్ష రూపాయల అప్పు సంపాదంచి నష్టాల్లో ఉన్న సర్కస్ మూతపడకుండా కాపాడగలగడం, నాగభూషణంతో ఒక్క పైసాతో సహా మీ అప్పు తీరుస్తానని చెప్పి తన యొక్క నిజాయితీతనాన్ని వెల్లడించడం, నాగభూషణం తన కోరిక నెరవేరక ఆశాభంగం పొందినవాడు కావడం ఈ కథలోని ప్రధానాంశాలు. ఈ 'ఏనిమల్ సైకాలజీ' కథలో రచయిత కొందరు ధనవంతులు డబుబ్బటే ఏదైనా కొనవచ్చుననే పురుష దురహంకారాన్ని, కామవాంఛను వ్యక్తం చేస్తూనే మరోవైపు సర్కస్‌లో అర్ధనగ్నంగా నటించే స్త్రీ యొక్క నిజాయతీని, వ్యక్తిత్వాన్ని ప్రకటించి, వాళ్లకు కూడా సమాజంలో గౌరవం ఉండాలని ప్రబోధించినారు ఈ కథలో వీరభద్రయ్యగారు.

"జీవితంలో ఒక్కొక్కప్పుడు మోటుతనం, మోసం, అబద్ధాలు కూడా రక్తి కడతవన్నమాట!' అనే ఒక మెరుపులాంటి వాక్యంతో కథను ముగించడం కథారచనా నైపుణ్యానికి నిదర్శనం. కథా ముగింపులో చెప్పిన వాక్యమే ఈ కథకు మూలసూత్రమని చెప్పాలి.

ఇక రెండో కథ **'తరంగాలు అంతరంగాలు.'** ఇందులో మెడిసిన్ చదువుతున్న హరిప్రియ-వరప్రసాద్ అనే యువతీ యువకుల మధ్య స్నేహం అకర్షణగా మారిన సందర్భంలో పెళ్లయిన స్త్రీ, భర్త విదేశాల్లో ఉండగా ఇక్కడ స్నేహితుడితో చనువుగా ఉండడం, అది శారీరక ఆకర్షణకు కారణం కావడం, అతను ఆమెను లొంగదీసుకోవడానికి ప్రయత్నించడం - ఇవన్నీ వారిద్దరి మనసుల్లో చెలరేగిన భావ తరంగాలు. కాగా, ఇవన్నీ హరిప్రియను అంతరంగ సంఘర్షణకు గురిచేసినవి. "అలవాటుగా ఉన్న సంప్రదాయాలు నరనరాన బీజప్రాయంగా ఉండి తన మనస్సులోని విప్లవ శక్తిని అణిచివేస్తుండవచ్చును. చెరువులోంచి నీరు గట్లు తెంపుకొని బయటకు పారిపోతుంటే... అది నిజంగా జరిగినపుడు దానిలోని సౌందర్యాన్ని తాను చూడగలదా? వట్టిది, తాను పిరికిది!" అని అనుకుంటున్న హరిప్రియను చూస్తూ చిరునవ్వుతో వరప్రసాద్ బయటకు వెళ్లిపోతాడు.

కథ చివరిలో చెప్పిన ఈ మాటలు కాలేజీ చదువుల్లో యువతీయువకుల మధ్య ఉండే అందమైన స్నేహ తరంగాలను ఆ తరంగాల తాకిడికి మనసు తన్మయత్వానికి గురి అవుతున్నా నరనరాన జీర్ణించుకొని బీజప్రాయంగా ఉన్న సంప్రదాయాలు, అంతరంగాలను ఎలా అడ్డుకొని సంఘర్షణకు గురిచేస్తాయో ఈ కథలో చూపించడం జరిగింది. వరప్రసాద్‌తో స్నేహంగా ఉండడం ఇష్టమే అయినా శారీరక బంధానికి (సుఖానికి) మనసు అంగీకరించలేదు హరిప్రియకు. ఒకవేళ తాను అందుకు అంగీకరిస్తే జరిగే పరిణామం ఎంత భయంకరంగా ఉంటుందో తెలపడానికి - తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్న ప్రియుడిని హతమార్చిన చంద్రయ్య కథను ఉదాహరణగా చూపించాడు రచయిత.

ఈ తరంగాలు-అంతరంగాలు కథలో మూడవ పాత్ర చంద్రయ్య. ఎంత పేదరికమైనా నీతికి, సంప్రదాయానికి కట్టుబడిన వ్యక్తిగా కనిపిస్తాడు. తన

భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్న ప్రియుణ్ని హత్య చేసి నవ్వగలిగాడు కాని భయాన్ని వ్యక్తం చేయలేదు. ఇక్కడ చంద్రయ్య మాటల్ని గమనించాలి. 'ఏం లేదు కాని దాని మనస్సును పొందలేక పోయినందుకు గుండె బరువౌతుందమ్మా! కనీసం వాణ్ని చంపినప్పుడయినా అది పశ్చాత్తాపంతో నా కాళ్లమీద పడితే జైల్లో ఒక్క జీవితం కాదు పది జీవితాలు గడుపుతాను" ఈ మాటల్లో చంద్రయ్య నీతికి, సంప్రదాయానికి కట్టుబడిన ఒక ఉత్తమమైన వ్యక్తిగా చూపించాడు రచయిత.

ఈ విధంగా కథలో కథను జొప్పించి రచయిత సమాజానికి ఒక సందేశాన్ని ఇచ్చాడని చెప్పాలి. 50 ఏండ్ల క్రితం రాసిన ఈ కథలోని చంద్రయ్య కథ ఈ రోజుల్లో కూడా పునరావృతం కావడం మనందరం చూస్తున్నదే.

ఇక మూడవ కథ – **"కేమోమిల్లా"**. ఈ కథలో వీరభద్రయ్యగారి కవితా హృదయం అక్కడక్కడా తొంగి చూస్తూ ఉంటుంది. కథారచనలో కవిత్వపు ఛాయలు మనలను ఆశ్చర్యపరుస్తాయి. అంతేకాదు, పాఠకుడికి ఒక ఆసక్తిని రేకెత్తిస్తాయి.

ఒక యువడాక్టర్, భర్తను కోల్పోయిన ఒక స్త్రీ – ఈ రెండు ప్రధాన పాత్రలతో శ్రీ వీరభద్రయ్యగారు కేమోమిల్లా కథను సృష్టించారు. కేమోమిల్లా అనే పువ్వుతో తయారయిన మందు ఇచ్చి ఒక స్త్రీలో ఉన్న రుగ్మతను తొలగించ డమనేది ఇందులో ప్రధానాంశం. కాగా రచయితకు హోమియోపతి వైద్యం పై ఉన్న విశ్వాసాన్ని ఈ కథ వెల్లడిస్తుంది.

భర్త మరణించి స్త్రీ యొక్క రుగ్మతను తొలగించి ఆమెను వివాహమా డడమనేది 50 ఏళ్లకు పూర్వం అది ఒక పెద్ద ఆదర్శం. పరమ సంప్రదాయ కుటుంబంలోనుండి వచ్చిన శ్రీ వీరభద్రయ్యగారిలో ఉన్న అభ్యుదయ భావానికి ఈ కథ ఒక నిదర్శనం.

ఈ కథలో ఉన్న డాక్టర్ శశిభూషణ్, నాలాయనీదేవి రెండు పాత్రలు సమాజంపై పూర్తి అవగాహన ఉండి అభ్యుదయ భావాలు కలిగినివి. సమాజాన్ని గురించి ఆయా సందర్భాల్లో వ్యక్తం చేసిన పాత్రల అభిప్రాయాలు ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయి. ఉదాహరణకు –

"మన సంఘం మన సోదరులకి మతాన్ని, మతాధిపతుల్ని, దేవుళ్లని, దెయ్యాల్ని, బారసాలల్ని, శ్రాద్ధాలని ఇచ్చింది కాని మానవుడికి ముఖ్యంగా

కావల్సిందేమిటో దాన్ని మాత్రం ఇవ్వలేదు.”

“మానవుడు దుర్గుణాలని ఆయుధాలుగా, సద్గుణాలని ఔషధంగా వాడాలి నాలాయనీ దేవి! ఈ రెండూ అప్పుడప్పుడు వాడవలసిందే కాని రెండింటినీ నిరంతరమూ వాడే నరుడెవ్వడు బాగుపడలేడు.”

“మంచితనాన్ని లోకం ఆదర్శంగానే చూస్తుంది తప్ప దాన్ని ఆచరించ నీయదు. అలాంటి అవకాశమే ఈ సంఘంలో ఉంటే క్రీస్తు, లింకన్, గాంధీ ఎందుకు హతులయ్యారు? అలా అని చెడ్డతనాన్నైనా ఈ లోకం ఆచరించనిస్తుందా? దాన్నీ నీరసపరుస్తుంది.” కాబట్టి మంచి చెడుల కలయికను జీవితంలోకి తెచ్చుకోవాలని పరిష్కారంగా చూపిస్తాడు డా. శశిభూషణ్ పాత్ర ద్వారా రచయిత.

“నేను చాలా సూటి మనిషిని డాక్టర్. నాకు పిచ్చి పిచ్చి లౌక్యాలు తెలియవు. నంగి నంగి మాటలతో లోకం కోసం తమ నడవడిని మార్చుకునే వాళ్లని నిర్వీర్యులుగా భావిస్తాను” అంటుంది నాలాయనీ దేవి. ఈ ఇరువురు వ్యక్తం చేసిన అభిప్రాయాల వల్ల సమాజం యెడల సమానమైన భావాలు కలిగిన వ్యక్తులుగా కనిపిస్తారు. అందువల్లనే ఇద్దరి కలయికతో కథ ముగిసిపోతుంది.

ఈ విధంగా కథా రచయిత శ్రీ వీరభద్రయ్యగారు తాను మంచి యవ్వన దశలో ఉన్న అభ్యుదయ భావాలను, హోమియోపతి వైద్యంపై ఉన్న విశ్వాసాన్ని ఈ ‘కేమోమిల్లా’ కథ ద్వారా సరళసుందరంగా వ్యక్తం చేసినారు.

ఇక నాల్గవ కథ – **‘డామిట్ కథ అడ్డం తిరిగింది!.’** ఇది ఒక మెరుపులాంటి కథ. సాధారణంగా లోకంలో అందమైన స్త్రీని చూసి ఆశపడే పురుషుల (వయోభేదం లేకుండా) మనస్తత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు రచయిత. ‘డామిట్ కథ అడ్డం తిరిగింది!’ అన్నది గురజాడ కన్యాశుల్కంలో ప్రసిద్ధమైన మాటే. ఇక్కడ ఆశాభంగం చెందిన పురుషులకు వర్తింపచేయడం శ్రీ వీరభద్రయ్యగారి సమయోచిత వాక్యప్రయోగ నైపుణ్యానికి నిదర్శనం.

ఇందులో అయిదవ కథ – **‘మళ్లీ చిగిర్చిన వసంతం’**. ఇది ఒక వినూత్నమైన కల్పనతో కూడిన కథ. శ్రీ వీరభద్రయ్యగారు కథాసృష్టిలో ఒక క్రొత్తదనాన్ని చూపించారు. పురాణ గాథలలో, జానపద గాథలలో పరకాయ ప్రవేశం ఒక అద్భుతమైన సృష్టి. దానిని శ్రీ వీరభద్రయ్యగారు ‘భాస్కరం –

రమాపతి' పాత్రల ద్వారా ఆధునిక వైద్య విజ్ఞానాన్ని జోడించి చూపించారు. అందుకే ఇది అద్భుతమైన కథ. ఇది కూడా 54 ఏండ్ల క్రితం రాసింది కావడం ఆనాటి కథా సాహిత్యంలో ఇదొక అద్భుత సృష్టి అని అనిపిస్తుంది.

ఇక ఆరవ కథ – **'మూడు చక్రాల సైకిల్'**. "గడియారం రెండు ముళ్లూ కలిసి జీవన సంగీతం పాడినవి". ఇది ఈ కథలో కొసమెరుపు. వాళ్లిద్దరు కాలంతో కలిసి సంసార జీవితాన్ని ఆనందంగా కొనసాగిస్తున్నారన్న భావాన్ని ధ్వని పూర్వకంగా చెప్పడం ఉత్తమ కథా రచనకు నిదర్శనం. అలాంటిదే "గడియారం జీరో అవర్‌లోకి వచ్చింది. కొత్త జీవితం ప్రారంభమయింది" అన్న వాక్యాలు కూడా ప్రతిభావంతుడైన రచయిత తాను చెప్పదలచుకున్న భావాన్ని ఉత్త మాటలతో వాక్యార్థంగా కాకుండా ధ్వని అర్థంలో చెప్తాడు. అందుకే కవిత్వమే కాదు, కథ రచనలోనూ ధ్వని మార్గాన్ని అనుసరించినారు రచయిత శ్రీ వీరభద్రయ్యగారు.

ఈ మూడు చక్రాల సైకిల్ కథలో పిడుగుపాటుకు భార్యాపిల్లల్ని కోల్పోయిన సుధాకర్, అతని మరదలైన సుజాత ఆయన దుఃఖాన్ని ఓదార్చడానికి తోడుగా ఉంటూ చివరకు అతనికి శాశ్వతంగా తోడునీడగా (భార్యగా) మారుతుంది. ఇందులో కథా ప్రారంభమే విషాదంతో మొదలై సుధాకరం – సుజాతల మధ్య సంభాషణ పఠిత హృదయాల్ని కదలించే విధంగా ఉండి శోకతప్తమై కన్నీళ్లు తెప్పించేవిగా ఉంటాయి. ఇలా కరుణరసాత్మకమైన రచనగా ఈ కథ సృష్టించబడింది. రచయిత అన్నట్లు – శోకసర్ప పరివేష్టిమైన వర్తమానంలో ఎలా బ్రతుకగలడు? అన్న ప్రశ్నకు సమాధానమే ఈ 'మూడు చక్రాల సైకిల్'. ఈ కథ పేరు కూడా జీవితాన్ని ప్రతీకాత్మకంగా వ్యాఖ్యానించేదిగా ఉండడం గమనార్హం. జీవితానికి అర్థాలు, పరమార్థాలు చెప్పుకుంటూ కష్టాల్లోంచి ఉన్మక్తులయ్యే మానవుల సహజధోరణి సుధాకరం – సుజాతల సంభాషణలో మనకు కనిపించడం రచయిత యొక్క రచనా శిల్పానికి నిదర్శనం.

ఈ విధంగా మానవీయ ప్రబోధాత్మకంగా రచించిన ఈ ఆరుకథల బంగారాన్ని ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు నాకు అంకితంగా ఇవ్వడం నా పూర్వజన్మ సుకృతఫలంగా భావిస్తూ....

గిరిజాధినాథుడైన పరమ శివుండు
కరుణించెనోయన్న కన్నప్పననగ,
వీరభద్రోదార పరమ వాత్సల్యమూర్తి
కరుణించెనోయన్న యాదగిరి ననగ,
శ్రీ సత్యసాయి నిగమాగమాంతరంగ విదుడు
పరమ శివాచార సంపన్నుండు
ఆచార్య శ్రీ ముదిగొండ వీరభద్రేశ్వరుండు
నాయందు దయ ఉంచి నామనసెరింగి
అవ్యాజప్రేమతో అలనాటి కథలలైన 'కేమోమిల్లా' అను ఆత్మీయ రచనను
నాకు 'అంకితము'గా నిచ్చుటన్న అదియెంత మహద్భాగ్యంబగునె!
మదీయ పురాకృతజన్మ సుకృత ఫలంబవును గాదె!
ఈశ్వరానుగ్రహమును స్వీకరించుట
కర్తవ్యంబు గాదె! ఇలలోన నెవ్వరికైనను!
శ్రీ సాయి సత్యసాయి శ్రీరమణుల
బోధనామృత రుచులనెటిగిన తత్త్వ రహస్య వేది
సంస్కృతాంధ్రాంగ్ల సాహిత్య సారగ్రహణపారీణులు
సృజన విమర్శన కళాతత్త్వ శాస్త్ర రచనా ధురీణులు
సహస్రానేక శిష్యకోటి సమారాధకులు
శిష్య వాత్సల్యరతులు అధ్యాపకోత్తములు
మద్గురు మిత్రులు ప్రసన్న హృదయులు వదాన్యులు
ఆచార్యవర్య శ్రీ ముదిగొండ వీరభద్రార్య
యౌవనోద్భాసిత భవన్నిర్మిత కథాగుచ్ఛము
'కేమోమిల్లా' (అలనాటి కథలు)
స్వీకరించు మహాభాగ్యముచే
మదమలజీవితఫలము ధన్యతను గాంచెన్!!
సవినయ అభివాదములతో
ధన్యో-స్మి!!!

భవదీయుడు
ఆచార్య కె. యాదగిరి

కథలుగా మురిపిస్తున్న జీవిత సత్యాలు

- డా. దార్ల వెంకటేశ్వరరావు

ప్రొఫెసర్ హెడ్, డిపార్ట్మెంట్ ఆఫ్ తెలుగు

స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్,

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

ఫోన్: 9182685231

ఆయనపాఠం చెప్తుంటే మాకళ్ళు కనురెప్పవెయ్యడం మర్చిపోయేవి. ఆయనపాఠం చెప్తుంటే మాచెవులు మరేదీ వినడానికి ఒప్పుకొనేవికాదు. పాఠంచెప్తే ఆయనలా ఉండాలనిపించేది. ఆయనపాఠంచెప్పేసివెళ్ళిపోయినతర్వాతకూడా మాచెవుల్లో ఆయనమాటలే వినిపిస్తున్నట్లనిపించేది. ఆయనప్రొజెక్టర్స్ పై కవిత్వం విశ్లేషించి వెళ్ళిపోయిన తర్వాత కూడా ఆ దశ్యమే కనిపిస్తున్నట్లనిపించేది. ఆయనపేరు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు. ఆయనదగ్గర నేను ఎం.ఏ., తెలుగు పాఠాలనువినే అదష్టంకలిగింది. సంప్రదాయకవిత్వంలోని సౌందర్యాన్నెంతలోతుగా వివరిస్తూ భారతీయ ఆలంకారికుల పట్లగౌరవాన్ని కలిగించేవారో, ఆధునిక వచనకవిత్వాన్నివిశ్లేషిస్తుంటేపాశ్చాత్యకవిత్వనిర్మాణపద్ధతుల పట్లా అంతేఆసక్తినిపెంచేవారు. అందరికీ ఆయన ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారే కావచ్చు. కానీ, ఆయనదగ్గరచదువుకున్న మాకందరికీ ఎం.వీ.గారే. ఆయన కావ్యాల్నీ, కవిత్వాన్నీ, కథల్నీ, నవలల్నీ... ఏ ప్రక్రియ గురించి చెప్పినా ఆ ప్రక్రియలపట్ల మాకు గౌరవం కలిగేది.వాటినెలా అధ్యయనం చేయాలో ఎప్పటికప్పుడు కొత్త విధానాలు తెలిసేవి. సజనసాహిత్యంలోని అనేకపార్శ్వాల్ని ఆయన మాకు పాఠ్యభాగంలో భాగంగా వివరిస్తుంటే, ఆయన కూడా ఆ ప్రక్రియలను రాస్తే ఎలా ఉండేదో కదా అనిపించేది. ఆయన ప్రభావం నేటికీ నాటీచింగ్లో కనిపిస్తుంది. ఆయనలా పాఠం చెప్పలేకపోయినా, దాన్ని అనుకరించడానికైనా ప్రయత్నించాలనిపిస్తుంది.

అటువంటిమాఎం.వీ.గారుకథలురాశాననీ, వాటిలోఆరుకథలు దొరికాయనీ, వాటినిపుస్తకంగాతీసుకొస్తున్నానని, ఒకఅభిప్రాయం రాసి పంపించమని చెప్పారు. మాగురువుగారిరచనలపై నా అభిప్రాయమనేది నా జీవితంలో ఊహకైనా రాని ఆలోచన. వెంటనే "ఇది నాకు కలిగిన అదృష్టం సర్. మీరు కథలు రాశారంటే నాకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది సర్. మీరు కవిత్వం రాశారనితెలుసు. కథలను అంతబాగా విశ్లేషిస్తుంటే, మాగురువుగారుకథలు రాసుంటే ఇంకెంత బాగుండేదనిపించేది. ఈ కథలు చదివితే మీసజన సాహిత్యంలోని మరొకపార్శ్వం నాకులాగే మాతరం, ఆ తర్వాత తరంవాళ్ళకి ఎంతోమందికి కొత్తగా తెలుస్తుంది. నాకెంతోసంతోషంగాఉంద"న్నాను. ఈ కథలన్నీ 1968-70 ప్రాంతాల్లో రాసినవి. వీటితో పాటు మరో నాలుగు కథలు కూడా రాశారు. అవిదొరకడంలేదని తెలిసింది. ఆయన ఏనాడూ తనకథలు, లేదా తన వ్యక్తిగత రచనల వివరాల గురించి క్లాసులో చెప్పేవారు కాదు. కానీ, ఆయన వివిధ సందర్భాల్లో రాసిన విమర్శానాంశాలు మాత్రం చెప్పేవారు. అందువల్ల ఆయన ఒక విమర్శకుడుగా, ఒకపరిశోధకుడుగా, ఒకసంగీత విద్వాంసుడుగా, అన్నింటికీ మించి ఒక గొప్ప ప్రేమమూర్తిగానే ఆయన్ని మేము భావించేవాళ్ళం. అయినా, ఆయనతో నేటికీ మాట్లాడాలంటే ఏదో తెలియని భయం. ఆయన విమర్శ పుస్తకం వస్తుందంటే మాకు (నాకు ప్రత్యేకించి) ఒకపండుగే. అందులోని విశ్లేషణ, విషయగాఢత, నూతన విషయాల పరిచయం వంటివన్నీ ఆ పుస్తకాన్ని దాచుకొని పదేపదే చదువుకోవడానికి, పాఠం చెప్పడానికి మాత్రమే కాదు, నిత్యం ఉపయోగించుకోవడం కూడా నాకు అలవాటు.

అటువంటి మా సార్ కథలు రాశారని తెలిస్తే ఎలా ఉంటుంది? ఒక విమర్శకుడిగా ఎరిగినవారు నాకు తెలియని ఒకకథకుడిగా పరిచయమవుతుంటే సహజంగానే నాలోని ఆ విద్యార్థి, ఒకపాఠకుడూ, ఒకవిమర్శకుడూ సందర్భాన్ని బట్టిబయటకొస్తుంటాడు. ప్రతిపదాన్నీ, ప్రతివాక్యాన్నీ, ప్రతిపాత్రనీ, ప్రతివర్ణనలోని సందర్భోచితఔచిత్యాన్నీ, ఆ నెరేషన్నీ, దానికి ఉపయోగించుకున్న భాషనీ...ఇలా భిన్నపార్శ్వాల్లో చూడాలనిపిస్తుంది. సార్ రాసిన కథలు ఆరుదొరికాయి. వాటిని

‘కెమొమిల్లా’ పేరుతో పుస్తకంగా ప్రచురిస్తున్నారు. ఈ ఆరు కథలూ వస్తువైవిధ్యంతో పాటు శిల్పసొగసుతో పాఠకుల్ని చదివిస్తాయి. ఆ కథలపై నా అభిప్రాయాన్ని రాసే ప్రయత్నిస్తాను.

కొన్ని సందర్భాల్లో మనుషుల రూపంలో ఉండే మృగాలకంటే, మమతానురాగాల్ని ప్రదర్శించే మృగాలేనయం అనిపించే వాస్తవాల్ని మనకు కళ్ళ ముందు కదిలాడేలా వర్ణించిన కథ ***ఏనిమల్ సైకాలజీ*** (1969). జీవితం ఒక సర్కస్ లాంటిది. దాన్ని జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకోకపోతే పతనం ఎన్ని రూపాల్లో ఉంటుందో ఎవరూ ఊహించలేరు. కథ అంతా ఏకబిగిని చదివించే ఉత్సుకతతో పాటు చివరికేమవుతందనేది ఊహకలుగుతున్నట్లనిపిస్తూనే, పాఠకుని ఊహే నిజమవుతుందా? రచయిత ఏదైనా మలుపు తిప్పుతారా? అనుకుంటుండగానే కథ ముగుస్తుంది. మహాక్రూర జంతువుల మనస్తత్వాల్ని గుర్తించగలిగినవారికి మనుషులు స్వభావాలు తెలియకుండా ఉంటాయా? సమాజంలో పెద్దమనుషుల్లా గౌరవమర్యాదలు పొందే వారిలో పైకి కనిపించని దుర్మార్గ స్వభావాన్ని గుర్తించడమే కాకుండా సర్కస్ నిర్వాహకురాలు శాంతి టిట్ ఫర్ టాట్ అన్నట్లే ప్రవర్తించింది.

తరంగాలూ, అంతరంగాలూ (1969) కథలో స్త్రీ–పురుషుల మధ్య, భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనుబంధాలు ఏయే అంశాలతో ముడిపడి ఉంటాయో పాఠకుల్లో శాశ్వతంగా ముద్రవేసే పోలికలతో కథకుడు చక్కగా నెరేట్ చేశారు. ఇండియాలో డాక్టర్‌గా పనిచేస్తున్న హరిప్రియకు ఒక ఉత్తరం వస్తుంది. ఆ ఉత్తరంలో తన భర్త అమెరికాలో ఉంటూ, అక్కడ ఉండే స్వేచ్ఛను వివరిస్తాడు. మరీ ముఖ్యంగా స్త్రీ, పురుషులు కలిసిమెలిసి ఉండే స్వేచ్ఛ గురించి రాశాడు. స్వేచ్ఛ గురించి తెలిసిన దగ్గర నుండీ ఆమె మనసులో ఏదో మూల తన భర్త పట్ల ప్రత్యేకించి ఆలోచించేలా చేస్తుంది.

డాక్టర్ హరిప్రియతో పాటు వరప్రసాద్ పనిచేస్తుంటాడు. అతడు తన పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపుతుంటాడు. ఇద్దరూ కలిసిమెలిసి తిరుగుతుంటారు. ఒకసారి అలా అలా తిరుగుతూ ఒక చెరువుగట్టుమీద కూర్చుంటారు. ఇద్దరూ సరదాగా సంభాషించుకుంటారు. ఆమెపై ఉన్న మోహంతో ఆ చెరువులోని నీటికి స్వేచ్ఛ

ఉంటేనే సౌందర్యవంతంగా ఉంటుందని అంటాడు. ఏదొకలా ఆమెపై తనకున్న కోర్కెను తీర్చుకోవడానికి దొరికిన ప్రతి సందర్భానీ ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తుంటాడు.

భర్త యెడబాటు, తన ఒంటరితనం, తన వయసు ...ఇవన్నీ ఆమెను కొంత తడబాటుకి గురిచేస్తాయి. ఒకసారి హరిప్రియ, వరప్రసాద్ ఇద్దరూ కలిసి సినిమాకి వెళ్ళి, అయిపోయిన తర్వాత తమ ఇళ్ళకు వచ్చేటప్పుడు వరప్రసాద్ తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాడు. ఆమె సున్నితంగా తిరస్కరించినా బలవంతం మీద కాఫీ త్రాగి వెళ్దువుగాని లోనికి రమ్మని తీసుకెళ్తాడు. ఇద్దరూ కాఫీ త్రాగే సమయంలో వాళ్ళు ఒకర్నొకర్ని గాఢంగా చూసుకొంటారు. దాన్ని ఆసరాగా తీసుకొని ఆమెను వరప్రసాద్ దగ్గరకు తీసుకుంటాడు. కానీ ఆమె అతడ్ని దూరంగా నెట్టేస్తుంది. ఇంటికొచ్చేసి, మరలా తనలో తాను అలా చేసినందుకు బాధపడుతుంది.

ఇక్కడ సౌందర్యానుభూతి కేవలం శరీరానికి మాత్రమే సంబంధించిందా? లేదా మనసుకి కూడా సంబంధించిందా? స్త్రీ-పురుషుల ప్రేమాస్వాదనలో నైతికవిలువల ప్రభావం ఉండదా? ఇటువంటివన్నీ ఈ కథలో చర్చనీయాంశాలవుతాయి. కథ జరుగుతున్న వర్తమానంలోనే చంద్రయ్య భార్య పరాయివ్యక్తి మోజులో ఉండడం, భర్తను పట్టించుకోకపోవడం, చివరికి పరాయి వ్యక్తి, చంద్రయ్య, భార్యల జీవితం ఎలా తయారయ్యిందనే భవిష్యత్తును దర్శింపజేయటం ఈ కథలోని శిల్పరహస్యం.

కెమొమిల్లా (1970) పేరుతో ఒక కథ రాశారు. పేరే విచిత్రంగా ఉంది. కథ చివరిలో రచయిత దాని గుట్టు కొంత విప్పారు. నాలాయనీదేవి ధనవంతురాలు. ఆమె భర్త చనిపోయాడు. అతన్ని ఆమే చంపేసిందని అందరూ చెప్పుకుంటుంటారు. కానీ, నిజానికి భార్యాభర్తలిద్దరూ గొడవపడినప్పుడు, భర్త నీళ్ళ ఫౌంటెన్‌లో పడి చనిపోతాడు. ఆ విషయాన్ని డాక్టర్ శశిభూషణ్ ఆమెతో జరిపిన సంభాషణల ద్వారా తెలుసుకోగలుగుతాడు. ఆ విషయాన్ని సమాజానికి తెలియజేయడమెలాగో తెలియని నాలాయనీదేవి మానసికవ్యథకు గురవుతుంది. ఆమెకు తనచుట్టున్నవాళ్ళంతా తనకు శత్రువుల్లా అనిపిస్తారు. డాక్టర్ శశిభూషణ్ ని కూడా మొదట ఆ దృష్టితోటే

చూస్తుంది. తెలివైన డాక్టర్ ఆమె మానసిక స్థితిని గుర్తిస్తూనే ఆమె ఒంటరితనంతో బాధపడుతుంది. ఆమె తన భర్తను చంపలేదనే విషయాన్ని తన చుట్టూ ఉన్నవాళ్ళు గుర్తించలేకపోవడంతో neuropsychiatric సమస్యతో బాధపడుతుందని తెలుసుకుంటాడు. ఆ మానసిక సమస్యవల్ల ఆమెను తన భర్తే దెయ్యమై రాత్రంతా నిద్రలేకుండా వేధిస్తున్నాడని భ్రమపడుతుంది. ఆ వ్యాధి తగ్గడానికి ఆమెను అనునయిస్తూ డాక్టర్ శశిభూషణ్ ఆమె ఎలాగోలా ఆ కెమొమిల్లా మెడిసిన్ తీసుకొనేలా చేయగలుగుతాడు.

వైద్యాన్ని ప్రేమతోను, స్నేహంతోను చేయాలి. అది ఆ డాక్టర్ శశిభూషణ్‌కి తెలుసు. ఎంత ధనవంతురాలైనా నాలాయనీదేవి ఒంటరితనంతో బాధపడింది. తనవారెవరూ లేనంత ఒంటరితనంతో గడిపింది. అలాంటి ఒంటరితనం ఎంత భయంకరంగా ఉంటుందో నాలాయనీదేవి పాత్ర ఒకసజీవ ఉదాహరణగా చూపారు రచయిత. డాక్టర్ శశిభూషణ్‌కి కూడా తన రక్తసంబంధీకులెవరూ లేరు. కానీ, ఆయన దగ్గరకు వచ్చిన వాళ్ళంతా తన బంధువులుగానే భావిస్తూ ఎంతో ప్రేమతో వైద్యం చేసేవాడు. ఆ ప్రేమ, ఆ మంచితనం, ఆ అర్థం చేసుకొనే మనస్తత్వమే తనకు వరమైంది. నాలాయనీదేవి తన భార్యగా మారింది. తనకొక కుటుంబం ఏర్పడింది. రచయిత ఈ కథ ఎక్కడో ఒక వాస్తవికమైన జీవితాన్ని గమనించి రాసినట్లనిపిస్తుంది.

ఇక, కెమొమిల్లా సంగతి చూద్దాం. ఇది ఒక హోమియో మందుపేరు. అది ఒక పువ్వు నుండి తయారు చేస్తారు. దీని శాస్త్రీయ నామం Matricaria chamomilla L. సంక్షిప్తంగా ChamoMilla అనిపిలుస్తారు. దీన్ని తెలుగులో సీమచామంతి అనొచ్చు. సాధారణంగా దీన్ని neuropsychiatric సమస్యలకు ఉపయోగిస్తారని హోమియో వైద్యశాస్త్రం వివరిస్తుంది.

డామిట్ కథ అడ్డం తిరిగింది (1968)

ఒక పాడుబడిన మేడ ఉంది. దాని చుట్టూ నాలుగు వత్తులకు చెందిన వాళ్ళు నివసిస్తున్నారు. ముగ్గురికి పెళ్ళైనా, వాళ్ళకు భార్యలు లేరు. వాళ్ళు చనిపోయారు. నాల్గవవాడు ఒక విద్యార్థి. అతనికి ఇంకా పెళ్ళి కాలేదు. ఆ

మేడనెవరో బాగు చేయించి, రంగులు వేయించారు. మేడలోకి ఒక అందమైన అమ్మాయి వచ్చింది. చూడ్డానికి విధవలా ఉంది. ఆమెను పొందాలని ఒకరు, భార్యగా చేసుకోవాలని మరొకరు, ఆమెను పెండ్లాడి ఆమెతోపాటు ఆ మేడను కూడా స్వంతం చేసుకోవాలని ఇంకొకరు రకరకాలుగా ఆలోచిస్తూ, ఆమెను ఆకర్షించాలని ప్రయత్నిస్తుంటారు. దాన్ని గమనించిన ఆమె వాళ్ళలో వాళ్ళకి ఒకరికి తెలియకుండా మరొకరితో రకరకాల పనుల కోసం మాట్లాడుతుంది. ఆమెతో మాట్లాడిన వాళ్ళంతా తమని ఆమె కోరుకుంటోందనే భావం వచ్చేటట్లే చెప్తుంటారు. ఆమె విద్యార్థితో కూడా మాట్లాడుతుంది. ఆమె ఏమి మాట్లాడిందో, ఆమె ఆ యువకుడితో మాట్లాడిన సాయంత్రానికే ఒక కారు రావడం, దానిలో నుండి హుందాగా ఒకరు దిగి మేడలోకి వెళ్ళడం కథ. ఒక పాడుబడిన ఇల్లు, దానిలో ఒక విధవ పాత్రను, ఆ ఇంటి చుట్టూ నలుగురు ఆమెపై మనసుపారేసుకోవడం... ఇవన్నీ గురజాడ వారి కన్యాశుల్కం నాటకంలో గిరీశం గారి విడో మ్యారేజ్ రిఫార్మ్ కోసం పడుతున్న పాట్లులా స్ఫురిస్తాయి. సమాజంలో భర్త చనిపోయిన స్త్రీ ఒంటరిగా ఉందని తెలిస్తే, ఆమెను వెంటాడే గిరీశాలెంతమంది ఉంటారో రచయిత ఈ కథలో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ కథాకథనం ఆ నలుగుర్నీ, వాళ్ళ ఆలోచనల్నీ, వాళ్ళ అంతరంగాల్నీ ఒకదాని తర్వాత మరొకటి చెప్తున్నట్లు భిన్నమైన శిల్పంతో కథనీకరించారు. వాళ్ళ మనస్తత్వాలు తెలియాలన్నా, సమాజంలో అలాంటి గిరీశాల్ని గుర్తించాలన్నా, చివరికి ఆ మేడలోకి కారులో వచ్చిందెవరో తెలియాలన్నా ఈకథ చదివి తీరాల్సిందే. ఆమె చుట్టూ తిరిగిన వాళ్ళలో భిన్నమైన వత్తుల వార్ని పాత్రలుగా ఎన్నుకోవడంలోనే కథారచయిత కెంతో సామాజిక వాస్తవికతను ప్రదర్శించే వ్యూహం కనిపిస్తుంది. తాము చేసే పనితో సంబంధం లేకుండా, వయసుని కూడా పట్టించుకోకుండా వాళ్ళెలా ప్రవర్తిస్తుంటారో ఈ కథలో వివరించారు.

మళ్ళీ చిగిర్చిన వసంతం (1968) కథ చదువుతుంటే ఒక సినిమా చూస్తున్నట్లే ఉంది. వస్తువు అవయవదానం, దాని వల్ల వచ్చే పరిణామాల్లో కొన్నింటిని వివరించడం. ప్రపంచంలో తొలిసారిగా గుండె మార్పిడి 1967లో జరిగినట్లు చరిత్ర చెబుతుంది. ఇప్పటికీ గుండెమార్పిడి ఆపరేషన్ కి సంబంధించి ప్రజల్లో

ఎంతో ఆసక్తి నెలకొని ఉంది. ఒకరి గుండె మరొకరికి అమర్చడమనేది వైద్యశాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన మార్పు. ఇటువంటి వస్తువుతో ఈ మధ్య కాలంలో అనేక సినిమాలు కూడా వచ్చాయి. కానీ, 1968లోనే ఒక జీవన్మృతుడి గుండెను తీసి మరొకరికి అమర్చినట్లు కథ రాయడమంటే సామాన్యమైన విషయం కాదు. ఆ మెడికల్ టెర్మినాలజీతో పాటు, ఆ గుండె మార్పిడి అనంతరం వచ్చే న్యాయపరమైన వివాదాలను కూడా వివరించాలంటే ఆ సజనాత్మక రచయిత ఒక విధంగా చిన్న పరిశోధనే చేయాలి. ఆ రోజుల్లో ఇప్పుడున్నంత సమాచారాన్ని వేగవంతంగా అందుకోగలిగే సాంకేతిక పరిజ్ఞానం లేదు. అయినా గాని ఈ కథను ఇన్ని వివరాలతో రాయగలిగారంటే రచయిత ముదిగొండ వీరభద్రయ్యగారు ఎంత ప్రతిభామూర్తో స్పష్టమవుతోంది. ఈ కథలో సుశీల భర్త కారు ఏక్సిడెంట్‌లో జీవన్మృతుడవుతాడు. అంటే కొన్ని అవయవాలు కొంత సేపు పనిచేస్తాయి. కానీ, వైద్యపరిభాషలో ఆ వ్యక్తి చనిపోయినట్లే పరిగణిస్తారు. ఇక్కడ జీవన్మృతుడంటే ఎవరో కొంత వివరణ అవసరం.వైద్యశాస్త్రపరంగా వాడే ఈ మాటను ఆధ్యాత్మికరంగంలో మరొక అర్థంలో వ్యవహరిస్తారు.

పుట్టిన వానికి మరణం తప్పదు. మానవుడిగా జన్మించిన ప్రతి వాడికీ మరణం తప్పదు. కానీ, నిత్యం ఆ ఆలోచనతోనే తాను చనిపోతానేమో అనే మత్యు భయంతో నిత్యం వణికిపోయేవాణ్ణి జీనన్మృతుడని అంటారనీ, మత్యు భీతిని జయించిన వాణ్ణి జీవన్ముక్తుడు అనీ మన ఆధ్యాత్మిక వేత్తలు వివరిస్తుంటారు. 'మత్యువు 'చితి' వంటిది. అది ఒక్కసారే దహిస్తుంది. మత్యుభయం 'చింత' వంటిది. అది నిత్యం దహిస్తూనే ఉంటుంది. చివరకు మరణం తప్పదనే పరమ సత్యాన్ని జీర్ణించుకుంటూనే–దానికి సంబంధించిన చింతను, భయాన్ని మనిషి జయించాలి. అలా మత్యుభయాన్ని జయించినవాణ్ని 'మత్యుంజయుడు'గా చెబుతారు. మత్యువును జయించడమంటే, మత్యుభయాన్ని జయించడమే. దాన్ని 'ముక్తస్థితి'గా భావిస్తారు.ముక్తస్థితి–భారతీయతకు జీవనాడి. అది గొప్ప సంస్కార విశేషం' గా భారతీయ ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు.

ఈ కథలో సుశీలకు పెండ్లయిన మూడు నెలలకే తన భర్త భాస్కరానికి కార్ యాక్సిడెంట్ జరగడంతో, గుండె మాత్రం జీవంతోనే ఉన్నా, దేహం మాత్రం

చనిపోయింది. ఆ గుండెను హృద్రోగంతో బాధపడుతున్న రమాపతికి మార్చారు. అందువల్ల సుశీల తరఫుబంధువులు ఈ మరణాన్ని అనుమానాస్పదంగా భావించి పోలీసుకేసు పెట్టిస్తారు. అది కోర్టువరకు వెళ్తుంది. కోర్టులో భాస్కరం బ్రతికుండగానే ఆతని గుండెను డాక్టర్ సంజీవరావు తీసేశాడని ప్రతివాది తరఫు న్యాయవాది వాదిస్తాడు. ఆ కోర్టు వాదనలు ఎంతో లాజికల్ గా రచయిత ప్రదర్శించారు. 'బ్రెయిన్‌డెడ్' అయినట్లు ప్రకటించినవారికి కొన్ని అవయవాలు పని చేస్తున్నా, అవి మెదడుతో కనెక్టివిటీని కోల్పోతాయి. ఆ పరిస్థితుల్లో మరలా ఆ మనిషిని సాధారణ స్థాయికి తీసుకొనిరాలేనప్పుడు దాన్ని లీగల్ డెత్‌గానే వైద్యులు ప్రకటిస్తారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివాటిని మరణాలుగా నిర్వచించడంలో డాక్టర్ల మధ్యనే నేటికీ ఏకాభిప్రాయం లేదు. దీన్ని రచయిత ఆ రోజుల్లోనే ఇలా ఆ సాంకేతిక పరిభాషను సమర్థవంతంగా వాడుకొంటూ వాటిని సంభాషణాత్మకంగా వివరించారు.

''ఆ మర్నాడు డాక్టర్ సంజీవరావుని క్రాస్ ఎక్సామిన్ చేయడం తిరిగిమొదలయింది.

' 'భాస్కరం గుండెని తీసికోవడానికి అతని అనుమతిని మీరుతీసికొన్నారా?"

"లేదు."

"ఎందుకు?" గర్జించి అడిగాడు ప్రాసిక్యూటర్.

"చచ్చినవాణ్ని ఎలా అనుమతి కోసం మాట్లాడించను" –

"అప్పటికే భాస్కరం చచ్చిపోయాడా?" జడ్జి గారడిగారు.

"మైలార్డ్! మత్యువుకింకా నిర్వచనం పూర్తికాలేదు. మొన్ననే సిడ్నీలో ఇంటర్నేషనల్ ఫిజిషియన్స్ అంతా
సమావేశమయి మత్యువుని నిర్వచించడానికి ప్రయత్నం చేశారు." అన్నాడు డాక్టర్.

"పోతే మీరు చేసికొన్న నిర్వచనాన్ని బట్టి భాస్కరం మీ దగ్గరకు చచ్చిపోయాకే వచ్చాడంటారు?" ప్రాసిక్యూటర్ ఎంతో తెలివిగా అడిగాడు!

"అవును!" అన్నాడు డాక్టర్."

ఈ సంభాషణ రాయాలంటే కథారచయిత బ్రెయిన్ డెత్ గురించిన సమాచారాన్ని ఎంతో సేకరించాలి. దాన్ని మరలా సులభంగా కథలో భాగం చేయగలగాలి. ఆ నైపుణ్యం ఇక్కడ చక్కగా కనిపిస్తుంది. శాస్త్రవిషయాల్ని సృజనాత్మకంగా చెప్పాలంటే ఆ విషయం పట్ల మంచి అవగాహన ఉండడంతో పాటు, భాషపై మంచి పట్టుండాలి. ఈ కథలు రాసేనాటికి రచయితకు ముప్పై సంవత్సరాలు కూడా రాలేదు. అయినా ఆ అవగాహన మనల్ని అబ్బురపరుస్తుంది.

ఈ సంభాషణనే ఒక కోస్తా రచయిత అయితే కొన్ని పదాల్ని మార్పు చేసి ప్రయోగించేవారనిపిస్తుంది. ''చచ్చిన'' పదానికి బదులు 'చనిపోయిన' అని ప్రయోగించేవారేమో. కానీ, ఈ సంభాషణలో మనం గమనించాల్సిన విషయం రచయితశైలిలో కనిపించే నేటివిటీ. ఈ నేటివిటీ వల్ల ఆ ప్రాంతానికి చెందినవాళ్ళు ఆ భాష, ఆ పలుకుబడుల వల్ల మరింత ఆత్మీయతను పెనవేసుకోగలుగుతారు. తెలుగు భాష కోస్తా, తెలంగాణ, రాయలసీమ, కళింగాంధ్రలతో పాటు, ఆ ప్రాంతాల్లో కూడా వైయక్తిత ఉంటుంది.

అవయవమార్పిడి, అవయవదానం గురించి ఈ రచయితే గనక నేడు మళ్ళీ ఒక కథ రాస్తే, జరిగే మంచినీ, దాని పేరుతో చేసే కార్పోరేట్ మాయాజాలాన్ని, ఆ బీభత్సాన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించేవారేమో అనిపిస్తుంది.

కథలో ముగింపు మాత్రం చర్చనీయాంశం. ఒకరి గుండెను మరెవరికో పెడితే, దాని వల్లనే ఆ గుండె గలవాని అలవాట్లన్నీ గుండె పెట్టిన వారికి వచ్చేస్తాయా అనేదొక ప్రధానమైన చర్చనీయాంశమే అయినా, కథ కళాత్మకం కావడానికి అది ఎంతో దోహదపడుతుంది. పాఠకుడ్ని ఆహ్లాదపరుస్తూనే, ఆలోచనలో పడేస్తుంది.

సుశీలకు వివాహమైన మూడునెలలకే భర్త చనిపోతే,ఆమె మిగతా జీవితమంతా భర్తను మాత్రమే తలచుకొంటూ శేషజీవితాన్నంతా ఆ వైధవ్యంతోనే రసహీనంగా బ్రతికవలసిందేనా! దీనికి రచయిత సూచించిన లేదా ఇచ్చిన సమాధానమే బహుశా, తన భర్త భాస్కరం అలవాట్లే రమాపతిలోనూ ప్రతిఫలించాయని గమనించడం, చివరికి ఆమె ఇంటికే రమాపతి కాస్తా 'భాస్కరం'గానే వెళ్ళడం! ఆ వెళ్ళడం కేవలం ఆమెను ఆ ఇంట్లో దింపి మరలా తన

ఇంటికి వెళ్ళి పోవడానికేనా?

ముగింపుని పాఠకులే ఆలోచించుకునేలా ఒక సన్నని తెరని కట్టినట్లు కట్టి కథను ముగించేశారు. అలా ముగించడమే బాగుంది. ఇది కథను ముగించడంలో పాటించే గొప్ప శిల్పం.రచయిత ఆశించే దాంపత్య జీవనం, కుటుంబ వ్యవస్థ, మానసిక ప్రశాంతతలకు ఈ కథతో పాటు **కెమొమిల్లా** కథలోని ముగింపు కూడా శిల్ప ప్రాధానానికి నిదర్శనాలుగా నిలుస్తాయనుకుంటున్నాను.

మూడు చక్రాల సైకిల్ (1970)

స్వచ్ఛమైన ప్రేమకు, నిజాయితీకి ఎప్పుడూ విలువ పెరుగుతుందే తప్ప, విలువ తరగదు. నిజమైన ప్రేమ క్షమా గుణాన్నే కోరుతుంది. ఆస్తీ, అధికారం వంటివన్నీ ఉన్నా, ద్వేషం, పగ, ప్రతీకారాలతో రగిలిపోయే వాళ్ళ దగ్గర ఉండడం కష్టం. దీన్ని ఈ కథలో ఎంతో సమర్థవంతంగా హృద్యంగా నిరూపించారు. తానెంతో ప్రేమించిన భార్య సుశీల చనిపోతే, ఆ దు:ఖం నుండి సుధాకరం బయటపడ్డానికి, మరదలు సుజాత ఎంతో ప్రయత్నించింది. ఆ సందర్భంలో ఇద్దరి మధ్యా జీవితం గురించి కొన్ని తాత్త్విక సంభాషణలు జరుగుతాయి. అంతవరకు తన భార్యలేని లోకంలో కంటే, ఆమె తనతో జీవించిన క్షణాలతోనే సుధాకరం గడుపుతుండేవాడు. ఈ తాత్విక సంభాషణల తర్వాత తన మరదలు కన్నీరు పెట్టేసరికి, తన వల్ల మరొకరు బాధ పడ్డం తట్టుకోలేని సుధాకరం లౌకికప్రపంచంలోకి వస్తాడు. తన అక్క మరణం తర్వాత ఆ స్థితిలో ఉన్న బావను మరలా ఎలాగైనా మామూలు మనిషిని చెయ్యాలనుకుంది. అప్పటికే బి.ఏ.పూర్తి చేసిన ఆమె తన బావ దగ్గరే ఉంటూ ఎం.ఏ చదువుకోవాలనే నెపంతో వస్తుంది. తాను అనుకున్నట్లే తన బావను మరలా ఈ లౌకికప్రపంచంలోకి తీసుకొని రాగలిగింది.దానితో పాటే ఎం.ఏ.కూడా పూర్తి చేసి లెక్చరర్ కూడా అయ్యింది. అంతే కాదు, అక్కలేని లోటుని తీరుస్తూ సుధాకరానికి భార్యగా మారింది. కానీ, ఇద్దరిలోనూ ఒకరికొకరికి తెలియదనుకొనే ఒక రహస్యం మాత్రం అలాగే దాగి ఉంది.

తన బావకి పిల్లలు పుట్టరని సుజాతకు తెలుసు. అయినా దాన్ని తెలియనట్లే ఉంది. ఒకరోజు రహస్యాలు తెలియకుండా జీవించడంలో నిజమైన స్వచ్ఛత

ఉండదనుకొందేమో... ఆమె ఒక రహస్యం గురించి ప్రస్తావించే సరికి, సుధాకరంలో తాను దాచాననుకున్న రహస్యం బయటపడిపోతుందేమోనని ఆందోళన మొదలవుతుంది. ఆ రహస్యం తెలిస్తే సుజాత ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వణికిపోతాడు. ఈ లోగా సుధాకరానికి ఓలేఖ వస్తుంది.దానితో పాటు జతచేసిన మరొక లేఖ కూడా ఉంటుంది. వాటిని చదివిన తర్వాత తన భార్యస్థానంలోకి వచ్చిన మరదలు సుజాతకు డిగ్రీలో ఆమె క్లాసుమేటుగా ఉండి, ఆమెను ప్రేమించి, ఆ ప్రేమ దక్కకపోవడంతో అది ద్వేషంగా మారి ఉత్తరాలుగా, హింసగా మారిందని సుధాకరం తెలుసుకుంటాడు.

పరస్పరం ప్రేమగా జీవించాలకున్న నిర్ణయంతో సుధాకరం, సుజాతల జీవితాల్లోని రహస్యాలు ఇద్దరికీ తెలిసిపోయాయి. తమ ఇద్దరినీ నడిపించే రెండు చక్రాల్లాంటి పిల్లలు లేకపోయినా, వాళ్ళు సంతోషంగా జీవించగలమనే దృఢనిశ్చయంతో రెండు హృదయాలు సంతోషంతో ఒక్కటవుతాయి.

ఎన్నో జీవన తాత్త్వికలోతులున్న ఈ కథలో సుజాత తన బావను ఈ లౌకిక ప్రపంచంలోకి తీసుకొని రావడానికి మాట్లాడిన మాటలు, నిజంగా ఆమె వయసుకి తగినవేనా అనిపిస్తుంది.అయితే, కుటుంబాన్ని, ఈ లౌకిక ప్రపంచాన్నీ బాగా అవగాహన చేసుకోగలిగినప్పుడు, అనివార్యమైనప్పుడు ఆ అవగాహనను జీవితమే నేర్పుతుందేమో. సహజంగానే స్త్రీ, పురుషులు ఇరువురిలోను పురుషుని వయసుకంటే స్త్రీ వయసు చిన్నదైనా, కొంతమంది స్త్రీలలోని పరిపక్వత చూస్తే ఆశ్చర్యమేస్తుంది.

కథ చివరిలో ఒక సంభాషణ నన్ను కన్నీళ్ళు పెట్టించింది. దాంపత్యంలోని పవిత్రతను, నిష్కల్మషాన్నీ మనకు కన్నీళ్ళలోని స్వచ్ఛతలా బయటకు తన్నుకొచ్చేలాచేసింది.

"అవును సుజా!

జీవితంలో సుఖాన్ని పొందుదామని మీ అక్కని కష్టపెట్ట కూడదని శాశ్వతంగా నేనే నివారించుకొన్నాను,

ఈ జన్మకి మన ప్రతిబింబాలు అద్దంలో తప్ప మరెక్కడా కన్పించవు సుజాతా!'
'బావా! ఇంత పసిమనస్సు వున్న నువ్వే నా కొడుకువి!
ఇంత క్షమాహృదయమున్న నీవే నా తల్లివీ దండ్రివీ!
ఇంతటి అనురాగ హృదయమున్న నువ్వే నాభర్తవి!"

ఈమాటలు చెప్పాలంటే వాళ్ళమధ్య ఎంతటి నిష్కల్మషత్వం ఉండాలి. మాకు పిల్లలు పుట్టనంత వరకు నేనూ, నా భార్యా ఒకరికొకరం నిజంగానే మేము అలాగే అనుకున్నాం. ఒకరికొకరు పిల్లలమని కూడా అనుకున్నాం. అలా చెప్తే ఎవరైనా నవ్వొచ్చు. కానీ, ఈ కథ చదివాక మాలాగే ఆలోచించేవాళ్ళుంటారనిపించింది. నా హృదయంలో పెద్దభారమేదో దిగిపోయినట్లనిపించింది.

ముదిగొండ వీరభద్రయ్యగారు కథారచయితగా ఉన్న కాలంలో రాసిన ఈ కథలు, కథలుగా కనిపిస్తున్న జీవన సత్యాలు. మా సార్ లోని అతి సుకుమారమైన హృదయాన్ని తెలిపే కథలు. వీరు దాంపత్యానికిచ్చే జీవనవ్యాఖ్యానాలు.

మనకే తెలియని మన జీవనసంఘర్షణలు మనకు తెలియాలంటే ఈ కథలు చదవాలి. జీవితంలో అసహనానికి, అశాంతికి, ఒంటరితనానికి కారణాలు తెలియాలంటే ఈ కథలు చదవాలి. మనజీవితాల్ని చక్కబరుచుకోవడానికి ఇవి చాలావరకు ఉపయోగపడతాయి. నైతికతకూ, జీవితంలో అనివార్యమైన సామాజిక సర్దుబాట్లకు మధ్య గల వ్యత్యాసాల్ని తెలియజేస్తూనే, ఉత్తమ మూర్తిమత్వాన్ని పెంపొందిస్తాయి. వీటిలో యౌవనోద్రేకాలు, స్త్రీ వ్యామోహం, వాటిని నియంత్రించుకొంటూ సామాజిక విలువలను పాటించకపోతే వచ్చే పరిణామాల్ని హెచ్చరించే కథలు కూడా ఉన్నాయి.సమాజంలో గౌరవ మర్యాదలు పొందడమెంత ముఖ్యమో, ఆ గౌరవమర్యాదలు మనిషి అంతరంగ సంఘర్షణకు గురికాకుండా కాపాడాలి. అలా కాపాడుకోవాలంటే అది మనిషి తనలో తాను చూసుకోగలిగినప్పుడే సాధ్యమవుతుంది. అది తెలిసినా గోముఖవ్యాఘ్రాల్లా ప్రవర్తిస్తుంటే, ఏదో ఒకనాడు ఆ నిజమైన ముఖం బయటపడక తప్పదని చెప్పేకథ కూడా ఉంది.

కథని ఎలా రాయాలో, ఎంత బిగువుగా రాయాలో తెలియాలంటే ఈ కథలు కొన్ని నమూనాలుగా ఉపయోగపడతాయి. కథకు శీర్షిక పెట్టడం, కథను

ప్రారంభించడం, కథను ముగించటం, ఆ శీర్షిక కథకు ఎలా సరిపోతుందో తెలుసుకోవాలనే కుతూహలం ఉన్న వాళ్ళు కూడా ఈ కథల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కొన్ని నిర్మాణ రహస్యాలు తెలుస్తాయి. వీటన్నింటితో పాటు కథ రాయడం వెనుక సజనాత్మక రచయిత ఆ వస్తువుకి సంబంధించిన వివిధ విషయాలను సహజంగా కథలో అమరిపోవడానికీ ఆ నేటివిటీ తీసుకొని రావడం కోసం కథ వెనుక పాఠకులకు కనబడని రచయిత కథ ఎంతో ఉంటుందని తెలుస్తుంది. ఈ కథలకు పెట్టినపేర్లు, పాత్రల పేర్లు, సందర్భాన్ని బట్టి చేసిన వర్ణనలు, కథలోని ఎత్తుగడ, కథ నడిపించిన తీరుతెన్నులని వివరిస్తూ ప్రత్యేకించి ఒక పరిశోధన పత్రాన్నే రాసే అవకాశం ఉంది. ఈ పుస్తకంలో ***మూడు చక్రాల సైకిల్*** పేరుతో రాసిన కథ– భార్యాభర్త ఒక చక్రంగాను, వాళ్ళను, వాళ్ళ వంశాన్నీ ముందుకు తీసుకొని వెళ్ళే పిల్లలను మిగతా రెండు చక్రాలుగాను పోలుస్తూ కథకు ఒక మంచి టైటిల్ పెట్టారు. కథలో మూడు చక్రాలు విడిపోయి, ఒక చక్రం మాత్రమే పెట్టడానికి వీలవుతుందని చెప్పడంలోని భావి కథాసూచనకు చక్కని ప్రతీక. ఇలా ప్రతి కథకు పెట్టిన టైటిల్స్ ఎంతో ఆలోచనాత్మకంగా ఉన్నాయి. ఎంతో ఔచిత్యంగా భాసిస్తున్నాయి.

సజనాత్మక రచయిత కథగానీ, నవలగానీ రాసేటప్పుడు దానిలోని వస్తువునీ, దాని పూర్వాపరాల్ని సూక్ష్మంగా పరిశీలించి, ఒక అవగాహనకు రావాలి. ఒక సృజనాత్మక రచన చేయడానికి ఆ వస్తువు, దాన్నెలా పాఠకునికి అందించాలనే భావన రచయితను నిద్రపోనివ్వదు. అంతేకాదు, ఆ పారిభాషిక పదాలను కథకు అనుకూలంగా సులభంగా చెప్పాలి. పారిభాషిక పదాన్ని చెప్తున్నట్లు కాకుండా సంభాషణలోనో, వర్ణనలోనో అంతర్భాగం చేయగలగాలి. అటువంటి పరిశీలన, సజనశీలత వంటివన్నీ ఈ రచయిత కథల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఈ కథల్లో డాక్టర్ కి సంబంధించిన వస్తువుతో కథలు చెప్తున్నప్పుడు ఆ వైద్యశాస్త్రానికి సంబంధించిన పరిభాషను వాడ్డంలో సన్నివేశానికి అనుగుణంగా సహజంగా అమరిపోయేటట్లు చిత్రించారు. మానవీయ సంబంధాల్లో శారీరకసంబంధాలు, వాటి వల్ల వచ్చే మానసిక సంఘర్షణలు యువకుల్ని మాత్రమే కాదు, అన్ని వయసుల వాళ్ళనూ ఆలోచింపజేస్తాయి. వ్యక్తులు కొన్నిసార్లు తమలో ఎన్నో శక్తియుక్తులు ఉన్నా, చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం, ఆ మానవీయ

సంబంధాల వల్ల తమ ఆలోచనా శక్తి నశించిపోతుంది. తమను అశాంతికి గురిచేసే అంశమేమిటో గుర్తించలేక తనపైనా, తన పనులపైనా, తన చుట్టూ ఉన్నవాళ్ళపైనా పరస్పరనిందారోపణలు చేసుకుంటారు. వాటికి దేవుడు, దెయ్యం వంటి వారిని కారణాలుగా కూడా చూపుతుంటారు. ఈ అంశాల్ని కూడా స్పృశిస్తూ మానవుడెంత విద్యావంతుడైనా సమస్యల్లో కూరుకుపోయినప్పుడు తనలోని హేతువుని కూడా మర్చిపోతాడు. ఆ సమయంలో వైద్యుడవసరం. ఆ వైద్యుడు స్నేహితుడు కావచ్చు, ఆ వైద్యుడు భర్త కావచ్చు, ఆ వైద్యుడు ఆ అంతరంగాన్ని పట్టుకోగలినవాడై, మానసిక సాంత్వన కలిగించగలిగినవాడై ఉండాలి. అప్పుడు మరలా కోల్పోయిన శక్తియంతా బయటకొస్తుంది. ఇటువంటి మానవీయ సంబంధాలు పెరగాలంటే పరస్పర అవగాహన ఎంతో ముఖ్యం. సమస్యను ఒకేకోణంలో నుండి మాత్రమే చూడకుండా, భిన్న పార్శ్వాలలో నుండి దర్శించగలగాలి. ఆ మార్గాల్ని సూచించే కథలు కూడా దీనిలో ఉన్నాయి.

ఈ కథల్లోని ప్రతీకథానిర్మాణం ఎంతో పటిష్ఠంగా ఉంది. ఒక సంభాషణను గానీ, సన్నివేశాన్నిగానీ, ఒక పాత్రను గానీ, ఒక వర్ణనను గానీ చిన్నమార్పు చేయడానికి కూడా వీల్లేనంత పటిష్ఠంగా కొనసాగాయి. ముఖ్యంగా కథల్లో అక్కడక్కడా సందర్భోచితంగా చేసిన వర్ణనలు కథలకు ప్రాణాన్నిస్తున్నాయి.

ఈ కథలు ప్రచురించిన పత్రికల్లో ఎలా అచ్చయ్యాయో అలాగే యథాతథంగా ఈ పుస్తకంలోనూ ప్రచురిస్తున్నారు. ప్రతి కథకు ఎంతో అర్థవంతమైన చిత్రాలను వేశారు. చిత్రకారుడు ఆ కథను చదవకపోతే వాటిని అంత సజీవంగా వేయలేడు. అందువల్ల ఆ చిత్రాలను కూడా ఈ పుస్తకంలో వేయడం మంచి నిర్ణయం. ఆ చిత్రకళాకారుడు కూడా మరింతకాలం సజీవంగా ఉంటాడు. ఆనాడు ప్రచురించిన పత్రికలను చూశాను. ఆ ఫాంట్ కొంచెం చదవడానికి ఇబ్బంది. వాటినే స్కాన్ చేసి ప్రచురించకుండా కళ్ళకు ఇబ్బందిలేని మంచి ఆధునిక తెలుగు ఫాంట్ లో మళ్ళీ డిటిపీ చేయించి ప్రచురిస్తున్నారు. ఆ కథలో వాడిన భాషను నేటి భాషకు అనుగుణంగా మార్పులు, చేర్పులు ఏమైనా చేశారేమోనని పరిశీలించాను. కానీ, అదే భాషలో తీసుకొస్తున్నారు. కొన్నిచోట్ల సరళ గ్రాంథికాన్ని కొసాగించినా, కొన్ని క్రియా పదాలురచయిత శైలిని ప్రత్యేకంగా గుర్తించేలా చేస్తాయి. ఆయన మాకు పాఠం

చెప్తున్నప్పుడు కూడా ఆయన అలాగే మాట్లాడ్డాన్ని గుర్తుకు తెస్తూ ఒక ఆత్మీయ స్పర్శనిస్తున్నాయి. ఆయనతో సంభాషించిన వారికీ ఆయన భాషలోని సొంతదనం తెలుస్తుంది. ఆ భాషలోని మాధుర్యానికున్న రుచి తెలుస్తుంది.

ఈ కథలు చదవడం ద్వారా మా గురువుగారు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు ఆ యౌవనకాలంలో రాసిన కథలు అలాగే రాయడాన్ని కొనసాగించి ఉంటే బాగుండుననిపించింది.అదే కనక జరిగితే తెలుగు కల్పనా సాహిత్యంలో ఆయన గట్టి ముద్రే వేసుండేవారనిపిస్తుంది. అయినా, లభించిన ఈ కథల ద్వారా కూడా కథ రాయడంలోని బిగువునూ, ప్రారంభం, ముగింపులతో పాటు కథకవసరమయ్యే వర్ణనల్నీ, చదివించే ఉత్సుతనీ, కథ పూర్తయ్యాక కూడా వెంటాడే దశ్యాల్నీ, వినిపించే సంభాషణల్నీ పాఠకులెవరూ మర్చిపోలేరు.

తమ కథలపై ఒక అభిప్రాయం రాయడానికి అవకాశం కలిగించినందుకు మా గురువుగారికి నా హదయపూర్వక కతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

–0–

సాహిత్య వ్యాసంగానికి స్వర్ణోత్సవాలు

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారు రాసిన కథల్లో కొన్నింటిని కేమొమిల్లా పేరుతో కథా సంపుటిగా ముదిగొండ గారు తీసుకురావడం ఈ తరానికి అందిస్తున్న గొప్ప వరం. ఈ సంపుటిలో వచ్చిన కథలు అన్నీ 1969-70 ప్రాంతంలో ప్రచురితం అయ్యాయి. అంటే దాదాపు 53 ఏళ్ళ క్రితం వచ్చినవి. ముదిగొండ వారు సాహిత్య వ్యాసాంగానికి స్వర్ణోత్సవాలు జరుపుకునే మహత్తరమైన కాలం లో ఈ సంపుటి రావడం ముదావహం. ప్రతిక్షణం దేశ అభివృద్ధి, జాతి భవిష్యత్ గురించి పరితపించిపోయే ఆయన తత్వం ప్రతిరచనలో కనిపిస్తుంది. ప్రచురితమైన ఆయన పుస్తకాలు 60 పైనే , ఇన్నింటి తరువాత వస్తున్న ఈ సంపుటికి సహజసిద్ధమైన ప్రాధాన్యత వచ్చింది.

ప్రస్తుత సంపుటిలోని కథలు వివిధ పత్రికల్లో ప్రచురితం అయిన సమయం లో నా వయసు కేవలం 3 ఏళ్ళు మాత్రమే...అందుకే ఆనాడే నేను కథలు చదివే మహద్భాగ్యం నాకు కలగలేదు. 15 ఏళ్ళ ప్రాయం లో చదువుదాం అంటే కథలు అందుబాటులో లేవు.. మహత్తరమైన గొప్ప సాహిత్యం తెలియకుండానే పత్రికలూ అందుబాటులో లేక కనుమరుగు అయిపోయింది. డిజిటల్ టెక్నాలజీ, డిజిటలైజెషన్ పుణ్యమా అని ముదిగొండ వారి కథలు కొన్ని కథానిలయం వెబ్ పోర్టల్ లో అందుబాటులోకి వచ్చాయి ..

కథానిలయంలో ఈ కథలు అన్నింటినీ చదవడం జరిగింది. మూడు చక్రాల సైకిల్, యానిమల్ సైకాలజీ , మళ్ళీ చిగిర్చిన వసంతం, కేమొమిల్లా, తరంగాలు అంతరంగాలు వంటి కథలు జీవిత సత్యాలు, పరిశోధక విద్యార్థులకు కథా సాహిత్యం పై అనుసరణీయ పాఠాలు అని చెప్పవచ్చు.

సంక్షిప్తత, ఒకే అంశం లక్ష్యంగా ఉండడం, మనసు లగ్నమయ్యే లక్షణం (ఏకాగ్రత, నిర్భరత), స్వయం సమగ్రత, సంవాద చాతుర్యం, అసలు విషయాన్ని లక్ష్యం నుండి మళ్లించకుండా ఉంచడం (ప్రతిపాద్య ప్రవణత), పాఠకునిపై చూపే ప్రభావం గురించిన ఎఱుక (ప్రభావాన్విత) ఉన్నప్పుడు మాత్రమే అది మంచి కథ అవుతుంది అని పోరంకి దక్షిణామూర్తి గారు కథానికా

వాఙ్మయంలో రాశారు . ఈ లక్షణాలు అన్నీ ముదిగొండ వారి కథల్లో మనకు కనిపిస్తాయి.

జీవితంలోని ఒకానొక గొప్ప సత్యాన్ని అద్భుత శిల్పనైపుణ్యంతో కళ్ళకు కట్టినట్లు చూపించి, హృదయాన్ని ఒక మహత్తరమైన అనుభూతితో నింపి, పదే పదే చదవాలనిపింపజేసే గొప్ప కథల సంపుటి ఇది .

ఒక కథను చదివిన తరువాత మనసు చలించాలి. మళ్ళీ చదివింపజేయాలి. ఈ కథ బాగుంది అని పదిమందికీ చెప్పించ గలగాలి. మళ్ళీ పదేళ్ళో, ఇరవై యేళ్ళో పోయిన తరువాత చదివినా అదే అనుభూతి, స్పందన కలగాలి. ముదిగొండ వారి కథలు 50 ఏళ్ళ తరువాత చదివినా తాజా సంచికలో వచ్చినవి చదువుతున్న అనుభూతి కలగడం వాటిలో మిళితమైన నిభిడీకృత సాహిత్య ప్రమాణాల ప్రామాణికతే కారణం.

ఆధునిక కథా సాహిత్యం 1910లో ప్రారంభమై దినదినప్రవర్ధమాన మవుతూ ఇతర భాషలలోనూ కథారచనకి దీటుగా వికసించింది. తెలుగు కథకి కిరీటం గా చెప్పుకునే పాలగుమ్మి పద్మరాజు రాసిన గాలివాన కథ తెలుగు కథ ను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళింది. కథ అనే ప్రక్రియ తెలుగులో మొదలైన తరువాత గురజాడ అప్పారావు, బండారు అచ్చమాంబ, మేరంగి సంస్థానానికి చెందిన ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ, డా. భార్గవీరావు , మాడపాటి హనుమంతరావు వంటి వారు ఎందరో కదా నిర్మాణానికి రూపు రేఖలు దిద్దారు.

1930–1970 మధ్యకాలం తెలుగు కథకు మహర్దశ అని చెప్పవచ్చును. అక్రమాలతో రాజీపడలేని అభ్యుదయ దృక్పథంగల యువకులు కథారచయితలుగా ప్రజాజీవితానికి సన్నిహితులయ్యారు. వాస్తవికతకు భంగం కలగకుండా జీవితసత్యాన్ని నిరూపిస్తూ కథాశిల్పాన్ని పోషించారు. పండితులు, పరిశోధకులు, కళాకారులవంటివారు కథారంగం నుంచి నిష్క్రమించారు. పూర్తిగా మాండలిక శైలిలో కథలు రాయడం ఈ దశలో మొదలైంది. కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్, పాలగుమ్మి పద్మరాజు, బలివాడ కాంతారావు, బుచ్చిబాబు, మధురాంతకంరాజారాం, కొమ్మూరి

వేణుగోపాలరావు, శీలావీర్రాజు, మంజుశ్రీ, హితశ్రీ, వాకాటి పాండురంగారావు, ముళ్ళపూడి వెంకటరమణ ... ఈ జాబితా చాలా పెద్దదే , అన్ని పేర్లు నేను ఇక్కడ ప్రస్తావించలేను. వీరంతా కథాక్షేత్రంలో బంగారు పంటలు పండించారు. ఉత్తరాంధ్ర కథకత్రయం చాసో, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు కథారచనకు దిక్సూచులుగా నిలబడ్డారు. అలాంటి ఉజ్వల దశలో వారందరి సరసన సమకాలీనంగా నిలిచి మహాద్భుత కథలను ముదిగొండ గారు అందించారు

మనిషి పరిణామ క్రమంలో కథప్రాధాన్యత అనన్యసామాన్యం. మనిషి నుండి మనిషికి సమాచారం చేరవేయడానికి చిన్న చిన్న పదాలతో కూడిన కథలు తొలుత ఊపిరి పోసుకున్నా, దేశాలవారీగా ప్రాంతాలవారీగా భాష రూపాంతరం చెందుతూ ప్రాంతీయ జీవన స్థితిగతుల నేపథ్యంలో అప్పటి ఆలోచనాపరులు మౌఖిక కథల ప్రచార ప్రయాణం ప్రారంభించారు. భాష లిపిరూపం సంతరించుకోవడంతో కథాప్రయాణం వేగం పుంజుకుంది. తదనంతర కాలంలో మన జీవితంలో కథ ఒక భాగమయ్యింది. సాహిత్య ప్రక్రియలన్నింటికన్నా కథకి ఆదరణ పెరిగింది

ముదిగొండ గారు రాసిన అన్ని కథల్లో నిర్మాణం అనేది కేవలం పాత్రల చిత్రీకరణకే పరిమితం కాలేదు, కథన శైలిని, కథ చెప్పే దృక్కోణం కూడా ప్రభావితం చేస్తాయి. కథ ఎత్తుగడ, ముగింపు కూడా ఆశ్చర్య పరుస్తాయి , పాత్రలు సజీవ రూపంలో మీ కళ్ల ముందు నిలుస్తాయి. పాత్రలే మనల్ని ముందుకు నడిపిస్తాయి, సమాజంలో జనజీవనం, ఎత్తుగడలు, వ్యూహాలు , మనుషుల్లోని

లేకి తనం, కొన్ని మార్లు అమాయకత్వం , ఇంకొన్నిమార్లు నిజాయితీ కనిపిస్తుంది . ప్రతి కథా మనదే మన ఇంట్లో జరిగే రామాయణమే అనిపిస్తుంది.

ప్రముఖ తత్వ పరిశోధకుడు, డ్యూక్ యూనివర్శిటీకి చెందిన ఓవెన్ ఫ్లానాగన్ మాటల్లో చెప్పాలంటే ముదిగొండ గారు మనుషుల నిజ స్వరూపాలను తన కథల్లో బట్టబయలు చేశారు. కథ చెప్పడం బహుశా వినోదం ప్రారంభ రూపాలలో ఒకటి అని ఓవెన్ ఫ్లానాగన్ చెప్పినట్టే మనకు ఈ కథలు అన్నీ బోలెడు వినోదాన్ని అందిస్తాయి. అంతే కాదు వర్తమాన సమస్యలను

చెర్నాకోలాతో చెప్పారు. చదివిస్తూ, అలోచననూ, ఆనందాన్ని కలిగిస్తూ సాహిత్య చట్రం లోని వస్తువు, భాష, శిల్పం, నడక, ముగింపు వంటి అంశాల్లో రాజీ పడకుండా కథల్ని ముందుకు తీసుకువెళ్లారు. కథలో సమస్య మాత్రమే చెప్పి వదలాలా? పరిష్కారం చూపి ముగించాలా? పరిష్కారాన్ని పాఠకుడికె వదిలేయాలా వంటి అయోమయం లేకుండా అర్థం అయ్యే రీతిలో పాత్రల తత్వం రూపంలో విడమరిచి చెప్పేసారు. అత్యంత సౌందర్యాత్మకమైన కథనం తో ఆలోచనాత్మకంగా కూర్చిన ఈ కథలలో అనేక హృదయస్పందన అంశాలు మన మనసును తాకుతాయి .

కథ నడవాలి. పాత్రలు కాగితం మీదనే ఉన్నా చదువరిని మన్ఃఫలకం మీద ముందుకు లాక్కుపోవాలి. అలా ఉత్కంఠ భరితంగా కథ నడిచినప్పుడు ఏ పద్ధతిలో రాసారన్నది గుర్తురాదు. నిర్మాణంలో సమతుల్యత, సమరసత, ఏకత, అనుకూలత, పఠనశీలత పరిపూర్ణంగా నిండిన కథలు ఇవన్నీ .

దైనందిన జీవనాన్ని ప్రతిబింబించడం; ఆచార వ్యవహారాల యదార్థ ప్రదర్శనం; వాటి పట్ల ఆప్యాయత, మక్కువ చూపడం లేదా సహేతుకమయిన పరిహాసం చూపడం; మాండలిక పదజాలాన్ని సమయోచితంగా ఉపయోగించడం; ఇంకా లోతులకు వెళ్లి గ్రామ్య పలుకుబడులను ప్రయోగించడం; నైతికతకు విలువ ఇవ్వడం, విలువలలో జానపద లాలిత్యం చూపడం; సహజత, క్లుప్తత, సరళత, నిజాయితీ కొరబడకుండా ఉండడం మనం ఈ కథల్లో చూస్తాం. కథకు కథనానికి అంతర్లీనంగా గొప్ప ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు రచయత. మంచి కథల కోసం

ఎదురు చూసే నా లాంటి పాఠకులకు ఈ కథలు పంచ భక్ష్యాలే . ముమ్ముందు ముదిగొండ వారు మరిన్ని కథలు అందించాలని , సాహిత్య వ్యాసాంగాన్ని కొనసాగించాలని, తద్వారా మమ్మల్ని నిరంతర చైతన్య వంతులుగా ఉంచాలని కోరుకుంటూ

బి.వి. ప్రసాద్
ఎగ్జిక్యూటివ్ ఎడిటర్
సి.వీ.ఆర్ న్యూస్ ఇంగ్లీష్ ఛానల్
మొబైల్: 800809909

ధన్యవాదాలు

ఈ నా కథానికా సంకలనాన్ని అంకితం తీసికోవడానికి అంగీకరించిన ఆత్మీయులు, విద్వన్మిత్రుడు, తెలుగు అకాడెమీ పూర్వ సంచాలకులు అయిన ఆచార్య కె. యాదగిరి గారికి ధన్యవాదాలు.

ఈ సంకలన కథానికలు జాగ్రత్తగా చదివి "కథానికలుగా మురిపిస్తున్న జీవిత సత్యాలు" పేరుతో ఆలోచనాత్మక విమర్శతో పాటు నా పై వారికి ఉన్న అపార గౌరవాదరాలను, ప్రేమాభిమానాలనూ చూపిన యువ మిత్రుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి కృతజ్ఞతలు. వీరు మా వద్ద ఎం.ఏ. లో విమర్శ కళాతత్త్వ శాస్త్రాలను అధ్యయనం చేసి ఆ శాస్త్రాలను ఇప్పుడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో బోధిస్తూ మా ఆయుర్దాయాన్ని పెంచుతున్న విద్వన్మిత్రుడు.

ఈ కథానికలు చదివి తమ అభిప్రాయం తెలిపిన మరొక ఆత్మీయుడు, సీనియర్ జర్నలిస్టు శ్రీ బి.వి. ప్రసాద్ (ప్రస్తుతం సీ.వి.ఆర్. టి.వి. ఛానల్ లో ప్రధాన వార్తా సంపాదకులు) గారికి ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను. ఈ కథలను వారు సంపాదించి చూపడం వల్లనే ఇవి ఇట్లా సంపుటీకరింపబడి, మరలా వెలుగు చూస్తున్నాయి.

ఈ సంపుటిలోని కథానికలు 1960 ఉత్తరార్థం 70 ల పూర్వార్థం వరకు ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రభ, వార పత్రికలలో ప్రచురణ అయినవి. వీటిని ప్రచురించిన సంపాదకులకు కృతజ్ఞతలు, నమోవాకాలు. ఆ కాలంలో వచ్చిన పత్రికల్లోని వీటికి సార్థకమైన బొమ్మలు గీచిన చిత్రకారులు గంగాధర, వెంకట్రావు, రఘు, మూర్తి గార్లకు నమస్సులు. ముద్రణ పరంగా ఎంతో సాయం చేసిన ఆత్మీయులు శ్రీ పి.సి. శాస్త్రి గారికి నమస్సులు.

కేమోమిల్లా పూలతో సుందరంగా ముఖ చిత్ర రచన చేసిన శ్రీ కొమరవోలు హనుమంతరావు గారికి ధన్యవాదాలు. సాంకేతిక సహాయం అందించి పుస్తకాన్ని తన నైపుణ్యంతో సుందరీకరించిన యువ మిత్రుడు శ్రీ గ్రంథి శ్రీనివాస్ గారికి ధన్యవాదాలు. అర్ధ శతాబ్దం నాటి కథానికలు అవడం వల్లా, కొన్నిటిలోని వస్తువునూ దృష్టిలో ఉంచుకుని, వీటిని అలనాటి కథానికలు అంటున్నాను.

30-03-2023 మీ

పుట్టపర్తి **ముదిగొండ వీరభద్రయ్య**

విషయ సూచిక

ఏనిమల్ సైకాలజీ

ఆ వూరు చిన్నదె. ఐనా ఆ ఊర్లో సాంస్కృతిక కార్యక్రమాలూ, ఉత్సవాలూ నెలకో రెండయినా జరుగుతుంటవి. ఆ వూరి ఐశ్వర్యవంతుడు నాగభూషణం గారు ఏ కార్యక్రమంలో పాల్గొంటారో ఆ కార్యక్రమం విజయవంతమయినట్లు లెక్క. నాగభూషణం గారికి బోల్డుమంది అనుయాయులు. వారి ఉపన్యాసంలోనూ, ఉపన్యాసానంతరమున్నూ సముద్ర ఘోష లాగా చప్పట్లు వినబడ్తుంటవి. ఇంతెందుకు ఆ వూర్లో ఒక చలనచిత్ర శత దినోత్సవంలో పాల్గొనడానికి వచ్చిన సినీ నటులకన్నా ముందే నాగభూషణం గారే మాట్లాడాలని సభికుల్లో కొందరు గట్టిగా కోరడంతో చివరకి కార్యనిర్వాహకులు అలాంటి ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది! ఆయనకి ఆ వూర్లో సినిమా తారలకన్నా ఎక్కువ కీర్తి ప్రతిష్టలున్నవనడానికీ విషయం చెప్పాల్సి వచ్చింది.

ఇంతటి ప్రశంసకి పాత్రుడైన నాగభూషణం వయస్సు ఏ యాభయ్యో అరవయ్యో వుంటుందనుకొంటే మీ అంచనా పొరపాటే. అతని వయస్సు ముప్ఫయి అయిదేళ్ళు దాటవు. అతను ఇంట్లో రోజూ పట్టుపంచె కట్టుకొని మోఖాన కుంకుం బొట్టు పెట్టుకొని లక్ష్మీదేవి పటాలకి పూజ చేస్తాడు. పటాలకని ఎందుకంటున్నానంటే అతనికి నాలుగు రైస్ మిల్లులూ, ఒక బట్టల మిల్లూ, ఒక సిగరెట్టు ఫ్యాక్టరీ, ఒక పెట్రోలు కంపెనీ ఏజెన్సీ వున్నవి. ఇవన్నీ వెరసి ఏడు సంస్థలు కాబట్టి ఏడు లక్ష్మీదేవి పటాల్ని (వ్యాకరణం తప్పుకదూ... దయచేసి క్షమించండి) తనింట్లో పూజా మందిరంలో వేలాడదీసి (ఉరికంబానికి కాదు సుమా...) మేకులకి – భక్తితో రోజూ పూజ చేస్తాడు నాగభూషణం.

నాగభూషణం లక్షాధికారి. కాని నిజానికి నాకీ లక్షాధికారి అన్న పదంతో కల్గాల్సిన సంతృప్తి కలగడం లేదు. ఐనా లక్షాధికారి అంటే నాగభూషణం కోటీశ్వరుడు కాదని ఎక్కడా అర్థంలేదు! కోట్లని కూడా లక్షల లెక్కల్లో వ్రాయవచ్చును. నూటొక్క లక్ష అంటే కోటి పైననే కదా అర్థం! నాగభూషణం కూడా నిజానికి అలాంటి లక్షాధికారే! కాని వెధవది ఇంగ్లీషువాడు ఈ దేశాన్ని ఏలినప్పటినుంచీ కోట్లకి అర్థం మారిపోయింది. కాబట్టే నేను నాగభూషణాన్ని కోటీశ్వరుడనడం లేదు. చెప్పవచ్చిందేమిటంటే నాగభూషణాన్ని లక్షాధికారి



అంటే ఏదో నూరు లక్షలలోపునే అని ఊహించేరు! అలా కాదని చెప్పడానికే ఇదంతా వ్రాస్తున్నాను.... ఆ మధ్యలో బేంకుకి నాగభూషణం పంపిన నూరు రూపాయల నోట్ల కట్ట వకటి ఇంటికి తిరిగివచ్చి చాలా గొడవచేసిందని వినికిడి. ఇది ఒట్టి వినికిడే సుమండీ! అవతలి వూర్ల వారికేమీ తెలియవు.

నాగభూషణానికి భార్య లేదు. ఆమె చచ్చిపోయింది. ఆమెపై అతని ప్రేమకి చిహ్నంగా అతని పడకగదిలో ఆమె ఫోటో వకటి వ్రేలాడదీసి వుంటుంది. దాని ముందర జీరోవాట్ బల్బ్ ఒకటి ఎప్పటికీ వెలుగుతుంటుంది. (నిత్య దీపారాధన???!).

ఆ వేళ దేవతాపూజ చేసి డ్రెస్ చేసికొని డ్రాయింగ్ రూమ్‌లోకి రాగానే నాగభూషణాన్ని చూసి ఓ ఇద్దరు వ్యక్తులు లేచి నుంచొని వచ్చీ రాని తెలుగులో తమ నమస్కారాల్ని చెప్పారు.

'ఎవరు మీరు? ఏం పనిమీద వచ్చారు?' ఎంతో ప్రసన్నంగా అడిగాడు నాగభూషణం.

'మేం సర్కస్ కంపెని వాళ్ళం. మీ వూళ్ళో ఈ వచ్చే సన్‌డే నుంచి సర్కస్ ఆడిస్తున్నాం. ఇనాగ్యురల్ ఫంక్షన్‌కి మీరు ప్రెసిడెంట్ గా వుండాలని కోరడానికి వచ్చాం సార్!'

'ఓ యస్!' అన్నాడు నాగభూషణం. అతని తీరంతే. ఇంతవరకెన్నడూ ఏ కార్యక్రమానికీ ఆయన నిరాకరించినట్లు గుర్తులేదు. అంతేగాక – 'నాకు వీలు లేదు. ఫలనావాళ్లని అడిగి చూడకపోయారా?' – అని ఆయన ఎన్నడూ అనలేదు.

ఆ ఆదివారం రానే వచ్చింది. ప్రారంభోత్సవం రాత్రి ఏడున్నర గంటలకి. సర్కస్‌వాళ్ళు ఐదున్నరకే వచ్చి నాగభూషణాన్ని తీసికెళ్లారు. అక్కడ అతనికి అందర్నీ పరిచయం చేశారు.

'వీరు మా బఫూన్'

'నమస్కారం' అన్నాడు నాగభూషణం నిర్లక్ష్యంగా.

'ఈయన మా ఏనిమల్ ట్రైనర్'.

టై సవరించుకుంటూ నమస్కరించాడు నాగభూషణం.

'ఇతను ఫిష్ మింగి మళ్ళీ కక్కుతాడు... ఇతను మోటార్ జంపింగ్.... ఇతను మృత్యుమండలంలో మోటార్‌బైక్ డ్రైవింగ్... ఇతను కత్తుల బోనులోంచి దూకడం...' అతనిలా మొగాళ్ళనందర్నీ పరిచయం చేస్తూ చివరికి లేడీ ఆర్టిస్టుల దగ్గరికి వచ్చాడు.

'ఈమె మిసెస్ శాంతి.'

'ఈమె మిస్ మేరీ'

'మరి మిసెస్ శాంతి ఏ ఫీట్స్ చేస్తుంది?' మిస్ మేరీ ముందర నిలబడి పక్కగా రోబ్స్‌లోనుంచే కనిపిస్తున్న మిసెస్ శాంతి శరీరపు వంపుల్ని తనవైపే చూస్తున్న ఆమె విశాలనయనాల్నీ చూస్తూ అడిగాడు నాగభూషణం.

ఆ ప్రశ్నకి మిసెస్ శాంతి నవ్వింది.

'ఆమె చెయ్యని ఫీట్స్ లేవండీ! ఆమె ఒకరకంగా మా సర్కస్ ఫ్యామిలీకి తల్లి వంటిది.'

'ఆమెకంత వయస్సు వున్నట్లు లేదే?' అంటూ ఆమె స్నిగ్ధ శరీరాన్ని యెంతో సౌందర్యదృష్టితో చూశాడు నాగభూషణం.

'ఈమె మిస్ రోజా... మిస్ కమల... మిస్ పద్మ... బేబీ రాణీ... బేబీ డైసీ.'

పరిచయాలు ముగిసినవి.

అంతలో ఆ బారులోంచి మిసెస్ శాంతి ముందుకి నడిచి వచ్చి 'రండి నాగభూషణంగారూ! మా టెన్ట్స్ చూపిస్తాను' అని అన్నది. నాగభూషణం ఆమె వెంట ఉత్సాహంగా నడిచాడు.

'ఈ టెంట్‌లో మా ఫామిలీ వుంటుంది. ఇవి ఏనిమల్ సైకాలజీ మీద పుస్తకాలు' ఫ్లాస్క్‌లో నుంచి ఒక కప్పులోకి పాలు వంచి అతని చేతికి అందించింది ఆమె. పాలకప్పుని అందుకున్నాడు నాగభూషణం.

దగ్గరనుంచి దుర్వాసన గాఢంగా వీస్తోంది. బహుశః పెద్దపులుల

బోన్లలోంచి వస్తోంది కావచ్చుననుకొన్నాడు నాగభూషణం.

సర్కస్ డేరా బైట జనం మూగుతున్నారు. సూర్యుడస్తమిస్తున్నాడు.

నాగభూషణం పాలు తాగాక అతణ్ని టెన్ట్ బైటకు తీసుకొచ్చింది మిసెస్ శాంతి. బోన్లలో వున్న పెద్ద పులుల్నీ – సింహాలనీ – దూరంగా కట్టేసిన ఏనుగుల్నీ గుర్రాల్నీ ఒంటెలనీ చూపించిందామె. అన్నీ చూశాక ఎంతో సంతోషంతో 'థాంక్స్ మిసెస్ శాంతీ! మీదీ వో పెద్ద కుటుంబమే!' అంటూ ఆమెని వోరగా చూశాడు నాగభూషణం.

డేరామీద క్షణక్షణానికీ వెలుగుతూ ఆరుతూ వున్న దీపాల మాయ వెల్తురులో మిసెస్ శాంతి నాగభూషణం హృదయంలో అశాంతిని రేపిందని వేరే చెప్పాలా?

'పదండీ! డేరాలోకి వెళ్దాం. టైమైనట్లుంది' అన్నది శాంతి.

రికార్డుల పాటలు అసహ్యంగా మోగుతున్నవి. మాయవెల్తుర్లో నడక తడబడి నాగభూషణం మిసెస్ శాంతిమీద పడబోయాడు. ఆమె అతణ్ని పడకుండా నిలబెట్టింది!

'మీకు ఉదయమంతా తీరికే అనుకొంటాను' అన్నాడు నాగభూషణం.

దగ్గరలో సర్కస్ కళాకారుల గుంపులు కనబడ్తున్నవి.

'అవునండీ నాగభూషణంగారూ!'

'ఐతే మా కారు పంపుతాను. ఒకసారి మా ఇంటికి టీకి రండి.'

'తప్పక వస్తాను.'

ఆకాశంలో చందమామ వ్రేలాడ పోతున్నాడు. పైనున్న చుక్కలు చందమామని పైకి లాక్కోలేక మొగాలు వ్రేలాడేసినట్లుగా బలహీనంగా మెరుస్తున్నవి.

డేరాకి చుట్టూతా కట్టిన టిన్ రేకుల దడి బైటనుంచి జనసముద్రఘోష విన్పిస్తోంది. దుమ్మూ ధూళీ పైకి లేచి ముక్కుల్లోకి పోతోంది.

ఆర్.డి.ఓ.. డి.ఎస్.పి. వంటి ప్రముఖ ఆఫీసర్లందరూ వచ్చివున్నారు.

కార్యకర్తలు నాగభూషణాని కెదురుగా మైక్ తెచ్చిపెట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమని ఆవూర్లోని ప్రజలంతా ఆదరించవలసిందిగా ప్రార్థించారు వాళ్లు. అధ్యక్షుడైన నాగభూషణం మాట్లాడుతూ,

'సర్కస్ ఒక దివ్యకళ (కవిత్వమొక దివ్యకళ అని తిక్కనగారన్న మాటల్ని నాగభూషణం సమయానుకూలంగా చలనచిత్ర శత దినోత్సవాల్లో నటన ఒక దివ్యకళ అనీ, లారీ డ్రైవర్ల యూనియన్ సభలో డ్రైవింగ్ ఒక దివ్యకళ అనీ, హోటల్ సర్వర్ల సభలో మాట్లాడుతూ సర్వింగ్ ఒక దివ్యకళ అనీ మార్చుకుని ఇదివరకే మాట్లాడి వున్నారు...) దాన్ని పోషించడం మనందరి బాధ్యత. ఇవేళ ఈ కళాకారులందరూ తమ కళానైపుణ్యంచేత మనల్ని మెప్పిస్తారనడంలో నాకు సందేహం లేదు (!) ఇప్పుడే వాళ్లందరితో నాకు పరిచయమైంది (!) వాళ్లంతా అమృత హృదయులు, దివ్య శరీరులు. వాళ్ళని చూస్తుంటే నేనూ ఈ సర్కస్ కంపెనీలో ఒక కళాకారుణ్ణి అయివుంటే ఎంత బాగుండేది? అనిపిస్తోంది. కాని నాకంత అదృష్టం వుందా? లేదు! లేదు! లేదు! ముమ్మాటికీ లేదు!' (వెరసి ఏడు లేదులు!).... ఇలా సాగింది నాగభూషణం వుపన్యాసం. చిట్టచివరకి అతని వుపన్యాసం ఇలా ముగిసింది.

'ఈ ప్రారంభోత్సవానికి నేనో కొత్త కార్యక్రమం చేరుద్దామనుకొంటున్నాను.' సర్కస్ కంపెనీ సమస్యల్ని గురించి ఎవరైనా సర్కస్ కళాకారుడు ఉపన్యసిస్తే మంచిదేమో! ముందుగా తెలుపకున్నా అందుకై నేను ఈ సర్కస్ కంపెనీ కళాకారిణి మిసెస్ శాంతిని ఇక్కడకు వచ్చి ఉపన్యసించ వలసిందిగా ఆహ్వానిస్తున్నాను.'

డేరాలో చప్పట్లు చెలరేగినవి. ఈ ఆకస్మిక పరిణామానికి సర్కస్ కంపెనీ వాళ్ళు ఆశ్చర్యపడిపోయారు! కాని మిసెస్ శాంతి హుందాగా నడుస్తూ మైక్ వద్దకు వచ్చింది.

నాగభూషణం కళ్లకి ఏకాగ్రత!

మిసెస్ శాంతి సభికులకి నమస్కరించి

'డియర్ ప్రెసిడెంట్! నాల్గంటే నాల్గే వాక్యాలు మాట్లాడ్తాను. మీరన్నట్లుగా సర్కస్ దివ్యకళకాదు. అదొక మృత్యుకళ. చావు బ్రదుకుల బౌండరీలో ఒక్క

ముద్ద తిండికోసం మే బ్రతుకుతున్నాం. మా సమస్యల్ని గురించి చివరి రోజున – బహుశః ఈ కంపెనీకే అది చివరిరోజు కావచ్చు – నేను ఉపన్యసిస్తాను.'

ఈ మాటలని ఆమె హుందాగా నడిచి వెళ్లింది.

కాని ఈ చప్పట్లలో ఏదో విషాదభారం వున్నట్లున్నది. దానికి శృతిగా బ్యాండ్ మోగింది. కళాకారిణులందరూ రంగు రంగుల దుస్తులతో మధ్య సర్కిల్‌లో పతాకాల్నెత్తుకొని తిరిగారు.

సర్కస్ ఫీట్లని జనం చాలా చాలా కుతూహలంతో ఏకాగ్రతతో చూస్తున్నారు. ఎన్ని ఫీట్లు చూసినా మిసెస్ శాంతి వచ్చి ఏ ఫీట్ చేయకపోవడం నాగభూషణానికి చిరాకెత్తించింది. చివరకి చేసేదేమీ లేక కళాకారిణుల నునుపుదేరిన బలిష్ఠ దేహాల్ని చూస్తూ కూర్చున్నాడు నాగభూషణం.

మొదటి ప్రదర్శన అయిపోయింది. ఈమా ప్రదర్శనల్ని విజయవంతం చేయాలని మైక్ లోంచి జనాన్ని ప్రార్థించాడు ఆ కంపెనీకి చెందిన ఒక మనిషి.

ప్రేక్షకులందరూ లేచారు. రణగొణ ధ్వని చెలరేగుతోంది. గుడారమంతా ధూళీ దుబ్బా. కర్చీఫ్‌తో ముక్కు మూసికొన్న నాగభూషణం కళ్ళు ఎవరికోసమో ఆత్రుతగా వెదకుతున్నవి. కాని అతనికి నిరాశే ఎదురురయింది.

ఇంతలో ముసలి బఫూన్‌వచ్చి అతని చేతిలో ఒక కాగితంపెట్టి వెళ్ళాడు. నాగభూషణం కాగితం విప్పి చదువుకొన్నాడు.

'రేపుదయం పదకొండు గంటలకి మీ ఇంటికి వస్తున్నాము.' అని మిసెస్ శాంతి వ్రాసి పంపించింది.

నాగభూషణం సంతోషంతో బైటకు వచ్చి కారెక్కాడు.

మర్నాడుదయమే లేచి పూజలన్నీ ముగించుకొని పదింటికే అతిథుల గదిలోకి వచ్చి కూర్చున్నాడు నాగభూషణం. గడియారంలోని చిన్నముల్లుని పెద్దముల్లుకబళించ ప్రయత్నిస్తోంది.

గడియారం పదకొండు కొట్టింది.

మిసెస్ శాంతి లోపలికి అడుగెట్టింది. ఆమె వెంట బేబీరాణికూడా

వచ్చింది. ఆ పిల్లని చూశాక నాగభూషణానికి కాస్త ఉత్సాహం తగ్గినా తెచ్చుకోలు ఉత్సాహంతో వాళ్లని లోపలికి ఆహ్వానించి బేబీరాణిని ముద్దుపెట్టుకొన్నాడు. రాణికి తెలుగురాదని ఒక్కక్షణంలో తెలిసికున్నాడతను.

'రాణి తల్లిదండ్రులెవ్వరు మిసెస్ శాంతీ?' తన గృహాంతర్భాగాన్ని చూపిస్తూ అడిగాడు నాగభూషణం.

'ఇది మా దేవుడిల్లు'

ముగ్గురూ లోపలికి అడుగు పెట్టారు. నాగభూషణం సాష్టాంగ పడ్డాడు దేవతల ముందర. మిసెస్ శాంతీ, రాణి మౌనంగా నిల్చున్నారు.

'అలా నిల్చున్నారేం? మీరు నమస్కరించండి.'

'దేనికి?'

'దేవతలకి!' ఆశ్చర్యంగా సమాధానమిచ్చాడతను.

ఆమె మవునంగా వుంది.

'మీరు హిందువులు కారా?'

'హిందువులమే? ఐతే?' అడిగింది శాంతి.

'ఐతే దేవతలకి నమస్కరిస్తే వాళ్లు మిమ్మల్ని కాపాడ్తారు'

'పుట్టినప్పటినుంచీ నేటివరకూ ఎన్నడూ భగవంతుని తలచుకోనైనా లేదు.'

'కాని మీలాంటి వృత్తుల్లో వున్నవాళ్లకే భగవద్భక్తి ఎంతో అవసరం'

'కాని పనిచేసేవాడికి భగవంతుణ్ని గురించి ఆలోచించే తీరక వుండదు మిస్టర్ నాగభూషణం.'

'అయ్యయ్యో! ఎంత అన్యాయం వాడికి పని ఇప్పించిందే భగవంతుడైతే అలా అనవచ్చా?'

'ఉదాహరణకి నన్నే తీసికోండి నాకు పనిచ్చినవారు మా మామగారు. ఐతే నాకు ఆయనే భగవంతుడన్న మాట.'

'కాని మిసెస్ శాంతీ! నువ్వు చాలా అజ్ఞానంలో వున్నావు. ఒక్క నాలుగు రోజులు నాతో స్నేహం చేశావంటే నీకీ విషయాలు తెలుస్తవి.' అన్నాడు నాగభూషణం.

వాళ్లు ముగ్గురూ బైటకు కదిలారు. డైనింగ్‌హాలులో వాళ్లు టీ త్రాగారు.

మళ్లీ మర్నాడు భోజనానికి రమ్మనమని ఆహ్వానించాడు శాంతిని నాగభూషణం...

మర్నాడు మధ్యాహ్నం మిసెస్ శాంతి వచ్చింది. ఇద్దరూ భోజనం చేస్తున్నారు. స్వార్థం లేకుండా ఎక్కడైనా స్నేహం వుంటుందా? ఏదో ఒక అవసరాన్ని తీర్చుకోవడానికి కాకపోతే స్నేహం అనే ఒక పద్ధతే పుట్టకపోవును.

ఐతే నాగభూషణం మిసెస్ శాంతితో చేస్తున్నది స్నేహం కాదు. ఎందుకంటే నాకు తెలిసినంతవరకు ఏ భారత పురుషుడూ పెళ్లయిన స్త్రీతో స్నేహం చేయడానికి ఉత్సహించడు. కాదా మరి? చూస్తూ చూస్తూ రిసెర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎవ్వడూ ఎక్కడు అలా చేస్తే రిజర్వ్ చేసుకొన్నవాడూ కండక్టరూ ఇద్దరూ ఊరుకోరు. కాని ఇదో ఎక్సెప్షన్. ఇక్కడ మిసెస్ శాంతిని చూడగానే అతను ప్రపంచాన్ని మర్చాడు. ఆమె శ్రీమతి అయివుండడం పెద్ద అడ్డంకి కాదు – పది మందిలోకి అర్ధనగ్నంగా వచ్చి దొమ్మరాటలు ఆడే స్త్రీకి పెద్ద వ్యక్తిత్వమూ వుండదు!

అధవా వున్నా ఆ వ్యక్తిత్వాన్ని డబ్బుతో కొని నిర్వీర్యపర్చలేడా తాను? – అనుకొన్నాడు నాగభూషణం.

భోజనాలు ముగిసినవి. తన బెడ్‌రూమ్‌లోకి శాంతిని తీసికెళ్లాడు నాగభూషణం.

అక్కడ వేలాడేసిన ఫోటోని చూపిస్తూ,

'ఈవిడ నా గతించిన భార్య.'

'మీరు మళ్ళీ కళ్యాణం చేసుకోలేదా?'

'మంచి పిల్ల బీదపిల్ల దొరుకుతే చేసికోవాలనే వుంది. నిజానికి అదే నా భార్య చిట్టచివరి కోరిక కూడా.'

'ఓహ్! అలాగా!'

బైట ఎండ ఝూడించి కొడ్తోంది.

అయినా నాగభూషణం ఎయిర్ కూల్డ్ గదిలో దాని ఛాయైనా లేదు. అతను శాంతి పక్కన కూర్చుంటూ.

'మీరీ వూర్లో ఎన్ని రోజులుంటారు?' అడిగాడు.

'తెలీదు మిస్టర్ నాగభూషణం.'

'అదేమిటీ? అట్లా అంటున్నారు?'

'అవునండీ! మా కంపెనీకివే చివరి రోజులు. మాకు రోజుకి మూడువేలు కలెక్షను వస్తే నిలబడగల్గుతాం. కంపెనీ ఇప్పుడు నష్టంలోకి జారిపోతోంది.' ఆమె ముఖంలో దైన్యం ఉట్టిపడ్తోంది. మిసమిసలాడ్తున్న ఆమె దేహంలోకి ఒక్కసారిగా ముసలితనం తొంగిచూసినట్లయింది.

'ఐతే కంపెనీ మూసేశాక మీరేం చేస్తారు శాంతీ?'

'కంపెనీ మూయకుండా ఉండేటందుకే నా శాయశక్తులా ప్రయత్నిస్తాను మిస్టర్ భూషణం.'

'ఎలా'

'మీవంటి ఉదారులనుంచి కొంత అప్పు తీసికొంటాను.'

ఆ మాటతో నాగభూషణం మొగంలో రక్తం జారిపోయింది. ఐతే – ఈమె స్నేహానికి పరమార్థం ఇదన్నమాట. వెంటనే తేరుకుని నాగభూషణం తానింక లౌక్యం చూపాల్సిన పనిలేదని తెలిసికొన్నాడు.

'నువ్వడిగాక సహాయం చేయక పోవడమేమిటి శాంతీ!' ఆమె భుజాలమీద చేతులు వేస్తూ అన్నాడు నాగభూషణం ప్రేమగా.

'చాలా థాంక్స్ మిస్టర్ నాగభూషణం, ఆ నమ్మకం నాకున్నది కాబట్టే నేను మిమ్మల్ని స్నేహితుల్నిగా చేసికొన్నాను.' అంటూ ఆమె లేచింది.

నాగభూషణం వెంటనే ఆమెతో బాటు లేచి –

'అప్పుడే లేచావేం శాంతీ! కాస్సేపిక్కడే విశ్రాంతి తీసికొని వెళ్లు!' అన్నాడు.

'లేదు మిష్టర్ భూషణం! ఇవేళ మ్యాటినీ కూడా వుంది.'

'ఐతే మళ్లీ ఎప్పుడు కలుస్తావు?'

'మీరెప్పుడు రమ్మంటే అప్పుడే.'

'వెరీగుడ్ స్నేహం అంటే అలా వుండాలి.'

ఆమె చెక్కిళ్లమీద సున్నితంగా కొడ్తూ అన్నాడతను.

– అరే ఈమె చెక్కిళ్లమీద ఈ తేమ ఎక్కడిది – అతనామె చెక్కళ్లని పరామర్శించి చూశాడు. శాంతి గబగబా వెళ్లిపోయింది....

ఆ మర్నాడు రాత్రి ఏడున్నరకి వచ్చింది శాంతి.

'ఫస్ట్ షో లేదా?' ఉత్సాహంగా అడిగాడు నాగభూషణం.

'నాపని ముగించుకొని వచ్చాను మిష్టర్ భూషణం.'

'భోజనం చేద్దామా?'

'ఈవేళప్పుడు భోజనం చేయడం అలవాటు లేదు'

'అవును. సర్కస్ కంపెనీవాళ్లు కదూ మీరు. మరిచేపోయాను. అవునుగానీ శాంతీ ఇలా రోబ్స్‌లోనే వచ్చారే.'

'అరరే మర్చిపోయాను. నా ఫీట్ అయిపోగానే ఇటే వచ్చాను.'

'నీ కీ పరధ్యానం నిన్నటినుంచే వచ్చిందా?' నవ్వుతూ అడిగాడు నాగభూషణం.

శాంతి తలదించుకొని ఏమో ఆలోచిస్తోంది.

'ఆ రోబ్స్ మాత్రమెందుకు శాంతీ! తీసెయ్ వాటిని!'

ఆమె వాటిని తీసేస్తూ అంది.

'మా కంపెనీని నిలబెట్టాల్సిందిగా వేడుకొంటున్నాను మిష్టర్ భూషణం.'

రోబ్స్ లేకపోవడంచేత కనబడ్తున్న ఆమె అర్ధనగ్న శరీరాన్ని ఆశతో చూస్తున్న నాగభూషణం ఉద్రేకంగా అన్నాడు.

'నీవంటి మంచి దాని స్నేహం నిలువుకోవడానికి ఒక్క కంపెనీయే ఏం ఖర్మ – పది కంపెనీల్నయినా నిలుపుతాను మిసెస్ శాంతీ!' ఈ మాటలంటూ నాగభూషణం శాంతిని సమీపించాడు. శాంతి గబుక్కున లేచి నిల్చుని.

'పదండి! సర్కస్ షో చూద్దురు!' అని అన్నది.

'ఇప్పుడెందుకులే శాంతీ! ఇక్కడే కూర్చుందాం కబుర్లు చెప్పుకుంటూ' పరుగులెత్తుతున్న నదికెవ్వరో అడ్డుకట్ట వేసినట్లయి గిలగిల లాడ్తున్నాడు నాగభూషణం.

'కాదు మిష్టర్ భూషణం. ఇవేళ మా కంపెనీ అతనొకడు జీవితంలో మొదటిసారిగా రింగ్‌మాస్టర్ కాబోతున్నాడు. అది చూద్దురు రండి.'

అప్పటికే తనని సగ మాక్రమించిన నాగభూషణాన్ని గట్టిగా బైటకుతోసి శాంతి రోబ్స్ వేసికొని బైటకు బయలుదేరింది. ఆమెతోబాటు అతనూ బయలుదేరాడు సర్కస్ గుడారానికి... సరిగ్గా అప్పుడే ఒక అందమైన యువకుడు రెండు పెద్దపులుల మధ్యన మేక నొక దాన్ని నిలబెట్టాడు. బ్యాండ్ స్టేజి కిందినుంచి ఆ దృశ్యాన్ని చూస్తున్న నాగభూషణంతో శాంతి చెప్తుతోంది.

'అతనే మా కొత్త ఏనిమల్ ట్రయినర్. ఎంతో అందంగా వున్నాడు కదూ మిస్టర్ భూషణం.'

నాగభూషణం ఆమెని అనుమానంగా చూస్తూ అడిగాడు.

'అతనేమైనా మీకు...'

నాగభూషణం మాటలకామె వెంటనే అడ్డువస్తూ అన్నది.

'అతను నా కొడుకు!'

ఆ మాటతో నాగభూషణం అదిరిపడ్డాడు.

'మీ కంత వయస్సుందా?'

ఆ మాటలకి ఆమె నవ్వింది. ఒక్క నిముషం నిరుత్సాహ పడిపోయిన నాగభూషణం కాస్సేపటిలో కోల్పోయిన ఉత్సాహాన్ని పుంజుకుని అది అబద్ధమయి వుంటుందిలే అనుకుంటూ ప్రదర్శన చూస్తున్నాడు మధ్యలో.

'అదేమిటీ మీ అబ్బాయి పెద్దపులి నోట్లో తన తల దూరుస్తున్నాడు - మీకేం భయమనిపించడంలేదా?' వెక్కిరిస్తూ అన్నాడు నాగభూషణం.

'మా పెద్దాడికి నాకు తెలిసిన ఏనిమల్ సైకాలజీ అంతా నేర్పాను. జీవితంలో ఎన్నడూ ఏ జంతువూ వాణ్నీ చూస్తూ మోసం చేయ లేదు' గుండె నిబ్బరంతో, గర్వంతో, ఆత్మవిశ్వాసంతో ఆమె కళ్లు వెలిగినవి.

ఇంతలో ముసలి బఫూన్ వెళ్లి పెద్ద పులినోట్లో తలదూర్చినట్లు దూర్చబోయి గటుక్కున తన షర్టుని బైటకు లాగేసి దానినోట్లో వేసాడు.

జనమంతా గందరగోళంగా నవ్వింది!

ప్రదర్శన అయిపోయింది నాగభూషణం శాంతిని ఆరాత్రి తన ఇంటికి రమ్మన్నాడు.

'వస్తాను కాని మీ సహాయం ఇవేళే లభించాలి మాకు. అలా అవుతే రేపే మా మ్యానేజర్ వాళ్లు మరో వూరు వెళ్లి అక్కడ ప్రదర్శనకి ఏర్పాట్లూ అవీ చేసికొని వస్తారు.'

నాగభూషణం గొంతు ఉద్రేకంగా 'ఊ' కొట్టింది.

ఆమె దగ్గరలోవున్న ఎవరితోనో మళయాళంలో ఏమిటో చెప్పి నాగభూషణంతో బైలుదేరింది.

చీకటి రాత్రి గుండె బరువుగా మారిపోయింది. కారు ధ్వని అపశృతుల మధుర సమ్మేళనంలా వుంది! నాగభూషణం కళ్లు కారు హెడ్‌లైట్ల కన్నా తేజస్సుతో వెలిగిపోతున్నవి రోగమూ ముసలితనమూ లేని జవ్వని తనది కాబోతోంది. దాని కోసం తానెంత డబ్బు ఖర్చు చేయబోతుంటే మాత్రమే పొందాలి. దానికిన్నీ తొందరపడకూడదనే పాటి వివేకం అతనికి వుంది.

'అలాగే శాంతీ!'

ఇంతలో తలుపులపై ఎవ్వరో తట్టారు.

శాంతి నాగభూషణాన్ని చూస్తూ అడిగింది.

'మిష్టర్ భూషణం! మా కంపెనీ దివాలా తీయకుండా వుండేటట్లు సాయంచేయండి. అలా అయితే నేనిక్కడ తృప్తిగా వుండిపోగలను'.

'నీకెంత కావాలి శాంతీ?'

'ఒక్క లక్షరూపాయలు. అదీ దానంగా కాదు మిస్టర్ భూషణం! అప్పుగా! వడ్డీలేని అప్పుగా!'

'వడ్డీ లేకపోవడమేమిటి? నీవు లభిస్తుండడమే అతనిలోని వ్యాపార బుద్ధి వెకిలిగా నవ్వింది. అంతలో మళ్లీ పడక గది తలుపులపై చప్పుడు!

'చీ! ఎవరీ పానకంలో పుడక' అంటూ నాగభూషణం తలుపులు తీయబోయాడు.

'ఉండండి! డబ్బులిచ్చి తలుపులు తీయండి! వాళ్లు మా వాళ్లే అయివుంటారు'

'అలాగే' ట్రియోరీలోంచి డబ్బు తీసి ఆమె చేతిలోవుంచి తలుపు తీశాడు.

ఆ వచ్చింది ముసలి బఫూన్.

అతని ముఖం విచారంగా వుంది. దవడలు పీక్కుపోయి వున్నవి గడ్డంమీద అక్కడక్కడ జింకుపూత! తలపైన చిరిగిన – మాసిన హాటు. తల్లకిందులుగా తొడుకున్న కోటూ, మాసిక లేసి కుట్టిన పైజామా – ఇదీ అతని వేషం!

అతను లోపలికి రాగానే శాంతిని చూశాడు. ఆమె చేతిలోని నోట్లని కూడా చూశాడు. వాటిని చూశాక కూడా అతని ముఖంలో కాంతి రాలేదు.

శాంతి అతణ్ని చూడలేక తల దించేసింది.

'నేను సర్కస్ బఫూన్ని'

'అది మీరు చెప్పాలా?' గేలి చేస్తూ అన్నాడు నాగభూషణం.

'అంతేకాదు. ఆయన మా కంపెనీ యజమాని కూడా' అన్నది శాంతి గంభీరంగా.

'అలాగా' ఆశ్చర్యపడ్తూ అన్నాడు నాగభూషణం.

'శాంతికి ఫీట్ చేయాల్సిన టైమయింది. తీసికొని వెళ్లడానికి వచ్చాను' అన్నాడు బఫూన్.

నాగభూషణం నిస్సహాయంగా శాంతి వంక చూశాడు!

'మీ రిక్కడే వుండండి. నా ఫీట్ కాగానే వచ్చేస్తాను. అంతలోపల మా ప్రొప్రయిటర్ గారితో వడ్డీలేకుండా ఈ డబ్బు ప్రామిసరీ నోట్ వ్రాయించుకోండి – బై బై' అంటూ శాంతి బైటకు వెళ్లిపోయింది డబ్బుతో సహా.

అలా డబ్బుతో వెళ్లిపోయిన శాంతి తిరిగి నాగభూషణం దగ్గరికి రానే లేదు! మరేమయింది??? ఏమయిందీ అంటే...

ఆ సర్కస్ కంపెనీ ఒక రాష్ట్ర రాజధానిలో ప్రదర్శన ఇస్తున్న సంగతి తెలిసికొని కారు వేసుకొని అక్కడికి వెళ్లాడు నాగభూషణం.

'ఓహో మీరా భూషణంగారూ! రండి! రండి! మీ సాయంవల్ల ఈ ఒక్క వూర్లోనే ఇరవయివేలు లాభం సంపాదించాం. పేరు మోసిన సర్కస్ ఆర్టిస్టుల్ని హైర్‌చేసి మా కంపెనీలో చేర్చుకొన్నాము! బీద ఆర్టిస్టుల జీవితాలకి స్థిరత్వం కల్గించాం' అంతలో అక్కడికేదో పనిమీద ముసలి బఫూన్ వచ్చి వెళ్లాడు!

'ఆయనే నా భర్త' అన్నది శాంతి.

'ఏమిటీ?! ఇతనా నీ భర్త!'

'అవును ఆయనే నా భర్త. ఈ కంపెనీ భారమంతా ఆయనే మోసి మోసి ముసలివాడయ్యాడు. ఒక్క మీ వూర్లోనే నే నా భారాన్ని నా పైన వేసికొని ఆయనకి జీవితంలో ఒక్కసారైనా సాయం చేయగల్గాననే తృప్తి మిగుల్చుకొన్నాను.'

'అంతే కాదు. అవతలి వాళ్లని మోసం చేయగల్గాననే తృప్తి కూడా నీకు దక్కివుండవచ్చు శాంతీ!' కోపంగా అన్నాడు నాగభూషణం.

శాంతి చిరునవ్వు నవ్వుతూ జవాబివ్వలేదు.

అతనింకా రెచ్చిపోయి అన్నాడు.

'సమాధాన మివ్వవేం?'

ఆమె అప్పటికీ సమాధానమివ్వలేదు.

'ఇది మోసం కాదూ! శాంతీ! మీరంతా మనుష్యుల్లో పొరపాటున పుట్టారు. ఛీ!ఛీ!' అన్నాడు నాగభూషణం కోపంగా.

దూరంగా శాంతి కొడుకు పెద్దపులి నోట్లో తల దూర్చుతున్నాడు.

'అటు చూడండి భూషణం... నా కొడుకు పెద్దపులి నోట్లో తల దూర్చాడు.'

'అతనేం చేస్తే నా కెందుకు?' విసురుగా అన్నాడు నాగభూషణం.

'అలాగే నేనూ మీ జీవిత ముఖంలో నా శిరస్సునుంచాను. ఆ పెద్దపులేమో మానవత్వంతో నా కొడుకుని నమిలి మింగేయలేదు కాని మీరేమో నన్నూ నా సౌందర్యాల్ని నమిలి మింగేద్దామనుకొన్నారు!!'

'ఛీ!ఛీ! చేసిన మోసం చాలక ఇంక వుపన్యాసాలు కూడానా' కసిగా అన్నాడు నాగభూషణం.

'సర్కస్‌ని ఆనాటి సభలో మీరు దివ్యకళ అని పొగుడ్తున్నపుడె అనుకొన్నాను' ఆమె అర్థంతరంలో ఆగింది.

'ఏమని' రెట్టించి అడిగాడతను.

'ఇలా అంటున్నది మానవుడు కాడు'. మళ్లీ ఆగిందామె –

'మరి?'

'పశువని'

అవమానంతో నాగభూషణం మొఖం జేవురించింది.

'ఛీ!ఛీ!' అన్నాడతను నిస్సహాయంగా.

'చిన్నప్పటినుంచీ జంతువుల మనస్తత్వం తెలిసిన నేను వెంటనే మిమ్మల్ని తెలిసికొన్నాను. జంతువులకి పశుబలంలాగే మీకు ధనబలం వుందని తెలుసు

చావు బ్రతుకుల పొలిమేరలలో అనుక్షణం చావలేక బ్రతుకుతున్న మాకు అఖండమైన ఆత్మ విశ్వాసం వుంది. కాని మాకు లేనిది ఆనాడు ఒక్కటే! అది ధనం! ధనం సృష్టించే తిండి! అందుకే మిమ్మల్ని ఆశ్రయించాను' అన్నది.

'కాదు మోసగించావు.'

'అవును మిమ్మల్ని మోసగించాను ఈ లైసెన్స్‌డ్ ఆత్మహత్యా ప్రయత్నాల కళని సర్కస్ అనే అందమైన పేరుతో పిలిచి నలుగురిలో మీకు దానిపై ఎంతో ప్రేమ వున్నట్లూ, మీకు ఆ కళాకారులపై ఎంతో సానుభూతి వున్నట్లూ నటించినందుకుగాను మిమ్మల్ని అలా మోసగించాను.'

'నువ్వు అడిగితే ప్రతిఫలం ఆశించకుండా డబ్బివ్వక పోయేవాడినా శాంతీ' లౌక్యంగా అన్నాడు నాగభూషణం.

'మిస్టర్ భూషణం! ప్రతివంచన చేయడానికి ప్రయత్నించకండి. మీరు చేసిన సాయానికి మేము మీకు సర్వదా కృతజ్ఞులం!'

దూరంగా సింహం పిల్లిలా శాంతి కొడుకు ముందర కూర్చుంది. అంతే కదూ మరి?! మానవతముందు ఏశక్తి ఐనా తలవంచక తప్పదు.

'నాడబ్బు నాకు కక్కమని మీకు నోటీస్ ఇప్పిస్తాను'.

'ఆ తతంగం అంతా అయ్యే లోపల మీ డబ్బు అణాపైసల్తో మీకు వాపస్ ఇచ్చేస్తాము – కాని...' అర్ధంతరంగా ఆపిందామె.

'ఆ కాని...?' అడిగాడు భూషణం.

'కాని మీకు ఈ వడ్డీమాత్రం దక్కదు. అందుకు నేనెంతో విచారిస్తున్నాను మిష్టర్ భూషణం' అంటూ గలగలా నవ్వుతూ శాంతి అక్కడినుంచి పారిపోయింది!

దూరంగా సర్కిల్‌లో బఫూన్ ఏదో మోటు జోక్ వేస్తున్నాడు. జనం చప్పట్లు కొడ్తున్నారు.

జీవితంలో ఒక్కొక్కప్పుడు మోటుదనం, మోసం, అబద్ధాలు కూడా రక్తికడ్తవన్నమాట!.

(05.12.1969 నాటి ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురితం)

తరంగాలూ - అంతరంగలూ

'డాక్టర్! ఈ బాడీ ఎంతో హెల్దీగా వుందే! హాస్పిటల్‌నుంచి వచ్చిన శవాల్ని డిసెక్ట్ చేయడానికసలు ఉత్సాహమే రాదు. ఇటువంటి శవాలు ఓ నాలుగు వచ్చెనా మెడిసిన్ ఫస్ట్‌క్లాసులో పాసు కామూ!' అంటున్నది హరిప్రియ ఎనాటమీ లెక్చరర్‌తో!

'ఈ శవం సెంట్రల్‌జైలు నుంచి వచ్చింది హరిప్రియా! అందుకనే ఈ బాడీ ఇంత ఆరోగ్యంగా వుంది' అన్నాడు ఎనాటమీ లెక్చరర్.

'పాపం ఇంత ఆరోగ్యకరమైన శరీరముండి కూడా ఎందుకు చచ్చిపోయాడో' హరిప్రియ ఆపరేటస్‌ని సరిచేసికుంటూ అన్నది. అంతలో అప్పుడే వచ్చిన సహ విద్యార్థి వరప్రసాద్ ఆ శవాన్ని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడడం చూచి హరిప్రియ–

'ఏం ప్రసాద్! ఏం చూస్తున్నావు? నువ్వూ నాలాగే ఇంత ఆరోగ్యమైన శరీరం ప్రాణాలెలా వదిలిందని చూస్తున్నావా?'

'లేదు హరీ! ఈ శరీరం ఎవరిదో నీకింకా జ్ఞాపకం రాలేదా?' దగ్గరికి వస్తూ అన్నాడతను.

హరిప్రియ ఆ శవాన్ని పరీక్షగా చూసింది! వెంట్రుకలు లేని ఆ శవం తలమీద వెంద్రుకల్ని ఊహించుకొన్నది. ఆ శరీరంమీద దుస్తుల్ని ఊహించుకొంది. వెంటనే ఆమెకొక్కక్షణం గుండె ఆగిపోయింది...

అతను?

ఎవరు?

ఆ వేళ హరిప్రియా వరప్రసాదూ గదిలో నుంచి హార్ట్‌ట్రబుల్స్‌ని గురించి చర్చించుతూ ఇంటిముందరి కాంపౌండ్‌లోకి వచ్చి లాన్‌లో కూర్చున్నారు.

'ఏమో ప్రసాద్! ఆలోచిస్తుంటే నాకీ శరీరశాస్త్రం మీద నమ్మకం పోతోంది. హృదయం సరిగావుండే హృద్రోగం పాలయినవాళ్లు కూడా వున్నారు!'



తరంగాలూ అంతరంగాలూ

'అంతమాత్రంలో శరీరశాస్త్రం ఆవిశ్వసనీయం కాదు హరీ! మానసిక ఆరోగ్యం శరీర ఆరోగ్యాన్ని కాపాడుతుందన్న విషయాన్నికూడా ఎవరూ కాదనలేరు.'

అంతలో కాంపౌండ్‌లోకి ఓ ఇద్దరు యువకులు ఒకరి వెనుకన ఒకరు పరుగెత్తుకుంటూ వచ్చారు. ముందువచ్చిన యువకుణ్ని వెనుకవచ్చిన యువకుడు పట్టుకొని వంచి అతనివీపుమీద గట్టిగా నాల్గు ప్రహారాలు వేశాడు.

వరప్రసాద్ గబగబా లేచి వాళ్లిద్దర్నీ విడిపించాడు. దెబ్బలుతిన్న యువకుడు లేచి తిట్టుకొంటూ బైటకు వెళ్లిపోయాడు.

'ఏమిటోయ్! ఎంత కోపమైతే మాత్రం పశువుల్లాగా కొట్టుకోవడమేమిటి?' మిగిలి వున్నవాణ్ణి అడిగాడు ప్రసాద్.

'మీదాకా వస్తేనే కాని తెలియదు సార్' అంటూ ఆ వ్యక్తి సమీపంలో హరిప్రియ వుండడం గమనించి మాట్లాడ్డం ఆపేశాడు.

'ఏం జరిగిందసలు?' హరిప్రియే ప్రశ్నించింది.

'మీవంటి మర్యాదస్తులు వినకూడని కథలే అమ్మా!' అతని కంఠంలోంచి దుఃఖం తొంగి చూస్తోంది.

అంతలో హరిప్రియ తండ్రి డాక్టర్ రమణారావుగారు కారులోంచి దిగి వాళ్లవైపే రావడంతో ఆ వ్యక్తి వెళ్లిపోయాడు.

'అల్లుడు ఉత్తరం వ్రాశాడు హరీ' అంటూ ఆయన ఓ కవర్ని కూతురి చేతిలోవుంచి వరప్రసాద్‌ని పలుకరించి లోపలికి వెళ్లిపోయాడు.

'ఒక్కనిముషం ప్రసాద్! ఈ వుత్తరం చదివి మాట్లాడ్తాను' అంటూ కవర్ని చింపి చదవటం మొదలుపెట్టింది హరిప్రియ. ఆమె మొహం గంభీరంగా మారిపోయింది. ఆమె కళ్లు ఆ ఉత్తరంలోని అక్షరాల్ని గుచ్చి గుచ్చి చదువుతున్నవి. ఉత్తరం చదవడం అయిపోగానే ఆమె కళ్లెత్తింది. వరప్రసాద్ ఆమెనే విచిత్రంగా చూస్తున్నాడు.

'ఏమిటీ ప్రసాద్! చూస్తున్నావు?'

'నువ్వు ఇండియాలోనే వున్నావా? లేక మీవారితో పాటు అమెరికాకే వెళ్లి పోయావా?' అని!

'నిజమే ప్రసాద్! ఆయన వుత్తరం చదువుతున్నప్పుడు అక్కడే వున్నాననిపించింది.'

'ఏమని వ్రాశాడేమిటి మీ శ్రీవారు?' కుతూహలంగా అడిగాడు వరప్రసాద్.

'అక్కడ స్త్రీ పురుషులు ఎంతో స్వేచ్ఛగా తిరుగుతారనీ, స్త్రీ పురుష సంబంధాల్లో మనకు విధించినన్ని నియమ నిబంధనల్ని ఆ సమాజం విధించలేదనీ అందుకనే ఆ సమాజం సుఖ పడ్తోందనీ, వ్రాశాడాయన.' గంభీరంగా అన్నదామె.

'ఐతే మీ ఆయనా ఆ స్వేచ్ఛలో పడిపోయాడని విచారిస్తున్నావా హరీ,' నవ్వుతూ అడిగాడు వరప్రసాద్.

సమాధానం చెప్పకుండా హరిప్రియ ఆకాశాన్ని చూస్తూ వుండిపోయింది. సూర్యుడప్పుడే అస్తమిస్తున్నాడు. మబ్బుల తునకల మీది ఎర్రంగు హత్య చేయబడ్డ ఆకాశం శవంలోంచి చిందిన మాంస ఖండాల్లా మారిపోయినవి.

పక్షులన్నీ స్వేచ్ఛావిహారాన్ని ముగించుకొని రొదచేస్తూ గూళ్లకి చేరుతున్నవి.

'నేను వెళ్లొస్తాను హరీ!' అంటూ లేచాడు వరప్రసాద్.

'అలాగే ప్రసాద్!'

వరప్రసాద్ వెళ్లిపోయాడు. హరిప్రియ ఆకాశాన్ని చూస్తూ ఊహాలోకాల్లో అమెరికాకి వెళ్లిపోయింది....

నిజంగా అమెరికాలో అలాంటి జీవితం వుందా? నిజమే కావచ్చును. అలాంటి జీవితంలో తప్పేముంది? స్వేచ్ఛా ప్రణయంలో ఒకవేళ ఏదైనావుంటే అది సుఖమే! తనభర్త అమెరికాలో ఎందరెందరు ఆడపిల్లలతో తిరుగుతున్నాడో...!

ఈర్ష్యతో హరిప్రియ కదిలిపోయింది.

తానెంత దురదృష్టవంతురాలు!

చీకటి పడింది. చలిగాలి మొదలైంది. ఇంతలో హరిప్రియ తండ్రివచ్చి 'ఒక్కతివే చీకట్లో కూర్చున్నావేమమ్మా!' అనడంతో హరిప్రియ లేచి ఇంట్లోకి వెళ్లింది.

హరిప్రియ భోజనంచేసి లైటార్పి బెడ్‌మీద పడుకొంది. ఆమెకి ఆ సాయంకాలం దృశ్యం జ్ఞాపకం వచ్చింది. ఆ యువకుడెందుకతణ్ని కొట్టాడు?తాను కారణమడిగితే – అది మీ లాంటి మర్యాదస్తులు వినగూడని కథలే అమ్మా – అని ఎందుకు చెప్పాడతను? పేదవాడి జేబుకి ధనం దూరమయినట్లుగా ఆ రాత్రి హరిప్రియకంటికి నిద్ర దూరమయింది.

మర్యాదస్తులు అనబడే తమ వర్గంలో మాత్రం వినగూడని కథలెన్ని జరగడం లేదు! ఈ వినకూడని కథలే ప్రపంచంలో ఎక్కువగా జరుగుతూ వినదగిన కథలే తక్కువగా జరుగుతవేమో? అందుకే అన్ని భాషల్లోని కాల్పనిక సాహిత్యాల్లోనూ మర్యాద తప్పిన పాత్రలే నాయకత్వం వహిస్తున్నవేమో?

తన భర్త ఆ గంధర్వ లోకంలో వుంటూ వైరాగ్యంతో వుంటాడని తానెలా నమ్మగలదు?

హరిప్రియకి అసూయతో తల బద్దలౌతోంది. క్రమంగా తెల్లవారు ఝామున హరిప్రియ నిద్రలోకి జారింది.

ఇది జరిగిన కొన్నాళ్లకి హరిప్రియా వరప్రసాదూ కలిసి కారులో ఊరవతలికి షికారుకెళ్లారు. ఒక చెరువుకట్ట దగ్గిర దిగి వాళ్లిద్దరూ చెరువుగట్టు మీద కూర్చున్నారు. దూరంగా దిగువన గొర్రెల కాపరి గొర్రెల్ని అదిలిస్తున్నాడు. పడమట సూర్యుడు మండుతున్న ఇనుపగోళంగా మారి చల్లారిన చెరువులోని నీళ్లని వేడి చేయడానికేమో నన్నట్లుగా నీళ్లల్లో పడిపోతున్నాడు!

'హరీ!' వరప్రసాద్ నెమ్మదిగా పిల్చాడు. హరిప్రియ మౌనంగా ఎగిరిపోతున్న పక్షుల్ని చూస్తోంది. చలిగాలి వీస్తోంది.

వరప్రసాద్ చేయి హరిప్రియ ఒళ్లో వాలింది. అతని స్పర్శ ఆమెకి అలవాటే అయినా ఈసారి ఎందుకో అతని స్పర్శ ఆమెని కదిలించివేసింది. ఆ స్పర్శానుభూతిని గమనించలేదన్నట్లుగా హరిప్రియ నిగ్రహంతో అన్నది.

'ఈ చెరువులో లేస్తున్న చిరు తరంగాల్ని చూడు ప్రసాద్! మెల్లిగా వీచినగాలి ఒకేఒక్క తరంగాన్ని సృష్టిస్తుంది. కాని ఆ ఒక్క తరంగమే అనేక తరంగాల సృష్టికి కారణమై చెరువులోని నిశ్చలత్వాన్ని హరించి పారవేస్తుంది.' గంభీరంగా అన్నది హరిప్రియ.

'నిజమే! కాని ఆ తరంగాలు లేకుండా వుండే నిశ్చలజలంతో ఈ చెరువుకీ శోభ వస్తుందంటావా హరీ!'

'ఈ నాలుగు కట్టల్నీ తెంపి అవతల పడనంతకాలమూ ఈ చిన్న అలలవల్ల శోభ కల్గుతుంది ప్రసాద్!'

'కాని ఒక్కొక్కప్పుడు ఈ చెరువులోని నీరు బైటకు పోవడమే మంచిదేమో హరీ! అలాంటి వీలే లేకపోతే గట్లుతెగి ఈ చెరువే మిగల్దేమో!' అన్నాడు వరప్రసాద్.

హరిప్రియ మౌనంగా చెరువువైపుకి చూస్తోంది. నీళ్లల్లో నీటిపాములు ఈదుతూ అస్తమయ సూర్యుని కిరణాల వెల్తుర్లో సుందరంగా వెలిగిపోతున్నవి.

'ఆ నీటి పాముల్ని చూడు ప్రసాద్!'

'ఏముంది హరీ వాటిల్లో.'

'ఇవే నీటిపాములకి విషముంటే మనమింత సౌందర్యదృష్టితో వాటిని చూడగలమా?– అని ఆలోచిస్తున్నాను ప్రసాద్!'

'దానికీ దీనికీ పొత్తేమిటి హరిప్రియా!'

'శత్రువుని కాటెయ్యాలని పాముకుండే మనస్తత్వమే మనిషికీ వున్నదేమో ప్రసాద్! స్త్రీ తన భర్తకి చుట్టూతా ఒక కోట కడ్తుంది. పురుషుడు తన భార్య చుట్టూతా అలాంటిదే ఒక కోట కడ్తాడు. వాటితో...' ఆమె ఆ పైన చెప్పలేదు! ప్రసాద్ హరిప్రియకి ఇంకా దగ్గరైనాడు. ఆమె చేతుల్ని తన చేతుల్లో బిగించాడు!

దాన్తో హరిప్రియ గభాల్న లేచి నిలబడి

'ఇంక వెళ్దాం ప్రసాద్!' అంటూ కారు వైపుకి నడిచింది.!

వరప్రసాద్ ఆశ్చర్యంతో లేచి ఆమెని అనుసరించాడు. కారుని నడుపుతూ హరిప్రియ మనస్సులో అనుకొన్నది – చెరువులోని నీళ్లని చెరువులోనే వుంచేసిందేంతాను! ప్రసాద్ స్పర్శలోని సుఖాన్ని అనుభవించకుండా తానెందుకు గృహోన్ముఖమవుతోంది? పిరికితనమా? లేక హృదయంలోని పాపభీతి తననిలా తరిమివేస్తున్నదేమో? హృదయంలోని ఖాళీ స్థలం వైశాల్యం ఒక్క చదరపుటంగుళమైనా లేదే! ఆ చిన్న స్థలంలో ఈ పాప పుణ్యాలెక్కడ దాక్కుంటున్నవి? అవి వచ్చే జన్మకి కూడా వెన్నంటి వస్తవని ఈ మతాలు జనానికెందుకు అబద్ధాలు చెప్తున్నవి? సుఖాన్ని తిరస్కరింపజేసి ఈ మతాలు మానవుల జీవితాల్ని ఎందుకు దౌర్భాగ్య జీవితాలుగా మారుస్తున్నవి? ఇవేళ్టి నుంచి తాను...'

'హరీ! కారాపు!' అని ఇంతలో వరప్రసాద్ బిగ్గరగా కేక వేశాడు. ఆలోచన్ల నుంచి ఈ లోకంలోకి వచ్చి హరిప్రియ బ్రేక్‌వేసి కారాపి క్రిందికి దిగింది. ఒక వ్యక్తి కారుకెదురుగా వచ్చాడు. క్షణంలో ప్రమాదం తప్పింది! అయినా ఆ వ్యక్తి మోకాలికి కారు ముందుభాగం తగిలి కాస్త రక్తస్రావం అవుతున్నది. వరప్రసాద్ సాయంతో ఆ వ్యక్తిని లేవదీసింది హరిప్రియ.

అతను?

'ఆనాడు తమ కాంపౌండ్‌లోకి పరుగెత్తుకుంటూ వచ్చి మరో యువకుణ్ని కొట్టినవాడు!' హరిప్రియ అతణ్ణి తేరపార జూస్తూ –

'కారు క్రింద పడాలని ఎందుకోయ్ ప్రయత్నం చేశావ్?'

'నన్ను చావనీయకుండా ఎందుకమ్మా దయదల్చారు' జాలిగా అడిగాడా యువకుడు.

'కార్లో కూర్చుందాం పద' అంటూ అతణ్ని వాళ్లిద్దరూ కార్లో కూర్చోబెట్టి ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ తీసి అతని మోకాలికి కట్టు కట్టారు. కట్టు కడ్తున్నప్పుడడిగాడు వరప్రసాద్.

'నీ పేరేమిటోయ్!'

'చంద్రయ్య బాబూ!'

'జీవితంమీద ఎందుకు నీకీ విరక్తి?'

'ఈ బండిని లాగడానికిప్పుడు రెండో ఎద్దు సాయంలేదు బాబూ' అతని కంఠంలో తీరని వ్యధ ధ్వనించింది.

'భార్య చచ్చిపోయిందా?'

'లేదండీ! అది చచ్చినా బాగుండేది! అది బ్రతికి నన్ను ప్రతిక్షణమూ చంపుతోంది.'

వరప్రసాద్ ఆపైన చంద్రయ్యని ఇంకేమీ అడగలేదు. కారు నడుపుతూ వెనక్కితిరిగి అడిగింది హరిప్రియ.

'మీ ఇల్లెక్కడుంది చంద్రయ్యా!'

'మా బస్తీదాకా ఎందుకు లెండమ్మా! ఇక్కడే ఎక్కడైనా ఆపండి.' అన్నాడు చంద్రయ్య వినయంగా.

'అదేమిటోయ్! రేపు పొద్దున మళ్లీ వచ్చి కట్టుకట్టొద్దూ? నువ్వు చూపించకపోతే మీ ఇల్లెలా తెలుస్తుంది!' అన్నదామె.

'ఎంతో దయగలవాళ్లు తల్లీ మీరు!' గాద్గద్యంతో అన్నాడు చంద్రయ్య. అతను చూపించిన గుడిసెముందు కారాగింది. హరిప్రియా వరప్రసాదూ అతణ్ని చెరోవేపు పట్టుకొని గుడిసెలోపలి కుక్కి మంచంమీద పడుకోబెట్టారు.

'నీ భార్యని పిలువు చంద్రయ్యా! నీకెట్లా సేవ చేయాలో చెప్తాను.' అన్నది హరిప్రియ.

'నాకంత అదృష్టముండదులే అమ్మా' అన్నాడు చంద్రయ్య ఆ మాటలకి బాధగా.

హరిప్రియా వరప్రసాదూ ఇళ్లకు వెళ్లి తిరిగి మర్నాడు వచ్చారు. అప్పుడు కూడా ఆ గుడిసెలో చంద్రయ్య తప్ప ఎవ్వరూ లేరు. అతని జీవితంలోని అపశృతి కొంచెం కొంచెం అర్థమౌతోంది వాళ్లకి.

'చంద్రయ్యా! ఎలా వుంది నొప్పి.' హరిప్రియ అడిగింది.

'చాలా నొప్పిగా వుందమ్మా! రాత్రల్లా కాలు ఒకటే తీపు!'

అంతలో ఎవరో స్త్రీ లోపలికి వచ్చింది. ఆమె బహుశః చంద్రయ్య భార్య అయి వుంటుందనుకొన్నది హరిప్రియ. ఆమె నిజంగానే చంద్రయ్య భార్య! కాని ఆమె వీళ్లెవ్వరితోటి మాట్లాడలేదు. చంద్రయ్య ఆమెని చూసికూడా చూడనట్లే ప్రవర్తించాడు!

'రాత్రల్లా నిద్ర లేదమ్మా! నిద్ర రావడానికేదైనా మందివ్వండి' అన్నాడు.

'అలాగే చంద్రయ్యా!' అంటూ రెండు మాత్రలిచ్చి హరిప్రియ వరప్రసాద్‌తో బైలుదేరింది.

ఆ మర్నాడు సాయంకాలం హరిప్రియా వరప్రసాదూ మళ్లీ చంద్రయ్య గుడిసెకి వచ్చారు. నిజానికి హరిప్రియకీ అతనికీ ఏ రకంగానూ స్నేహం లేకపోయినా ప్రతి మనిషికీ అవతలి మనిషి జీవిత రహస్యాలు తెలుసుకోవాలని వుండే ప్రబలమైన కోరికే ఆమెలోనూ వుండడంచేతా, చంద్రయ్య జీవితంలోని అసంతృప్తికి హేతువుని తెలుసుకోవాలని ఆమెకి గట్టిగా అన్పించడం చేతా, అన్నింటికి మించి చంద్రయ్య ఆమె కారు కిందే పడడమూ ఆమెని ప్రతిరోజూ అతని ఇంటికి వెళ్లేట్లుగా చేసినవి – అంత బలంగానూ మిసమిసలాడే ఆరోగ్యకరమైన శరీరంతోనూ వుండే చంద్రయ్య ఆవేళ బాగా నీరసపడిపోయాడు.

'రాత్రి మాత్రలేసుకొన్నా నిద్రపట్టలేదమ్మా'

'ఇవేళ పడ్తుందిలే' అంటూ వేరే మాత్రలిచ్చి బైటకు వచ్చారు హరిప్రియా వరప్రసాదూ. చంద్రయ్య వాళ్లిద్దర్నీ ఎంతో కృతజ్ఞతతో చూశాడు. కాని బైట నిల్చుని వున్న అతని భార్య మాత్రం ఒక్క మాటైనా పల్కలేదు!

అక్కణ్ణించి వరప్రసాద్‌తో సినిమాకి వెళ్లింది హరిప్రియ. రికార్డుల సంగీతం నెమ్మదిగా మోగుతుండగా హరిప్రియ అన్నది.

'చంద్రయ్య పెళ్లాం అన్యాయంగా ప్రవర్తిస్తోంది.'

'ఆమెని విడిచేసి మరొకర్ని చేసికొంటే పీడాపోతుంది కదా!' అన్నాడు వరప్రసాద్.

హరిప్రియ మౌనంగా వుండిపోయింది –

విడవడం అంత తేలికైన విషయమా?

చంద్రయ్యకి భార్యమీద ప్రేమ వుందేమో? అలాంటప్పుడు పురుషుని హృదయంలో ఎంతటి అసూయ చోటు చేసికొంటుంది. భర్తని అలా బాధపెట్టి తాను సుఖపడేదేముంది గనుక! –

సినిమా ముగిసింది. కారులోని వెచ్చదనంతో బైటి చలిగాలి యుద్ధంచేసి అడపాదడపా జయిస్తోంది. కారు నెమ్మదిగా వరప్రసాద్ రూమ్ ముందరికి వచ్చింది. కారునాపి అతనికి గుడ్‌బై చెప్పింది హరిప్రియ.

'లోపలికోసారి వచ్చిపో హరీ!' అన్నాడతను.

'ఇంత రాత్రివేళ ఎందుకు? పైగా నిద్రవస్తోంది' అన్నది హరిప్రియ.

'నెస్‌కేఫ్ కలిపి ఇస్తాను పద హరీ!'.

అతని బలవంతానికి హరిప్రియ కారు దిగి అతని గదిలోకి ప్రవేశించింది. అతను లోపలికి వెళ్లి రెండుకప్పుల్లో నెస్‌కేఫ్ కలిపి తెచ్చాడు. ఓ కప్పు ఆమెచేతికిచ్చాడు! ఆమె స్పర్శకి అతని నరాలు ఉద్రేకం పుంజుకున్నవి. అతను కాఫీత్రాగుతూ ఆమెనే చూస్తున్నాడు. అది గమనించి హరిప్రియా అతని కళ్లల్లోకి చూసింది. అతని కళ్లల్లో భయంకరమైన ఆకలి కన్పించిందామెకి! ఆ కళ్లల్లో....

ఆకలి తీర్చుకోవడానికి హత్యలైనా చేయగలవాడి భావం!... కన్పించిందామెకి. అయినా అతన్ని చూస్తుంటే ఎందుకో ఆమెకి భయం కలుగలేదు. బహుశః ఆమె కళ్లూ అతనికి అలాగే కన్పించినవేమో!

'హరీ!' అతనికంఠం ఏదో మత్తుతో నిండివుంది. అతని శరీరం ఆమెని సమీపించి ఆమెని గట్టిగా చుట్టేసింది.

'హరీ!' అతని కంఠంలో చేదుకలిసిన మామిడిపండు రసంవుంది.

అతని పరిష్వంగంలో ఆమెకి ఊపిరాడడంలేదు. అతని పెదాలవేడికి ఆమె చెక్కిళ్లు కాలిపోతున్నవి. అతని చైతన్యం ముందు ఆమె జడపదార్థమయి

పోయిందా?.

అంతలో ఏదో గుర్తుకొచ్చి ఆమె తన బలమంతా ఉపయోగించి అతణ్ని తోసేసింది.

'ఏమిటి హరీ!' వెనక్కి జరిగిన వరప్రసాద్ అడిగాడు అదోలా!

'గుడ్‌బై!' గంభీరంగా అంటూ హరిప్రియ బైటకు వెళ్లిపోయింది. అతనంతచేసినా ఆమెకి అతనిమీద అణుమాత్రమైనా కోపం రానిమాట వాస్తవం! తనని అతనలా ఎందుకు దగ్గరికి తీసికొన్నాడు! తీసికోగల్గాడు! తన మనస్సులో సమ్మతి లేకపోతే ఏ మొగాడైనా అంతటి ధైర్యం ఎలా చూపగలడు? అందుకే అతనివేళ అంత ధైర్యం చూపించాడు! పాపం! తన ఆకస్మిక తిరస్కారానికి అతనెంత బాధ పడ్డాడో!

అంతలో ఆమెకి అమెరికా వెళ్లిన భర్త గుర్తుకొచ్చాడు. అతని స్మృతితో హరిప్రియ ఉక్కిరి బిక్కిరై పోయింది. ఇదేమిటి? తానిలా అయిపోతోంది! తన మనస్సిలా స్వాధీనం తప్పుతోందేం! పాపభీతి తనలో దినదినమూ అడుగంటి పోతోందేం? ఉహు. తానేం తప్పు చేస్తోంది. ఇవేళ వరప్రసాద్‌ని తిరస్కరించలేదూ తాను! పాపం! రేపతణ్ని ఓదార్చాలి.

మర్నాడు ఆదివారం. హరిప్రియ అతనింటికి వెళ్లింది. కాని అతని గదికి తాళం వుంది! చంద్రయ్య గుడిశెకి వెళ్లి అతణ్ని చూసి వద్దామని అతని బస్తీకి కారు మళ్లించింది హరిప్రియ.

తెల్ల మబ్బుల్లోంచి సూర్యుడు వెల్తురు చిమ్ముతున్నాడు. నీలి ఆకాశం, తెల్లని మబ్బులూ ప్రకృతిని సుందరంగా మారుస్తున్నవి.

దూరం నించే చంద్రయ్య ఇంటిముందు జనం మూగి వుండడం గమనించిన హరిప్రియకి గుండె గతుక్కుమన్నది. అనుభవంలేని తన వైద్యం వికటించి అతని గాయం వల్ల టిటానస్ వచ్చి చంద్రయ్యకేమీ ప్రమాదం వాటిల్లలేదు కదా! – కారాపి గబగబా హరిప్రియా గుంపుని తొలగించుకొంటూ లోపలికి వెళ్లింది.

అక్కడి దృశ్యం హరిప్రియని ఒక్కక్షణం కంపింపజేసింది.

చంద్రయ్యకి చుట్టూతా నలుగురు పోలీసులున్నారు! గుడిసెలో మూలన ఒక శవం పడివుంది. ఆశవం గుండెమీద రక్తం మడుగు వుంది. ఆ శవం కాళ్లమీద చంద్రయ్యభార్య పడిపోయి వెక్కివెక్కి ఏడుస్తోంది. ఆ శవం ఇంతకుముందు హరిప్రియ చూసిన మనిషిదే! ఆనాడు ఆమె కాంపౌండ్‌లో అతణ్నే చంద్రయ్య కొట్టింది!

హరిప్రియని చూసి చంద్రయ్య చిరునవ్వు నవ్వాడు!

అంత ప్రమాదం వాటిల్లినా చంద్రయ్య ముఖంలో ఎన్నడూ రాని నవ్వు రావడంతో హరిప్రియకి జీవితమర్థమయినట్లనిపించింది.

చంద్రయ్య ఎవ్వరితోటీ అబద్ధమాడలేదు. తన భార్య ప్రియుణ్ని తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడతను!

కోర్టు అతనికి యావజ్జీవ ఖైదు వేసింది.

ఆనాడు హరిప్రియ కోర్టుకి వెళ్లింది. జైలుకు తీసికెళ్తున్న చంద్రయ్యని కోర్టు వరండాలో కలిసింది హరిప్రియ!

అతనెంతో విచారగ్రస్తుడై వున్నాడు!

హరిప్రియ కళ్లల్లో నీళ్లు తిరిగినవి!

'చంద్రయ్యా! అప్పీలు చేసికో!' అన్నది. అతను బాధగా నవ్వాడు.

'చంద్రయ్యా!'

'ఏమిటమ్మా?'

'బాధ పడ్తున్నావా?'

'ఏం లేదు కాని దాని మనస్సు పొందలేక పోయినందుకు గుండె బరువౌతోందమ్మా! కనీసం వాణ్ని చంపినప్పుడైనా అది పశ్చాత్తాపంతో నా కాళ్లమీద పడ్తే జైల్లో ఒక్క జీవితం కాదు! పది జీవితాలు గడుపుతాను!'

పోలీసుల్తో ముందుకి సాగిపోయాడు చంద్రయ్య. హరిప్రియ బాధగా ఇంటికి మళ్లింది.

ఆనాడు ఎనాటమీ పుస్తకాన్ని వరప్రసాద్‌కిద్దామని అతని గదికి వెళ్లింది హరిప్రియ.

వరప్రసాద్ మంచంలో పండుకొని వున్నాడు. జుత్తు దువ్వుకోలేదు! రెండు రోజుల్నించి గడ్డం చేసికోలేదు! అతని పచ్చని గడ్డం మెరుస్తోంది!

'నీ పుస్తకం నీకిచ్చేద్దామని వచ్చాను ప్రసాద్! అతను మౌనంగా ఆమె కళ్లల్లోకి చూస్తూ ఆ పుస్తకాన్ని తీసికొని మీద పెట్టాడు. హరిప్రియ కూడా మంచం మీదే కూర్చుంది. జ్వరగ్రస్తుడి స్పర్శకి థర్మామీటర్‌లోని పాదరసంలా వరప్రసాద్ ఆమె సాన్నిధ్యంలో ఉద్రిక్తుడైనాడు. అతని కళ్లల్లోని ఆకలి రెట్టింపయింది. అరక్షణం వ్యవధిలో అతను హరిప్రియని కమ్మేశాడు.

'ప్రసాద్! నన్ను వదులు!' కఠినంగా అన్నది హరిప్రియ.

అతను వదల్లేదు. అర్థంలేని మాటల్తో గొణుగుతూ తన పట్టునింకా బిగించాడు వరప్రసాద్!

'నీ కే చెప్తున్నాను ప్రసాద్! నన్ను వదులు!' ఇంకా దృఢంగా – రెట్టింపు కాఠిన్యంతో అన్నది హరిప్రియ.... కాని లోపల ఆమెగుండె కరిగిపోతున్న సంగతి ప్రసాద్ గమనించలేదు – జడత్వం పొందిన సూర్యకిరణ తీక్షణతకి కరిగి జారిపోయే హిమఖండంలా మారిన అతను ఆమెని వదిలేశాడు!

'దీన్లో తప్పేముంది హరీ!'

'మరి దీన్లో ఏముంది ప్రసాద్!' గంభీరంగా అడిగింది హరిప్రియ.

'సుఖం!' అన్నాడు వరప్రసాద్.

'ఈర్ష్యాద్వేషాలు చుట్టు ముట్టుకొని వున్న సుఖం నాకక్కర్లేదు ప్రసాద్.'

నీమీద నాకెలాంటి ఈర్ష్యాలేదు హరీ'

'మన సుఖాన్ని ద్వేషించేవాళ్లుండగా నేను సుఖపడలేను ప్రసాద్!'

గభాల్న హరిప్రియ అవతలకి పరుగెత్తి ఇంటికి వెళ్లిపోయింది.

ఇది జరిగిన మూణ్నెల్లకే చంద్రయ్య శవం ఎనాటమీ హాల్లో ప్రత్యక్షం.

– – – – –

చంద్రయ్యని గుర్తించి హరిప్రియ మసిల్‌ని డిసెక్ట్ చేయడానికి బదులు చంద్రయ్య గుండెల్ని చీల్చింది!

'ఇవేల అక్కడకాదు డిసెక్షన్' వరప్రసాద్ అన్నాడు.

'తెలుసును.'

'తెలిసే ఎందుకు చెస్ట్‌ని చీలుస్తున్నావ్! అక్కడ నువ్విదివరకు చెప్పిన ఈర్ష్యాద్వేషాలేం కన్పించవు మరి!' నవ్వుతూ అన్నాడు.

'అతణ్ని మోసగించిన భార్యమీద అతనికి ఉండే ప్రేమ బహుశః కన్పించ వచ్చునని!'

భావ గర్భితంగా అన్నది హరిప్రియ.

'మెడికల్ స్టూడెంట్‌వి! నీకా సెంటిమెంట్స్ వుండడం బాగుండలేదు హరీ!' ఆమె మాటల్ని అర్థంచేసికొంటూ అన్నాడతను.

'మీ లాంటి వైద్య విద్యార్థులకి ఈ ఎముకలగూడు శరీర శాస్త్రాన్ని బోధిస్తోంది. కాని నాకదే గూటిలో వుండిపోయిన చిలుక సాంఘిక శాస్త్రాన్ని బోధించింది. నిజాయితీని చెప్పింది. ప్రేమని నేర్పింది' అన్నది హరిప్రియ.

'దాన్తో పాటుగా నిన్నో ఆడ సన్నాసిని చేసింది కూడా' అన్నాడు వరప్రసాద్.

ఆ మాటలు హరిప్రియ గుండెల్లో బాకుల్లా దిగినవి.... కాని తాను భవిష్యత్తుని ఆలోచించకుండా ఉండలేదు! తన భర్తని తాను మోసగించలేదు! హృదయంలోని కోర్కెల్నీ అణచలేదు; తార్కిక శక్తితో మంచి చెడుగా, చెడుని మంచిగానూ చిత్రించవచ్చును. కాని అసలైనది... హృదయ సత్యమంటూ ఒకటి వుంటుంది. సాంఘిక నియమాలకన్నా అది ఉన్నతమైనది. వరప్రసాద్ అన్నట్లుగా తాను నిజంగానే సన్యాసి అయిపోతోందా?

కాదు! కాకూడదు! జన్మజన్మలకీ తనకదంటే ఇష్టంలేదు!

మరి???

అతనన్నట్లుగా తాను సెంటిమెంటల్ వ్యక్తి కావచ్చును. భర్తని మోసగిస్తున్నాననే భావంతో సుఖపడలేని స్త్రీ కావచ్చును తాను.

అలవాటుగా వున్న సంప్రదాయాలు తన నరనరాన బీజప్రాయంగా వుండి తన మనస్సులోని విప్లవశక్తిని అణిచివేస్తుండ వచ్చును. చెరువులోంచి నీరు గేట్లు తెంపుకొని బైటకు పారిపోతుంటే కొందరికి అందంగానే వుండవచ్చును. తనకీ ఊహలో అందంగానే కన్పిస్తోంది. కాని నిజంగా అదే జరిగినప్పుడు దానిలోని సౌందర్యాన్ని తాను చూడగలదా? వట్టిది! తాను పిరికిది! ఆమెని చూస్తూ చిరునవ్వుతో వరప్రసాద్ బైటకు వెళ్లిపోయాడు.

'ఓహ్! అతని నవ్వెంత చక్కగా వుంది!'

ఆ మర్నాటి నుంచి హరిప్రియ మెడిసిన్ చదవడం మానేసింది!

(18.07.1969 నాటి ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురితం)

కేమొమిల్లా

ఆ పెంకుటింటి చూరు కిందికి వానలో తడుస్తూ వచ్చిన ఆ ఇద్దరు వ్యక్తులు గబగబా డబడబా అక్కడి తలుపులపై బాదారు. చీకటిలో కుండపోతగా నల్లగా కురుస్తున్న వానకి వాళ్లు తెచ్చిన లాంతరు కాస్త కాస్త వెలుగుని రుద్దుతూంది.

వాళ్లు తలుపులపై మళ్లీ బాదారు. లోపలి వ్యక్తి తలుపులు తీశాడు. చూరుకింద నిలబడ్డ వ్యక్తుల్ని లోపలికి రమ్మన్నాడు. వాళ్లు లోపలికి వచ్చారు. వాళ్ల చేతుల్లో ముల్లుకర్రలు ఉన్నవి. పైన గొంగళ్లు కప్పుకొన్నా అవి అప్పటికి తడిసిపోయి ఉన్నవి.

"ఏం పనిమీద వచ్చారీ అర్ధరాత్రి?"

"మీరు అర్జెంటుగా వచ్చి మా అమ్మగారిని చూసిపోవాలండీ."

"ఎవరు మీ అమ్మగారు?"

"మా నాలాయనీదేవిగారే తెలియదా మీకు!" ఆశ్చర్యంగా అన్నారు వాళ్లు.

"ఏమైంది ఆమెకి?" గదిలో దీపం వెలుగు ఎక్కువ కావడంతో లాంతరుని తగ్గిస్తూ అడిగాడతను.

ఆగంతుకు లిద్దరూ ఆ ప్రశ్నకి మౌనంగా ఉండిపోయారు.

"ఏం కాలేదా మీ అమ్మగారికి?" తిరిగి అడిగాడతను.

"ఏం కాకపోతే ఎందుకొస్తామండీ?"

"మరి?"

"మే మేమీ చెప్పలేమండీ! దయ ఉంచి మీరే ఒకసారి వచ్చి చూసి నిశ్చయించండి." నీళ్లు నములుతూ, చేతులు జోడిస్తూ అన్నారు వాళ్లు.

"అది నిజమే నయ్యా! నాతో కొన్ని మందు లిప్పుడు తెచ్చుకోవాలి గదా! అందుకోసమని ఆమె జబ్బు లక్షణాలేమిటని అడుగుతున్నాను."



“దెయ్యం పట్టింది!” సుత్తితో కొట్టినట్లుగా సమాధానం చెప్పారు వాళ్లిద్దరూ ముక్తకంఠంతో.

అతను నవ్వుకొన్నాడా సమాధానానికి. కొన్ని మందుల్ని మెడికల్ ఛెస్ట్‌లో వేసుకొని, రెయిన్‌కోట్ వేసుకొని పైన గొడుగు వేసుకుని స్టెతస్కోప్‌తో బయలుదేరాడు.

“ఎంత దూర ముంటుంది?” నడుస్తూ అడిగా డతను.

“ఈ పక్క ఊరేనండి!”

ఆ చీకటిని చీలుస్తూ చిన్నదే అయినా లాంతరు బాగానే దారి చూపుతోంది. చిన్నదయితేనేం, పెద్దదయితేనేం? దారి కనుపించే వెలుతురిస్తే అంతకన్నా కావలసిన దేముంది? కాని వీధుల్లో ఎలెక్ట్రిక్ లైట్ల వెలుతురికి అలవాటు పడ్డవాళ్లకి లాంతరు వెలుగుతో తృప్తి ఉండదు.

ఆ ముగ్గురూ నడుస్తున్నారు. వాన జోరుగానే కురుస్తూంది. లాంతరులో వత్తి వెలుతురు గాలికి పైకీ కిందికీ దుముకుతూంది. వెలుతురు దొరికింది కదా అని దోమలు లాంతర్ని చుట్టుముట్టుతున్నాయి.

అతని పేరు శశిభూషణ్. ఆ ఊరికి వచ్చి నాలుగు నెలలే అయింది. అతనో డాక్టర్. చాలా తక్కువ ఖరీదుకే మందులిస్తుంటాడు. డబ్బులెక్కువగా సంపాదించి దాచిపెట్టడానికి అతనికి వెనకా ముందూ ఎవ్వరూ లేరు. మరీ బీద రోగులకు అతను ఉచితంగానే చికిత్స చేస్తాడు.

అతని వైద్యమొక ఎత్తు అతని స్నేహమొక ఎత్తు! ఎంత చిన్న రోగి అయినా అతనితో స్నేహం చేయకుండా అతని దగ్గిరనుంచి మందు తీసుకోలేడు. అలాగని చెప్పి రుసరుసలాడే రోగులకి అతను మందివ్వడని అర్థం కాదు. వాళ్లూ రుసరుసలాడుతూనే అతనితో స్నేహం చేస్తారు! కాని అలాంటి వాళ్ల స్నేహం మిరపకాయ బజ్జీ రుచిలాంటిది. కారంగానే ఉన్నా రుచిగానే ఉంటుందది!

ఒంటరిగాడైన శశిభూషణ్ ఆ ఊరికి ఎక్కడినుంచి వచ్చాడో ఎవ్వరికీ తెలియదు. అంత చక్కగా రోగాలు కుదిరించే అతను ఏ బస్తీలోనో ప్రాక్టీస్ పెట్టుకోక అంత చిన్న గ్రామంలోనే ఎందుకు ప్రాక్టీస్ పెట్టుకున్నాడో ఎవ్వరికీ

తెలియదు. ఒకళ్లిద్దరు జిజ్ఞాసువులు ఆ ఊరి రచ్చబండమీద డాక్టర్ శశిభూషణ్ పూర్వ చరిత్రని గురించిన తమ ఊహల్ని పక్కోళ్లకి అనువదించడానికి ప్రయత్నించకపోలేదు! కాని అంతలోనే ఆ ఊరికి డాక్టరెలాగా దిక్కులేడు – పిచ్చి ఊహలు, కోతి ఊహలతో ఆయన మనస్సు నొప్పించి అక్కడే స్థిరపడిపోదా మనుకొంటున్న ఆ మంచి డాక్టర్‌ని పారదోలడ మెందుకు? అన్న కొందరి వాదంతో ఆ జిజ్ఞాసువుల అనువాదం నిరోధించబడింది.

వాళ్లు ముగ్గురూ కాలవ దాటి ఒక మేడ ముందుకి వచ్చారు. ఆ మేడ ముందొక నీళ్ల ఫౌంటెన్ ఉంది. దానికి రెండు వైపులా రెండు తాటి చెట్లు ఆ గుడ్డి వెలుతురులో నల్లగా కనుపించినవి. పాలరాతి మెట్లమీదుగా వాళ్లు ముగ్గురూ లోపలికి వెళ్లారు. మెట్లమీద ఒకళ్లిద్దరు మనుష్యులు డాక్టర్‌కి నమస్కరించారు.

లోపలి హాల్లో ట్యూబ్ లైట్ల వెలుతురులో గోడలకి ఉన్న తైలవర్ణ చిత్రాల మీది నుంచి వింత వెలుతురులు పరావర్తనం చెందుతున్నవి. హాలు మధ్య సోఫా సెట్టులో బత్తాయి తొనలు విసిరివేయబడి ఉన్నవి! పైన ఫాన్ అనవసరంగా తిరుగుతూంది!

"అమ్మగారేం చేస్తున్నారు?" ఆ ఇద్దరూ అక్కడ నిలుచున్న మనిషిని అడిగారు.

"అరగంటాయె అమ్మగారు పడక గదిలో కెళ్లి."

శశిభూషణ్ రిస్ట్‌వాజీ చూసుకొన్నాడు. అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటి నలభై నిమిషాలయింది.

"మీ అమ్మగారిని లేపుతారా?" అడిగాడు డాక్టర్ శశిభూషణ్.

"అమ్మో! ఇప్పుడు లేపుతే..." భయంతో నోరు తెరిచి అన్నాడక్కడి నౌకరు.

"ఏం కాదు. లేపండి. నేను ఉన్నాను."

"మీకు తెలియదు, డాక్టర్ గారూ!" వాళ్లేదో డాక్టర్‌కి నచ్చజెప్పబోయారు.

"నాకంతా తెలుసులెండయ్యా! ముందామెని లేపండి. లేకపోతే ఆ గది చూపించండి. నేనే ఆ గది తలుపులు తీయిస్తాను." వాళ్లా రెండో సూచనకే ఒప్పుకొని "సరే"నన్నారు.

వాళ్లందరూ అతణ్ని మేడమీదున్న ఆమె గదికి తీసుకెళ్లారు.

వాళ్లంతా నాలాయనీదేవి తలుపులు తీసినా కనుపించకుండా ఉండేట్లుగా ద్వారబంధాల అవతల నిలబడ్డారు.

డాక్టర్ శశిభూషణ్ తలుపుపై తట్టాడు.

లోపల లైట్ వెలిగింది.

శశిభూషణ్ రిస్ట్‌వాచీ చూసుకొన్నాడు. పది నిమిషాలు తక్కువ ఒకటి!

తలుపులు తెరుచుకొన్నవి.

'ఎవరది?'

"నా పేరు శశిభూషణ్. డాక్టర్‌ని."

"లోపలికి రండి."

శశిభూషణ్ లోపలికి వెళ్లాడు.

ఏమిటో జరుగుతుందనుకొన్న నౌకర్లు ఏమీ జరగకపోవడంతో ఆశ్చర్యపడిపోయారు!

"కూర్చోండి!"

శశిభూషణ్ కూర్చున్నాడు. పైన ఫాన్ తిరుగుతూంది. చల్లని గాలికి శశిభూషణ్ కాస్త కలవరపడ్డాడు. ఇందాకటి నుంచి అతను వానలో నడిచి వచ్చినా అతని రెయిన్ కోట్ అతణ్ని చలినుంచి కాపాడింది. ఇక్కడ దాన్ని తీసేయడంతో అతని ఒళ్ళు ఆ చల్లదనానికి వణికిపోతూంది.

"ఏమైనా కావాలా?" ఆమె అడిగింది.

"ఒక్క గ్లాసెడు నీళ్లివ్వండి."

ఆమె లేచి కూజా వంచి, వెండి గ్లాసులో నీళ్లు తెచ్చి ఇచ్చింది. ఎంతో అయిష్టంతో ఆ చన్నీళ్లని తాగాడు డాక్టర్.

డాక్టర్ గ్లాసుని పక్కన టేబిల్ మీద ఉంచి ఆమెను చూశాడు.

ఒక చెంప పాలిపోయి ఉంది. మరో చెంప ఎఱ్ఱగా కంది ఉంది. ఆమె కళ్లు వాచి, ఎఱ్ఱగా ఉన్నవి.

కొనదేరిన ముక్కుకి ఆమె చేయి మాటిమాటికీ కర్చీఫ్‌తో బంధం వేస్తున్నది.

ఆమె నొసటి మీద చెమట. పైన ఫాన్ తిరుగుతున్నా ముత్యాల్లా చెమట బిందువులు.

"ఎవరు తెచ్చారు మిమ్మల్ని?" ఆమె అడిగింది.

"మీ మనుష్యులు!"

"నేనే పిలుద్దా మనుకొంటాను రోజూ! కాని, ఇదో వ్యాధి కాదుగదా? ఎందుకులే పిలవడ మనుకొంటాను."

"మీ బాధ ఏమిటి?"

"ఏమో? నాకే తెలియదు!"

ఆమె కళ్లలోకి చూశాడు డాక్టర్ శశిభూషణ్. ఆమె కళ్ల క్రింద ముడత లింకా పడలేదు. ఇరవై అయిదు సంవత్సరాల్ని మించి ఉండవామెకి. నొసట తిలకం లేదు. కాళ్లకు మట్టెలు లేవు. చేతులకి గాజులు లేవు. అయినా ఆమె కట్టుకొన్న జార్జెట్ చీర చూస్తూంటే ఆమె విధవ కాదేమో ననిపించిం దతనికి!

"రోజూ మీ కే సమయంలో హాయిగా ఉంటుంది?"

"ఇదే సమయంలో!"

"అంటే?"

"అర్ధరాత్రి పన్నెండు గంటల నుండి ఉదయం ఆరు గంటలదాకా!"

"ఓహో, అలాగా!" ఏదో అర్థమైనట్లుగా అన్నాడతను.

కాస్సేపు నిశ్శబ్దంగా ఉన్నారిద్దరూ.

"మీ భర్త ఏం చేస్తుంటారు?" ఆమె నడిగా డతను.

"వారేమీ చేయరు. అన్నీ నాతో చేయిస్తూ ఉంటారు."

"అంటే?"

"అంటే వారు నన్నావహించారు!"

"మీకు దెయ్యాల మీద నమ్మకం ఉందా?" అడిగా డతను.

"మీకు లేదా?"

"నే నెన్నడూ చూడలేదు వాటిని!"

"అయితే రేపు నన్ను చూడండి."

"ఇంతకన్నా మీరు పట్టపగలే బాగుంటారేమో?"

అతని మాటల కామె కులాసాగా నవ్వింది.

వెంటనే ఆమె బుగ్గల్లో కోపం చిందింది.

"ఏమిటి?" ఆమె కోపంతో అడిగింది.

"మీకు అర్ధరాత్రి కూడా కోపం వస్తుందా? లేక పగలు మీకు వస్తుంది కాబట్టి ఈ రాత్రివేళ కూడా కోపాన్ని బలవంతంగా తెచ్చుకొంటున్నారా?"

గడియారం ఠంగున రెండు కొట్టింది.

ఆమె రెండు కళ్లలోంచీ నీటి బిందువులు జారాయి.

"డాక్టర్, నేను చెడ్డమనిషినా?"

"ఎవరంటున్నారు."

"నా దగ్గర డబ్బు తిన్నవాళ్లే నన్ను చెడ్డ మనిషంటున్నారు, డాక్టర్!"

"కాదు!"

"ఎలా తెలుసు మీకు?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"మీ సంగతంతా తెలుసు నాకు. మళ్లీ రేపు కలుస్తాను మిమ్మల్ని."

"ఈ అర్ధరాత్రి వేళ ఇంటికేం వెలతారు! మా మేడలోనే పడుకోండి."

అత నామెని పరామర్శించి చూస్తూ "అలాగే" అన్నాడు.

అతినికి చూపించిన పడక గది మేడ కింది అంతస్తులో ఉంది. ఆ గది గోడలకి ఆయిల్ పెయింట్స్ వేసి ఉన్నవి. గది ఎంతో శుభ్రంగా ఉన్నా ఆ గదిలో ఎవరూ నివాసం చేయడం లేదేమోనని డాక్టర్ శశిభూషణ్ కి అనిపించింది.

ఆ గది ఎదురుగోడకి ఆనుకొని ఒక డ్రెస్సింగ్ టేబిల్ ఉంది. దానికున్న అద్దం పైభాగం వెనక్కీ, క్రిందిభాగం ముందుకీ ఒరిగి ఉన్నవి. దానికి పక్కవేపు గోడకి రెండు కిటికీలు ఉన్నవి. గది మధ్యలో స్పాంజ్ బెడ్ ఉంది. దానికి చుట్టూ నీలిరంగు దోమతెర ఉంది. ఆ టేబిల్ మీద చెక్కకి బదులుగా పాలరాయి వేసి ఉంది!

డాక్టర్ శశిభూషణ్ మంచం దగ్గరికి వచ్చాడు. ఆ పాలరాతి టేబిల్ మీద చూశాడు. పాలరాతిలోనే విభిన్న వర్ణాల్లో ఎవరిదో బొమ్మ మలిచారు. 'ఎంత చక్కగా ఉన్నా డతను!' అనుకొన్నాడు శశిభూషణ్.

అంతలో అతనికి ఇది కొంపదీసి నాలాయనీదేవి భర్త ఫోటో కాదుగదా? అన్న అనుమానం వచ్చింది. లేకపోతే ఈ గది ఇంత నీట్‌గా, విలాసంగా ఎందుకుంటుంది?

డాక్టర్ లైట్ ఆర్పి మంచంమీద పడుకొన్నాడు. అతని మనస్సుని ఆలోచనలు చుట్టుముట్టాయి. అవతల ఎక్కడో మెరుపు. ఆ మెరుపు వెలుగు గది కిటికీలోనుంచి డ్రెస్సింగ్ టేబిల్ అద్దంలోంచి పరావర్తనం చెంది డాక్టర్‌కి ఎదురుగా ఉండే గోడమీద పడింది. దోమతెర ఛిద్రాల్లోంచి చూస్తున్న డాక్టర్‌కి ఎదురుగా ఉండే గోడమీద పడింది. దోమతెర ఛిద్రాల్లోంచి చూస్తున్న డాక్టర్‌కి గుండె ఒక్కసారి ఆగింది!

'దెయ్యాలు ఉన్నవా? ఉంటే అవి ఎలా ఉంటవి? బలహీనపు గుండెల్ని తప్ప బలవంతుల్ని అవి ఆవహించలేవేమో?'

కిటికీ రెక్కలు టపటపా కొట్టుకొంటున్నవి. శశిభూషణ్‌కి నిద్రపట్టడం లేదు. అతను లేచాడు. కిటికీ దాకా వెళ్లి కిటికీ తలుపులు వేయబోయాడు. కిటికీకి అవతల ఏదో నీడ!

ధైర్యాన్ని పుంజుకొని చీకట్లోకి చూశాడు డాక్టర్ శశిభూషణ్. అంతలో ఉరుము! మెరుపు!

ఆ నీడ అరిచింది గట్టిగా!

గాడిద ఓండ్రింపు ఉరుముకన్నా భయంకరంగా అయింది.

మెరుపులో క్షణం వెలిగిన ఆ గార్దభం మళ్లీ నీడగా మారి ముందుకి సాగింది.

కాని, ఈసారి ఆ నీడ డాక్టర్ని అంతగా భయపెట్టలేదు. మనిషికి ఒంటరితనాన్ని మించిన వ్యాధి లేదన్న మాట – అనుకొన్నాడు డాక్టర్.

ఇంతలో దోమతెర పైకి ఏదో దూకింది. డాక్టర్ గుండెధైర్యం జారిపోలేదు. బహుశః పైన ఉన్న ఫాన్ మీది నుంచి ఏదో బల్లి పడి ఉంటుంది – అనుకొన్నా డతను.

నిజంగా హేతువులో ఎంత ఆనందం ఉంది! నిర్హేతుకమయిన ప్రతిదీ మానవుణ్ణి బానిసగానో, బలహీనుడిగానో చేస్తుంది. సహేతుకమైన ప్రతిదీ ఈ చిన్న మానవుణ్ణి భీమబలుడు గానూ, సృష్టి కంతటికీ యజమాని గానూ చేస్తుంది!

డాక్టర్ శశిభూషణ్ ఆ గదిలో ఉన్న – కనిపిస్తున్న – వినిపిస్తున్న ప్రతిదాన్నీ సహేతుకంగా విమర్శించుకొంటూ తృప్తిపడుతున్నాడు. అతని రక్త ప్రసరణ సమవేగంలోకి వచ్చింది. అతను నిద్రపోయాడు.

ఉదయం ఎనిమిది గంటల కతను లేచాడు. పనిమనుష్యులు వచ్చి అతనికి అన్ని ఏర్పాట్లూ చేశారు. అన్నీ ముగించుకొని అతను మేడపైకి వెళ్లాడు.

అర్ధరాత్రి కనుపించిన ప్రశాంతత ఆ ఉదయానికి ప్రళయంగా మారిపోయినట్లుంది. ఆమె గది అవతల దిండ్లూ, ప్లాస్టిక్ ఫ్లవర్ వేజ్ విసిరేసి ఉన్నవి. వాడిపోయిన పువ్వులు ఫ్లవర్ వేజ్ బంధం నుంచి విడిపోయి చెల్లాచెదురుగా, దేని కది ఒంటరిగా వరండాలో పడిపోయి, దీనంగా కనుపిస్తున్నవి. ఉదయిస్తున్న సూర్యకిరణాలు వాటిమీద పడుతున్నవి. వాటిని జాగ్రత్తగా ఒక్క చోటికి చేర్చి, వాటి తొడిమల్ని గుప్పిటలో పట్టుకొన్నాడు శశిభూషణ్.

గది లోపలినుంచి అరుపులు వినబడుతున్నవి.

అతను లోపలికి వెళ్లాడు.

ఆమె అరుస్తోంది.

"నమస్కారం!"

"ఎవరు మీరు?"

అతను చిరునవ్వు నవ్వాడు.

అంతలో మళ్లీ ఆమే అన్న దిలా:

"ఓహ్! మీరా! అర్ధరాత్రి ఆడపిల్ల ఇంటికి వైద్యంకోసం వచ్చిన మహా పురుషులు!"

అతని చిరునవ్వు నవ్వుగా మారింది, వెన్నముద్ద నేయిగా మారినట్లు.

"చేసింది చాలక ఇంకా నవ్వుతారేం?" రెచ్చిపోతూ అడిగింది నాలాయని.

"నేను మీకు స్నేహితుణ్ణి!"

దాని కామె వెర్రిగా నవ్వుతూ అన్నది: "బాబూ! నా కీ జీవితంలో స్నేహితుడు కాని దెవ్వరు? చుట్టం కాని దెవ్వరు?!"

"మీకు స్నేహితుణ్ణీ, చుట్టాన్నీ కూడా."

"అప్పుడే వేశారు ప్లానూ! బాగుంది, బాగుంది! ఒంటరిగా బ్రతుకుతున్న ఆడపిల్ల కనుపిస్తే చాలు, మొదట స్నేహం! తరవాత ప్రేమ! ఆ తరవాత బంధుత్వం! ఆ తరవాత మరణం! దాన్నే తరవాత హత్య అనడం – ఇవన్నీ తరతరాలుగా వస్తున్న సాంప్రదాయిక చారిత్రకాంశాలు!"

"అయితే, మీ జీవిత చరిత్ర ఇదన్నమాట!" అతనెంతో కులాసాగా అన్నాడు.

ఆమె రెచ్చిపోయింది.

"ఆడపిల్లల జీవితాలు తెలుసుకోవడానికి వచ్చారా? లేక మందివ్వడానికి వచ్చారా మీరు? ఛీ! ఛీ!"

"సారీ, నాలాయనీ దేవీ!"

"నన్ను అఫెండ్ చేస్తే బ్రహ్మదేవుణ్ణయినా సరే నేను క్షమించలేను".

"డాక్టర్ మీ ముఖం చూస్తుంటే ఇంతవరకు మిమ్మల్నెవరూ పెళ్లి చేసుకొన్నట్లు కనబడ్డం లేదే?!"

అతనామె కళ్లలోకి వింతగా చూస్తూ అన్నాడు: "అయితే, బదులుకి బదులు తీర్చుకొంటున్నా రన్న మాట!"

"అలా మాటకి మాట జవాబు చెప్పకుండా ఉండలేను."

"వెరీ గుడ్!"

"ఏమిటీ! లోకమంతా నిందించుతున్న నా ఈ గుణానికి మీరు వెరీ గుడ్ అంటున్నారు. అంటే మీ కిది నచ్చిందా, డాక్టర్!" ఆమె అమాయికంగా అడిగింది.

"నా కిదే ఏమిటి? మీ గుణాలతో పాటూ మీరూ నచ్చారు, నాలాయనీ!"

ఆ మాటల కామె వెంటనే రియాక్ట్ అయింది: "మీ వంటివాళ్లో డజను మంది ఇలాగే అనిపోయారు నాతో. మీ అందరికి నచ్చింది నేను కాదు, డాక్టర్, నా డబ్బు! నా డబ్బుకోసం నాతో స్నేహం చేస్తారు. నా డబ్బుకోసం నన్ను ప్రేమిస్తారు. నా డబ్బుకోసం నన్ను పెళ్లిచేసుకొంటారు. ఇక అక్కడి నుంచి నా డబ్బుతోటే నా మనుష్యుల్ని కొని, నా దుర్గుణాల్ని చూపించి నన్నో మృగం క్రిందకి జమచేసి, వెలి వేసి ఒంటరిదాన్ని చేసి రంపపుకోత కోస్తారు." ఆమె కళ్ల వెంట ధారావాహికంగా నీరు కారుతూంది.

డాక్టరామెని విచిత్రంగా చూశాడు. ఆమె అయాచితంగానే అతనికి కావలసినదంతా చెపుతూంది.

"నాలాయనీదేవీ! నన్నెందుకు సందేహిస్తున్నారు? నేను మీకు మేలు చేయడానికి వచ్చినవాణ్ణి."

ఆమె కన్నీరు తుడుచుకుంటూ అన్నది: "ప్రతి మగవాడూ ప్రతి ఆడదానికీ నేను నీకు మేలు చేస్తానని చెప్పే ఆమె దగ్గరకు చేరతాడు! మభ్యపెడతాడు! అణిచి పెడతాడు! చిట్టచివరకు విధవముండని చేస్తాడు!" ఆమె కన్నీటిలో దుఃఖాన్ని తుడిచిపెట్టి, కోపం తొణికిసలాడింది. ఆమె బుగ్గ ఎర్రబడింది. ఒక బుగ్గ పాలిపోయింది. చెదిరిన జుట్టు ఆమె అనారోగ్య సుందర శరీరానికి వన్నె తెస్తూంది!

"నేను కాస్సేపు కూర్చుంటానండి."

"కూర్చోండి" అన్నది నిర్వికారంగా ఆమె.

నౌకరొకడు రెండు కప్పులతో కాఫీ తెచ్చాడు. అతనొక కప్పు తీసుకొని తాగుతున్నాడు. ఆమె నిలబడే తాగుతున్నది. అంతలో ఆమె ఒక్కసారిగా కోపంతో వణికిపోయింది.

"ఎవడ్రా ఈ కాఫీ కలిపింది?" అరిచిందామె.

"నేనే, అమ్మగారూ!" బిక్కచచ్చిపోయి అన్నాడు కాఫీ తెచ్చిన నౌకరు.

"నీ కెన్నిమాట్లు చెప్పాను? చేసిన తప్పే చేయడం! నన్నో పిచ్చిదాన్ని చెయ్యడం! వీధిలో కెళ్లి నాకు దెయ్యం పట్టిందని ప్రచారం చెయ్యడం! ఇంటికి భూతవైద్యుల్నీ, పూరిగుడిసె వైద్యుల్నీ తేవడం! రాస్కెల్స్! మీకు బుద్ధి లేదు" అంటూ ఆమె కాఫీ కప్పు బయటకు విసిరేసింది.

'కాఫీకేం? బాగానే ఉందే' అందామనుకొన్నాడు శశిభూషణ్.

"చూడండి, డాక్టర్! కాఫీ కప్పు అడుగున కాఫీ పౌడర్ తేరుకొనీయ వద్దంటాను నేను. ఎన్నిమాట్లు చెప్పినా వీళ్లు సరిగా వడబోయరు. నా కా డికాక్షన్ రంగంటేనే మంట!"

"నాకూ అంతే!"

"చూశారా మరి? ఎందుకు ఊరుకున్నారు మీరు?"

"ఊరుకోక ఏం చేయను? ఈ కాఫీ తెప్పించిన మిమ్మల్ని కోప్పడనా?" ఆ మాటలంటూ అతని కళ్లు నవ్వినవి.

ఆ మాటల కామె ఫకాలున నవ్వి, "భలేవారే, డాక్టర్, మీరు!" అన్నది.

"భలేవాణ్ణి కాదు, నాలాయనీ! నేను మీవాణ్ణి మీ డాక్టర్ని, మీ హితైషిని."

"నేను కాదన్నానా, డాక్టర్" ఆ మాటల్లోనూ కోపం ఉంది కాని, అది కాస్త మధురంగా ఉంది.

"నేను వెళ్లొస్తా, నాలాయనీదేవీ! నా కోసం అక్కడ రోగులు కాచుకొని

ఉంటారు!"

"అయితేమళ్లీ రాత్రికి వస్తారా?" వెక్కిరిస్తూ అన్న దామె.

"ఔను. నిజంగా నిన్న వచ్చిన వేళకే వస్తాను" అన్నాడతను దృఢంగా.

"ఐతే మీరూ ఆయన చచ్చినట్లే ఆ నీళ్ల ఫౌంటేన్‌లో పడి చచ్చిపోతారు. సారీ! చనిపోతా రనకూడదేమో – మీ కేమైనా కీర్తంటూ ఉంటే కీర్తిశేషు లవుతారు."

"మనలో శేషించేది బొమికలూ, మట్టీ కాకుండా కీర్తంటే ఎంత హాయిగా ఉంటుంది, నాలాయనీదేవీ! మీ దయవల్ల నాకు కొంచెం కీర్తి దక్కనివ్వండి."

"నా డబ్బూ, నా జీవితమూ తప్ప మీకేం కావాలంటే దాన్ని మీకు సప్లయ్ చేయిస్తాను, డాక్టర్, కాని, ఎందుకైనా మంచిది – ముందే చెపుతున్నాను. ఈ పేషంట్ మీకు కీర్తి దక్కనివ్వకపోగా, మీకున్న కీర్తిని నాశనం చేస్తుంది. అందులోనూ మీరు వచ్చేది అర్ధరాత్రా – మీరీ ఇంట్లో దిక్కులేని చావు చస్తారు."

"దిక్కులేకేం, నాలాయనీదేవీ! ఎనిమిది వైపుల ఎనిమిది దిక్కులు ఉన్నవి. అన్ని దిక్కుల మధ్యేకదా చచ్చేది! ఫరవాలేదు. ఏది ఏమైనా ఈ సంఘంలో దిక్కులేని వాళ్లకి, చోటులేని వాళ్లకి కాస్త స్థలమూ, దిక్కూ చూపించే చస్తాను."

అతను గిర్రున వెనుదిరిగి వెళ్లిపోయాడు.

ఆమె కోపంతో వణికిపోయింది. అనిరుద్ధ క్రోధంతో ఆమె ముక్కుపుటాలెగిరినవి. ఆమె నేత్రద్వయంలో రక్తము పాకింది. కాని, ఆ క్రోధపూరిత నయనాల్లోనూ ఆ మనిషి దూరంగా సుందరంగా కనిపిస్తున్నాడు. క్రమక్రమంగా అతను దూరమైపోయాడు. కాని, మళ్లీ వస్తాడులే అన్న ఆశాకిరణం కూడా ఆ కళ్లలో తళుక్కుమనకపోలేదు!

ఆ రాత్రి అతనక్కడికి పోలేదు. ఆ సమయంలో అతను మరో పేషంట్ సీరియస్‌గా ఉంటే అక్కడికి వెళ్లాడు. ఆ పేషంట్ అతనికి మంచి మిత్రుడు కూడా. ఆ ఊర్లోనే ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడతను. ఆ రోగిని శశిభూషణ్ వారం రోజులు కనిపెట్టుకొని ఉండవలసి వచ్చింది. చివర కా రోగి మృత్యులోకంలోంచి ఈ లోకంలోకి తిరిగి వచ్చాడు.

"చాలా కృతజ్ఞుణ్ణి, శశీ!" అన్నాడతను పథ్యం తీసుకొంటూ.

"నాకు బిల్లుకి బదులుగా కృతజ్ఞతల్నా ఇచ్చేది!" అన్నాడు శశిభూషణ్ నవ్వుతూ.

"నీకు బిల్లుగా డబ్బులా ఏమిటి ఇచ్చేది?! ప్రాణాలివ్వాలి గాని!!" అన్నాడా ఉపాధ్యాయుడు.

"అయితే అలాంటి అవకాశంకోసం చూస్తున్నావా ఏమిటి? త్వరలోనే ఆ అవకాశం కల్పిస్తానులే" అన్నాడు శశిభూషణ్ నవ్వుతూ.

"ఛీ! ఛీ! అవేం మాటలు, శశీ!"

మరో నెలరోజుల వరకు శశిభూషణ్ ఆ మేడకి వెళ్లలేదు. ఒకనాటి రాత్రి అతని దగ్గిరికి ఆ ఉపాధ్యాయుడు వచ్చాడు.

శశిభూషణ్ అతనితో అన్నా డిలా: "రేపటినుంచి నేను రాత్రిళ్లు ఇక్కడ ఉండబోవడం లేదు, కృష్ణా"

"ఎక్కడుంటావ్ మరి? మా ఇంట్లోనా?"

"కాదు. పక్క ఊర్లో నాలాయనీ దేవి ఇంట్లో."

కృష్ణారావు ఉలిక్కిపడ్డాడు. అతని నాడి వేగంగా కొట్టుకొంటూంది. అతని ముఖంలో భీతి స్పష్టంగా కనబడుతూంది.

"అదేమిటి, కృష్ణా, అలా మరిపోయావ్!"

"బ్రదికి బట్టకట్టడానికేనా ఆ ఇంటికి పోతున్నది?" వ్యధతో అడిగాడతను.

"కాదు, కృష్ణా! ఒక చస్తున్న స్త్రీని బ్రతికించడానికి."

"కాదు, శశీ! చంపుతున్న ఒక స్త్రీ తెరుస్తున్న మృత్యుముఖంలోకి దూరడానికి పోతున్నా వక్కడికి!"

"నా ప్రాణానికి ప్రాణ మిస్తానన్నావుగా – అప్పుడే డీలాపడిపోయావే!" పరిహాసం చేస్తూ శశిభూషణ్ స్టెతస్కోపూ, మెడికల్ ఛెస్టూ సర్దుకొన్నాడు.

"శశీ! ఆ అమ్మాయి సంగతి నీకేమీ తెలియదా?"

"అన్నీ తెలుసు!"

"ఏం తెలుసు నీకు?"

"ఆ యువతి డబ్బును చూసి ప్రేమించాడతను. అదంతా నిజమైన ప్రేమే అనుకొన్నది ఆమె! తన విచిత్ర ప్రవర్తన అతనికేమీ అభ్యంతరం కాదనుకొని ఆమె కూడా అతన్ని మనస్ఫూర్తిగా వివాహం చేసుకొన్నది. కాని వివాహం కాగానే అత నామె గుణాలని అసహ్యించుకొన్నాడు. నలుగురిలోనూ అతని మాటకు చెల్లుబాటు లభించింది! అందరూ ఆమెని అసహ్యించుకొన్నారు. ఆమె కోపం వృద్ధి పొందింది. ఇద్దరి మధ్యనా బెడిసింది. అతను చచ్చిపోయాడు..."

"కాదు. అతణ్ణి ఆమె చంపింది."

"కాదు. చచ్చిన వాణ్ణి ఆమె చంపినట్లుగా ఊళ్లోవాళ్లంతా ప్రచారం చేశారు."

"దానివల్ల ఊళ్లోవాళ్లకేం ఒరిగింది?" అన్నాడు కృష్ణారావు.

"సాధారణంగా ఆడా, మగా విషయాల్లో మగాణ్ణే సమర్థించడం మన దేశంలో అనూచానంగా వస్తున్న సంప్రదాయమే కదా! వాళ్ల కొరిగిందదే!"

"నీ వీ దేశ సంస్కృతిని గురించి అన్యాయంగా మాట్లాడుతున్నావు, శశీ!"

శశిభూషణ్ తలకి మఫ్లర్ చుట్టుకొన్నాడు. టార్చి లైట్‌లో కొత్త సెల్స్ వేసుకొన్నాడు. చేతిలో మెడికల్ ఛెస్ట్ పట్టుకొన్నాడు.

"నీ దగ్గర జవాబు లేదా, శశీ!"

"లేకేం! ఉంది! కానీ నే నేమైనా అంటే నీకింకా బాధ కలుగుతుందేమో?"

"జవాబు లేనప్పుడే ఇలాంటి మాటలు వస్తవేమో?" కృష్ణారావు కాస్త పెడసరంగానే అన్నాడు.

శశిభూషణ్ అతణ్ణి సమీపించి అతని కళ్లలోకి చూస్తూ అన్నాడు:

"స్త్రీలకి వైధవ్యాన్నీ, తోడి మానవుడికి ఛండాలత్వాన్నీ ఇవ్వడమే కదా మన

దేశ సంస్కృతి మన కందించిన మహా ధనం!"

నువ్వు చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావ్, శశీ!"

శశిభూషణ్ బయటకు కదులుతూ అన్నాడు:

"మన సంఘం మన సోదరులకి మతాన్నీ, మతాధిపతుల్నీ, దేవుళ్లనీ, దెయ్యాల్నీ, బారసాలల్నీ, శ్రాద్ధాలనీ ఇచ్చింది కాని మానవుడికి ముఖ్యంగా కావలసిందేమిటో దాన్నిమాత్రం ఇవ్వలేదు, కృష్ణా!"

"ఏమిటది?" కృష్ణారావు గొంతులో పరాజయమూ, నీరసమూ ధ్వనించాయి.

"పిడికెడు సానుభూతి, కృష్ణా! దాన్ని ఇవ్వడానికే నాలాయనీదేవి ఇంటికి వెళుతున్నాను నేను."

కృష్ణారావు శశిభూషణ్ కళ్లలోకి చూశాడు. కృష్ణారావు కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి.

"నువ్వు చాలా మంచివాడివి, శశీ! కాని ఒక అసాధ్య విషయంకోసం నీ మధుర జీవితాన్ని నాశనం చేసుకోబోకు."

"ప్రపంచమంతా వ్యాపించిన చీకటిని చూసి అగ్గిపుల్ల వెనుదీస్తుందా, కృష్ణా! తుదివరకూ చీకటిని వెలిగించే ఆరిపోతోంది కాని."

శశిభూషణ్ చీకటిని టార్చిలైట్‌తో చీలుస్తూ బయలుదేరాడు. మబ్బు తునకలు ఆకాశ ఛిద్రాల లాంటి చుక్కల్ని కప్పుతున్నవి. వానకాలపు చంద్రుడు బలహీనంగా వెలుగుతున్నాడు. రాత్రి పదకొండు గంటలకి శశిభూషణ్ నాలాయనీదేవి మేడకి చేరాడు. నౌకర్లతణ్ణి చూసి ఆశ్చర్యపడ్డారు.

"మీ అమ్మగారు ఉన్నారా?"

"ఉన్నారు" నౌకరతనికి గది చూపించాడు. అత నా నాటి రాత్రి పరున్న గదిలో ఉన్నదామె.

ఇతణ్ని చూడగానే ఆమె ఫకాలున నవ్వింది. "ఓహ్! మీరా, పిరికి డాక్టర్! ఒక్క రాత్రికే భయపడిపోయారు. వండర్‌ఫుల్!"

అతనూ ఆ మాటలకి గంద్రగోళంగా నవ్వాడు.

"ఏమిటలా నవ్వుతారు?" కోపంగా అడిగిందామె.

"నవ్వక.... నవ్వక ఏం చేయను? మిమ్మల్ని చూసి నేను భయపడ్డానా? నన్ను చూసి మీరు భయపడ్డారా?"

ఆమెకి కోపం అధికమయింది.

"ఏమిటి మీరు మాట్లాడేది? ఇంతవరకీ జీవితంలో నేనెవ్వడికీ భయపడలేదు."

"అంత అభయ వే అయితే నన్నెందుకు పిలిపించలేదు మరి?"

"డాక్టర్! నన్నవసరంగా రెచ్చగొట్టబోకండి.

గడియారం అరగంట కొట్టింది.

"టైమ్ పదకొండున్నర అయింది. మీ రింకా నిద్రపోరా?"

"రోజూ పన్నెండు కొడితేకాని నాకు నిద్రపట్టదు."

"ఈ అరగంటలో మీ కాంపౌండ్ ఒకసారి చూపించండి."

"ఏమిటీ? మా కాంపౌండా? మీరింకా కొన్నాళ్లు బ్రతుకుతా రనుకొన్నానే! ఈ వేళే పైకి వెళ్లదలుచుకున్నారన్న మాట! సరే, ఏం చేస్తాం! పదండి, అలాగే చూపిస్తాను!".

ఇద్దరూ ఆ అర్ధరాత్రి కాంపౌండ్‌లోకి వెళ్లారు. పెర్నిషియస్ ఎనిమియా పేషంట్‌లాగా తాటిచెట్టు కనుపిస్తూంది. దాని పక్కనే ఉన్న ఫౌంటెన్ గట్టుమీద కూర్చుంది నాలాయనీదేవి.

"ఇదే మీ గమ్యం! దీనితోటే మీ జీవితయాత్ర సమాప్తం!" గంభీరంగా అన్నది నాలాయనీదేవి.

అతను పరిసరాల్ని జాగ్రత్తగా గమనిస్తున్నాడు. దూరంగా మేడ. ఒక వైపు గడ్డివాము. మరోవైపు ఏదో కూలిపోయిన కాటేజ్. నీళ్లతో నిండిన ఫౌంటెన్. దానిమీద అన్నీ అశుభ వాక్కులనే మాట్లాడే అనారోగ్య సౌందర్యవతి!

ఇంతలో పెద్ద ధ్వని!

అతను ఉలిక్కి పడ్డాడు!

గాడిద ఓండ్రపెట్టింది.

ఆమె పకపకా నవ్వింది.

"ఎందుకూ నవ్వుతారు?"

"మీ భయానికి!" అందామె.

"నాలాయనీదేవీ! మనుష్యుల్ని చూసి సంఘమూ ఇలాగే అరిచి భయపెడుతుంది. భయపడకపోతే పైనబడి రక్కి రాపాడుతుంది. భయాన్ని నటించి దాని యాజమాన్యాన్ని నేను భగ్నం చేయాలి!"

"నేను చాలా సూటి మనిషిని, డాక్టర్! నాకు పిచ్చి పిచ్చి లౌక్యాలు తెలియవు. నంగి నంగి మాటలతో లోకం కోసం తమ నడవడిని మార్చుకొనే వాళ్లని నిర్వీర్యులుగా భావిస్తాను."

అతను చందమామని చూస్తూ అన్నాడు: "అందుకే నీ వంటే నా కిష్టం, నాలాయనీదేవీ!"

ఆమె నోరు మూతపడింది. చంద మామ నడక కుంటుపడింది.

ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ ఓ గుడ్లగూబ కూసింది, తాటిచెట్టు మీది నుంచి.

"చూశారా? ఆ రోజునించీ ఈ చెట్టు మీద గుడ్లగూబలు వాసం చేస్తున్నవి."

"ఏ రోజు నుంచి?"

"ఆయన ఈ నీళ్ల హౌజ్‌లో పడి చచ్చిపోయినప్పటినుంచీ."

"కావాలనే చచ్చిపోయాడా, నాలాయనీ దేవీ?"

"మా పోట్లాటల్లో ఆయన నా మీద చెయ్యి చేసుకున్నాడు. దానితో నాకు మతి తప్పి ఆయన్ని కొట్టాను. అంతే దానితో అతను నీళ్లలో బోర్లా పడిపోయాడు.

పడితే పడ్డాడులే అని నేనింట్లోకి విసవిసా పోయాను. మర్నాడు ఉదయం నౌకర్లు వచ్చి చెప్పేటంతవరకూ తెలియలేదు – అత నీ ఫౌంటెన్ లోనుంచి లేవనేలేదని, చచ్చిపోయాడని. దీనికి నే నేరకంగా బాధ్యురాల్ని చెప్పండి?"

"నిజంగా అతనిలాగే చచ్చిపోయాడా, నాలాయనీదేవీ?"

"ఔను డాక్టర్! ఎంత ఒట్టంటే అంత ఒట్టు!" ఆమె కంఠం కన్నీటితో వణికింది.

ఏదో పక్షి రెక్క లల్లార్చుకొంటూ కండ్లు కనబడక ఫౌంటెన్ మీద వాలి అరిచింది. నాలాయనీదేవి దాన్ని చూసి కంపించిపోయి శశిభూషణ్ చేయి పట్టుకొంది.

"గుడ్లగూబ అరుపు సహించగలను కాని, దాని చూపు భరించలేను, డాక్టర్!"

"లోకం మోపిన నిందల్ని సహించగలిగారు కాని దాని బంధాన్ని సహించలేనట్లు!"

"ఎక్సాక్ట్లీ! లోపలికి పోదాం, రండి. ఈవేళ ఎలాగూ పీడ కలలు తప్పవు నాకు!"

"మీకు నిద్దర్లో కలలు వస్తవన్నమాట."

"ఒట్టి కలలే కాదు, డాక్టర్? పీడ కల రాగానే ఒక్క ఉదుటున లేచి కూర్చుంటాను. ఇంక ఆ రాత్రి నిద్రపట్టదు. ఇహ పగలెట్లాగూ ఆ దెయ్యం నన్ను సాధిస్తూనే ఉంది కదా!"

"అలా అనగూడదు, నాలాయనీదేవీ! నీ కే దెయ్యమూ పట్టలేదు."

"మరి నన్ను చూసి లోకమంతా ఎందుకు అసహ్యించుకొంటోంది, శశిభూషణ్ గారూ!"

"మీ గుణాలమీద మీకే మమకారం లేకపోవడం వల్ల!"

"నాకు వాటిమీద ఒక్కొక్కప్పుడు చచ్చే మమకారమూ, ఒక్కొక్కప్పుడు భయంకరమైన కోపమూ వస్తుంది, శశిభూషణ్ గారూ!"

"మానవుడు దుర్గుణాల్ని ఆయుధాలుగా, సద్గుణాల్ని ఔషధంగా వాడాలి, నాలాయనీదేవీ! ఈ రెండూ అప్పుడప్పుడు వాడవలసిందేకాని రెండింటినీ నిరంతరమూ వాడే నరుడెవ్వడూ బాగుపడలేదు! దుర్యోధనుడు అసూయా క్రోధాల్ని నిరంతరం వాడి నిర్మూలమయ్యాడు! ధర్మరాజు సౌజన్య సౌభ్రాతృత్వాలని నిరంతరం వాడి అరణ్యాజ్ఞాత వాసాల పాలయ్యాడు!"

"కాని నా దుర్గుణాల్ని నేను నిగ్రహించుకోలేను, శశిభూషణ్!"

"అందుకేగా నేను వచ్చింది! దీనికిన్నీ మందు ఉంది. దాన్ని వాడండి."

"అంటే మీకు దెయ్యాలమీద నమ్మకం లేదన్న మాటేగా!"

"మీ ఇంటిలోగాని, ఒంటిలోగాని దెయ్యమున్న దంటారా?"

"అవునని లోకమంతా అంటోంది."

"ఎవరట ఆ దెయ్యం?"

"నా భర్త!"

"చచ్చాక ఆయన్ని ఏం చేశారు?"

ఆమె ఫకాలున నవ్వి అన్నది:

"కాల్చారు!"

"అయితే ఆయన అయింది దెయ్యం కాదు! బూడిద! అదిన్నీ గాలికి ఎగిరిపోయి ఉంటుంది." నిశ్చల గాంభీర్యంతో చెప్పాడతను.

ఆమె అతని హస్తాన్ని గట్టిగా నొక్కుతూ అన్నది:

"శశిభూషణ్! ఇన్నాళ్లకి మీరొక్కరే నాకు నచ్చిన మాట, నిజమైన మాట చెప్పింది."

మరో రోజు రాత్రి అదే కాంపౌండ్ వెనకభాగాన వాళ్లిద్దరూ కూర్చున్నారు. గుడ్లగూబ రోజూలాగే కూసింది. గాడిద ఓండ్రపెట్టింది. వాళ్లిద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. అప్పటికే చందమామ అస్తమించాడు.

"నాలాయనీదేవీ! ఇప్పుడు మీ ఒంట్లో ఎలా ఉంది?"

"ఏమో శశిభూషణ్! ఆ మందు వాడదలుచుకోలేదు నేను. అది వాడితే నే నీ లోకాని కంతకీ దాసిని కావలసి వస్తుందేమో?"

దాని కతను నవ్వుతూ అన్నాడు:

"కాదు, నాలాయనీ! లోకం మొత్తం అప్పుడు నీ సౌజన్యం ముందు తల వంచుతుంది."

"కాని, శశీ! సౌజన్యంతో మొండి బ్రతుకు బ్రతకడంకన్నా దౌష్ట్యంతో ఈ జీర్ణ జీవితమే మేలేమో నాకు!"

అతను సమాధానం చెప్పకుండా చీకట్లోకి చూస్తూ కూర్చున్నాడు.

"సమాధానం చెప్పకుండా అటెటో చూస్తారేం?"

"చీకట్లోకి!"

"ఎందుకు?"

"చీకట్లోనే వెలుగు దొరికేది. ఇంతవరకు ఏ పరిశోధకుడూ వెలుగులో చీకటిని పట్టుకోలేదు."

"అర్థమైంది, శశీ! ఇంతటి ఔదార్యంతో, సుమనస్కతతో మీరు చూపించే సానుభూతి నా కీ మందు అవసరం లేదని చెపుతోంది.

"మందు నీ రోగానికి కాని నీకు కాదు, నాలాయనీ! మబ్బుల్లో చందమామ లాంటి దానివి నువ్వు! తుఫానులో లంగరేయని ఓడలాంటి దానివి నువ్వు!"

"శశీ! నిజం చెప్పనా?"

"ఊ చెప్పు!"

"ఇంత రుగ్మత ఉన్నా ఇంతగా అప్రతిష్ఠ పాలయినా నా కీ జీవితాన్ని ముగించాలని ఎన్నడూ అనిపించలేదు, శశీ!"

ఆమె భుజాలమీద చేతులు వేసి, ఆమె కళ్లలోకి చూస్తూ అన్నా డతను:

"సరిగా నే నూహించిందీ అదే, నాలాయనీ! ఈ జీవితంలో నీలాంటి

దానిని చూడలేనేమో నేను! జీవితం మీద నీకు మమకారం ఉంది. నీ మీదా నీకు మమకారం ఉంది. కాని, లోకానికదే కంటకప్రాయ మైపోయింది! మంచితనాన్ని లోకం ఆదర్శంగానే చూపుతుంది తప్ప దాన్ని ఆచరించనీయదు. అలాంటి అవకాశమే ఈ సంఘంలో ఉంటే క్రీస్తు, లింకన్, గాంధీ ఎందుకు హతులయ్యారు? అలా అని చెడ్డతనాన్నైనా ఈ లోకం ఆచరించనిస్తుందా? దాన్ని నీరస పరుస్తుంది. దా న్ననుసరించే వాళ్లమీద పురాణాలు వ్రాసి, వాళ్లని శాశ్వతంగా హత్య చేస్తుంది. అందుకే లోకంలో బ్రతకాలంటే ఒక్కటే ఒక్క పద్ధతి!"

"ఏమిటది?" అడిగింది నాలాయని ఉత్సుకతతో.

"మంచి చెడుల కలయికని – వెలుగు నీడల కలయికలా జీవితంలోకి తెచ్చుకోవాలి."

"ఐతే లోకంకోసమేనా బ్రదకడం?"

"కాదు!"

"మరి?"

"నావంటి వాళ్ల కోసం!"

"అయితే?"

"మరి నేనూ లోకంలోని వాణ్ణే అయితే?"

"అయితే, మీ రిచ్చిన మందు వాడతాను."

గుడ్లగూబలు అరిచినవి!

గాడిదలు ఓండ్ర పెట్టినవి.

చీకటి వానలు చిక్కగా కురిసినవి.

కుంటి చంద్రులు పరుగెత్తారు.

గుడ్డి చుక్కలు కళ్లు మూసినవి.

పిశాచ వృక్షాలు నిట్టూర్చినవి.

వెన్నెల విరిగింది.

గాలి మరిగింది.

ముక్కులూ, చూపుడు వ్రేళ్లూ ప్రేమించి పెళ్లి చేసుకొన్నవి! క్రింది పెదాలు పళ్లకి విడాకులిచ్చి ముందుకి సాగినవి!

ఏమైతేనేం? వాళ్లిద్దరూ పెళ్లిచేసుకొని పెంకుటింటికి వచ్చారు.

"ఇంత మంచి చెల్లెల్ని చేసుకొన్న నువ్వెంతో అదృష్టవంతుడివి, శశీ! ఈమె పేరేమిటి మరి?" నాలాయని వడ్డిస్తుండగా అడిగాడు కృష్ణారావు.

"ఆమె పేరా! పూర్వాశ్రమంలో నాలాయనీదేవి! ఇప్పుడేమో కేమొమిల్లా!"

"అదేమిటి! వింతగా ఉందే పేరు!"

"అదా?! అది ఆమెకు పట్టిన దెయ్యాన్ని పారద్రోలిన హోమియో మందు పేరు! ఆ కేమొమిల్లా ఓషధికి పూసిన పూలు ఆపిల్ వాసనతో ఉంటవి, తెలుసా?!"

ఆ వ్యంగ్యానికి కృష్ణారావు ఫక్కున నవ్వాడు.

కేమొమిల్లా బుగ్గలు రెండూ సిగ్గుతో ఎర్రబడ్డవి.

(12.08.1970 నాటి ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో ప్రచురితం)

డామిట్ కథ అడ్డం తిరిగింది

ఆ మేడ చుట్టూతా పెద్ద కాంపౌండ్ వుంది. మొన్న మొన్నటి వరకూ పాడుబడి వున్న ఆ మేడకి ఒక్కసారిగా మరామ్మత్తులు మొదలయినవి. నౌకర్లు, చాకర్లు, ఉప్పరి పనివాళ్లూ సందడిగా తిరుగుతున్నారు, కొన్నాళ్లకి పాడుబడ్డ ఆ మేడ సరికొత్త భవనంగా మారిపోయింది. కాని అంత విశాలంగా వున్న ఆ కాంపౌండ్‌లో ఒక్క చెట్టైనా లేకపోవడం కాస్త లోపమే అయినా, ఆ వీధిలో వాళ్లకి అన్నాళ్లు పాడుబడ్డ ఆ మేడ బాగుపపడం కాస్త ఉత్సాహాన్నే కల్గించింది! కాని, ఎప్పుడూ ఆ ఇంటి కాంపౌండ్‌లో నౌకర్లూ చాకర్లు తిరగడమే తప్ప ఆ ఇంట్లో నివాసం చేయడానికి రాకపోవడం ఆ వీధి వాళ్లకి కాస్త ఆశ్చర్యాన్నే కల్గించింది.

సరిగ్గా ఆ మేడకి ఎదురుగా డాక్టర్ శ్రీపతి వుంటాడు. శ్రీపతి ఆనాడు రోగుల్ని పరీక్షచేసి వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కుంటూ తన వరండా మెష్‌లో నుంచి అవతలికి చూశాడు. ఇన్నాళ్లూ పాడుబడ్డ ఆమేడ ఒక్కసారిగా ఆయిల్ పెయింట్స్ వేసికొంటూ వుండడం అతనికి ఆశ్చర్యాన్ని కల్గించింది. 'ఈ దయ్యాల కొంపని ఎవరు కొన్నారబ్బా'! అని మనస్సులోనే అనుకొన్నాడు డాక్టర్ శ్రీపతి!

శ్రీపతి డాబా పక్కగా హనుమదాలయం పూజారి శ్రీమాన్ తిరువేంగళాచార్యులవారి పెంకుటిల్లు. ఆనాడుదయం ముంగిట్లో ఎవరికో ముహూర్తం పెట్టుతూ శ్రీమాన్ ఆచార్యులవారు దారంతో చెవులకి గుంజి కట్టుకొన్న సులోచనాల్లోంచి వీధిలోకి చూశాడు! చిత్రం! తానిన్నాళ్లు దయ్యాలకొంప అని ప్రచారం చేసిన మేడ కొత్త మేడగా మారిపోతోంది! శ్రీమాన్ ఆచార్యులవారు గోష్పాదమంత పిలకజుట్టు ముడివిప్పి ఒక్కసారిగా తెగబారెడు వెంద్రుకల్ని ఝాడించి, మళ్లీ ఒక్క వెంద్రుకకూడా బయటికి రాకుండా ముడివేసికొన్నారు ఆశ్చర్యంతో!

డాక్టరుగారి డాబాకి మరోపక్కనవున్న చిన్నమేడ కింది వరండాలో మేర రంగయ్య సింగర్‌మిషన్ కాళ్లతో తొక్కుతూ మిషన్ సూదిమీద దృష్టి నిలిపిన్నీ ఎందుకో ఒకసారి వీధిలోకి చూడ్డం, ఆ పాడుపడ్డ మేడ రంగులు మార్చుకొని కొత్తదిగా మారిపోవడం గమనించడం, ఆశ్చర్యపడి పోవడం, మళ్లీ తనదృష్టిని, పైకీ కిందికీ కదుల్తున్న మిషన్ సూది మీదికి తిప్పుకోవడం చేశాడు!



మేర రంగయ్య వరండామీదున్న మేడగదిలో రాజశేఖరం కాలేజీలో బి.ఏ. చదువుతూన్నాడు. ఆనాడుదయమే లేచి బ్రష్‌మీదికి తెల్లని టూత్‌పేస్ట్ వేసికొని పండ్లు తోముకొంటూ ముందు కిటికీ తెరిచి చూశాడు. ఇంకేముంది? దయ్యాలకొంప ధగధగా మెరిసిపోయే ప్రయత్నంలో వుంది!

డాక్టరు శ్రీపతి, పూజారి తిరువేంగళాచార్యులూ, మేర రంగయ్యా, స్టూడెంటు రాజశేఖరమూ ఆనాటినుంచి ఆ ఇంటి మరామత్తుల్ని శ్రద్ధగా రోజూ పరిశీలిస్తున్నారు. రోజురోజుకీ ఆ ఇల్లు శోభాయమానంగా మారుతోంది. కాని ఎన్నాళ్లకీ ఆ ఇంట్లోకి రావాల్సిన మనుష్యులు రాకపోవడం మరి కాస్త ఆశ్చర్యాన్ని కల్గించింది వాళ్లకి!

ఓనాడు సాయంత్రం సూర్యుడు రోజుటి లాగానే అస్తమించాడు. ఎలెక్ట్రిసిటి ఆగిపోవడం వల్ల ఇంకా లైట్లు వెలగలేదు. మేర రంగయ్య బట్టలన్నీ ఓ పెట్టెలోకి సర్దుకొని ఆ పెట్టెనీ, కుట్టుమిషన్నీ లోపలిగదిలో సర్దుకొని బైటకు వచ్చాడు. అప్పుడతని కళ్లు ఆ మేడమీది బాల్కనీలోకి వెళ్లినయి! అంతే అతని చూపు అలాగే నిలిచిపోయింది.

అదేనాడు డాక్టర్ శ్రీపతి పేషెంట్లెవరూ లేకపోవడంతో చల్లగాలి పీలుద్దామని ముందుతోట్లో విహరిస్తున్నాడు! అంతే! ఆ అసురసంధ్యలో ఆయనకళ్లు ఆ మేడమీద బాల్కనీలో నిల్చున్న వ్యక్తిమీద నిలిచి పోయినవి!

అర్జంటుగా హనుమదాలయానికి బయలుదేరబోతున్న పూజారి తిరు వేంగళాచార్యుల వారు సులోచనాల్లోంచి తన చర్మ చక్షువుల దృక్కుని ఆ మేడమీది బాల్కనీలో నిల్చున్న వ్యక్తిమీద నిలిపేశాడు.

స్టూడెంట్ రాజశేఖరం ఆలస్యంగా అప్పుడే గూటికిచేరి ముందు కిటికీలోంచి ముందుకి చూసి, చూపులకి సార్థకత లభించినందుకు ఈలవేసి తన ఉత్సాహాన్ని ప్రదర్శించారు!

లైట్లు వెలిగినవి!

బాల్కనీలోని వ్యక్తి లోపలికి వెళ్లిపోవడం జరిగింది.

ఎవరావ్యక్తి?!'

ఆ నలుగురి మనస్సులోనూ ఆరాత్రి అదేప్రశ్న పదేపదే తలెత్తింది! డాక్టరు శ్రీపతికి చచ్చి స్వర్గానవున్న తన భార్య జ్ఞాపకం వచ్చింది!

తిరువేంగళాచార్యుల వారికి కీర్తిశేషులైన తన ముగ్గురు భార్యల్లోనూ మూడో భార్య పుత్తడిబొమ్మ ఆండాళమ్మ జ్ఞాపకానికి వచ్చింది!

మేర రంగయ్యకి చచ్చిపోయిన తన మేనగోడలు రత్తి జ్ఞాపకం వచ్చింది.

కాని స్టూడెంట్ రాజశేఖరానికి మాత్రం ఎవరూ జ్ఞాపకానికి రాలేదు! ఆ బాల్కనీలో కనబడ్డ ఆమే అతనికి ఆ రాత్రంతా జ్ఞాపకానికి వచ్చింది! ఓహ్! ఆమె తనకి ప్రియురాలవుతే! ఛీ! ఛీ! ప్రియురాలేమిటి?! ఆమె తనకి భార్యే కావాలి! భార్య అవుతే ఆమెతోపాటు ఆ మేడా దక్కుతుంది తనకు!

'ఎంత అందంగా వుంది ఆమె! ఆ నునుగారం! ఆ సౌకుమార్యం! ఆ గాంభీర్యం! నిజంగా లైట్లు లేని ఆ సమయంలో ఆ మేడ మొత్తానికి దీపంలా వెలిగిపోయిందావిడ!' ఇంచుమించు ఆ నలుగురూ ఆమెని చూశాక ఆ రాత్రి ఇలాగే అనుకొన్నారు.

ఎంతో కాలం గడిచాక కాని ఆ రాత్రి తెల్లవారలేదు!

తెల్లవారగానే డాక్టర్ శ్రీపతి వెంట్రుకల్ని బ్రష్ చేసికొని ఒక పాతగుడ్డ పేలిక తీసికొని కాంపౌండ్ బైటికి వచ్చి తన గేటుకి తగిలించుకొన్న 'డాక్టర్ శ్రీపతి. జి.సి.ఐ.ఎమ్' అన్న బోర్డుని శుభ్రంగా తుడిచి లోపలికి వెళ్లాడు. ఆ తర్వాత ఫుల్ సూట్‌లో రోజటి కన్నా వో అరగంట ముందుగానే వరండాలోకి వచ్చి కూర్చున్నాడు.

పూజారి తిరువేంగళాచార్యులు కూడా ఉదయమే లేచి తన ఇంటి ముందు నాలుగు మేకులు కొట్టి నిలిపిన అట్టముక్క మీద ఇదివరకే వున్న అక్షరాల్ని మళ్లీ ఒకసారి సుద్ద ముక్కతో దిద్దాడు! 'జోస్యుల తిరువేంగళాచార్యులు. భూత ప్రేత పిశాచాల బాధ నిర్మూలించడానికి సంప్రదించండి.' ఇవీ ఆ అక్షరాలు.

మేర రంగయ్య తెల్లటి కొత్త పైజామా, గళ్ల ఫుల్‌షర్టూ వేసికొని తన మిషన్‌ని బాగా తుడుచుకొని కూర్చున్నాడు వరండాలో!

స్టూడెంట్ రాజశేఖరం వీళ్లందరిలా పొద్దున్నే లేవలేక పోయినా, నిద్ర

లేచాక మాత్రం అందంగా పక్క సర్దుకొని, గదిలో వున్న అందమైన కాలెండర్లని అందంగా అమర్చి కాలకృత్యాలు తీర్చుకొని చక్కా ముస్తాబై ముందుగోడ కున్న కిటికీ తలుపుల్ని తెరిచాడు!

కాని వీళ్లు నలుగురూ ఇలా తయారయి ఆ మేడమీది మగువకోసం కాపలా వేశారనే విషయం, పాపం ఆ అమాయకురాలికి తెలీదు! ఆమె ఉదయం ఎనిమిదిన్నర ప్రాంతంలో తన బాల్కనీలోకి వచ్చింది! అంతే ఎనిమిది కళ్లలోంచి పదునైన చూపులు వచ్చి ఆమెని గుచ్చుకొన్నవి! ఆమెకూడా వాళ్లందర్నీ చూసింది.

'జోస్యుల తిరువేంగళా చార్యులు...' భలేగావుందీ బోర్డు! బహుశః ఆ కూర్చున్న ఆయనే అయివుంటాడు! తెల్లని వెండ్రుకల సిగముడి! అందులో ఓ గన్నేరు పువ్వూ! బొర్రమీద విష్ణుపాదాలు! ఆ సులోచనాల్లోంచి ఆయన చూపులు భూతద్దంలోంచి ఎండ కిరణాల్లా తనని చురుక్కు మనిపిస్తున్నవి!'

'డాక్టరు శ్రీపతి....' బోర్డు నీటుగా వుంది. ఆ వరండాలో వున్నాయనే నేమో ఆ డాక్టరు! రోల్డు గోల్డు రిమ్ కళ్లాద్దాల్లోనుంచి తననే పరికిస్తున్నాడు! నలభయ్యో పడిలో పడ్డట్లున్నాడు! పేషెంట్లు ఎవరూ రాలేదా ఏం? అందరు డాక్టర్లలా తెల్ల వోవర్‌కోట్ వేసికోకుండా కంపెనీ మేనేజర్లా ఈయన ఫుల్‌సూట్‌లో వున్నాడేం చెప్మా! ఈయన ఇంటిముందు పూలచెట్లు భలేగా వున్నయ్యే! ఆ ఎర్ర పూలమొక్క బలేగావుంది! ఏం మొక్కో అది!

పక్కన ఇతనెవరో టైలర్! బలె! కొత్త పైజామా కొత్త చొక్కా తొడుక్కొని మిషన్‌ముందు కూర్చున్నాడు! ఆయిల్ అంటదూ! ఎవడిపిచ్చి వాడికానందం!

ఆ పై గదిలో అబ్బాయి నిన్న తనను చూడగానే కీస్‌మని ఒక్కసారి ఈలవేశాడు! తప్పక అతను కాలేజీ కొంటె కుర్రాడయి వుంటాడు!

ఇలా ఆమె ఆ నలుగుర్నీ పరీక్షిస్తుంటే ఆ నలుగురు ఆమెనీ పరీక్షిస్తున్నారు.

'ఈమె ఇలా తెల్ల చీరె కట్టుకొందేం?' ప్రశ్నించుకొన్నాడు డాక్టర్.

'ఇలా తిలకంలేకుండా వుందే ఈమె?' అనుకొన్నాడు మేర రంగయ్య.

'బొట్టు దిద్దుకోకపోవడం, తెల్లచీరె కట్టుకోవడంతోనే ఆపింది ఈమె! సకేశి విధవ కాస్తనయం కాదూ!' అని ఆచార్యుల వారనుకొన్నారు.

'అచ్చు చుట్టరికాల్లో జయంతిలా వుంది. ఓహ్! ఏంబ్యూటీ' అనుకొన్నాడు రాజశేఖరమ్.

ఆ మేడముందు కాంపౌండ్‌లో తిరుగుతున్న నౌకర్ని పిలిచి

'మీదొరలేడా నాయనా!' అని అడిగాడు.

'మాకు దొరలేడు గిరాలేడు పోవయ్యా బాపనయ్యా!' అని కసురుకొన్నాడు వాడు.

ఆచార్యులు ఆ ఇంటి నౌకరుతో మాట్లాడడం మేడమీది భామతోపాటు వీధిలోని తక్కిన ముగ్గురున్నూ గమనించారు.

'ఆ భామ నౌకరుతో ఏం మాట్లాడేడు ఈ ఆచార్యులు' అని ఆ ముగ్గురున్నూ మనసుల్లో మధనపడిపోయారు.

ఆ సాయంత్రం డాక్టర్ శ్రీపతి ఆచార్యులవారిని పిలిపించి, ఒక మీఠాకిళ్లీ తెప్పించి యిచ్చి అవి యివీ మాట్లాడి చివరకు అసలు విషయం అడిగాడు మెల్లగా.... తనకేమీ పట్టనట్లు!

డాక్టర్ అసలు విషయం అడగ్గానే ఆచార్యులు ఠకీమని సమాధానం చెప్పాడు.

'ఆమెకండీ! ఆమెకి మొగుడూలేడూ గిగుడూలేడు. నూత్న వైధవ్యమండీ పాపం! అందులోనూ రాత్రల్లా ఆ దయ్యాల కొంపలో ఒక్కత్తీ పడుకొందా; దాన్తో ఏదో పిశాచం ఆవహించిందట! నా ఇంటి ముందరి బోర్డు చూసిందేమో! అందుకని నాకోసం కబురు పంపిస్తే వెళ్లాను!'

'మరి ఇంట్లోకి వెళ్ళలేదు కదండీ!'

'పోతే మీరదంతా గమనిస్తూనే కూర్చున్నారా' తాను తప్ప మరెవ్వరూ ఆ భామని చూడ్డంలేదనుకొన్న ఆచార్యులవారికి నిరుత్సాహం కమ్మి డాక్టరుని అలా అడిగారు.

తన ప్రశ్నలోని అంతరార్థం ఇంకా స్పష్టంగా అర్థం కాకుండా ఉండగలందులకు డాక్టరు విషయం మార్చి మాట్లాడి ఆయన్ని పంపించాడు.

మొత్తానికి ఆ సాయంకాలంకల్లా ఆచార్యులవారి వల్ల మేడమీది భామనిగురించి డాక్టరుగారు నిన్ననే మేర రంగయ్య, స్టూడెంట్ రాజశేఖరమూ విన్నారు. ఆచార్యుల అదృష్టానికి ఈర్ష్యపడ్డారుకూడా! మర్నాడుదయం ఆమె షికార్‌కి బయలుదేరింది. ఆమె తన గేటుదాటి వీధిదాటి డాక్టరుగారి గేటుముందర కాస్సేపు ఆగింది. డాక్టరుగారు ఏదో పని వున్నట్లుగా తన గేటుదగ్గరకు వచ్చారు! వాళ్లిద్దరి సామీప్యం తక్కిన ముగ్గురికీ అనుమానాన్ని కల్గించింది.

ఆమె కదలి ముందుకి వెళ్లిపోయింది!

ఆమె అలా వెళ్లిందోలేదో ఆచార్యులిలా వచ్చాడు పిలకజుట్టులోని కుసుమాన్ని సర్దుకొంటూ!

'డాక్టరుగారూ! ఏమిటండీ మాట్లాడుతున్నారు ఆ భామతో?' తన కుతూహలాన్ని దాచుకొందామని విఫలప్రయత్నం చేస్తూ అడిగాడు.

'ఆ! ఏముందీ! డాక్టరూ పేషెంటూ సంబంధం! ఆమె రోజురోజుకీ తెల్లబడుతోందట! నీరసంగాకూడా వుంటోందట! ఇదే విషయానికిగాను ఆమె కన్సల్టుచేస్తే ఐదురూపాయలు తీసుకొని 'డి విటమిన్ డెఫిషియన్సీ' అని చెప్పి కాస్త రోజూ సూర్యుడి వెల్తురిలో షికార్ కొట్టివస్తే మంచిదనీ, జబ్బు ఉండదనీ చెప్పాను!' నిర్లిప్తంగా అన్నాడు శ్రీ శ్రీపతి!

ఈ మాటలు విన్న ఆచార్యులకీ, ఆచార్యులద్వారా విన్న మేర రంగయ్యకీ, స్టూడెంట్ రాజశేఖరానికీ గుండెల్లో గుచ్చినట్లయింది.

ఆ మర్నాడుదయం ఆమె షికార్‌కెళ్తూ టయిలర్ వరండాముందు ఆగింది! తక్కిన ముగ్గురికీ ఆమె టయిలర్‌తో ఏదో మాట్లాడ్డం కన్పించింది!

'ఆమె నీతో ఏం మాట్లాడింది' అని పైనవున్న రాజశేఖరమూ, దూరానవున్న ఆచార్యులు రంగయ్యని సమీపించి అడిగారు.

గిలగిలా గింజుకున్నా మేర రంగయ్య వాళ్లకి జరిగింది చెప్పలేదు!

ఆనాడు ఆదివారం! రాజశేఖరం కాలేజీకి వెళ్లనవసరంలేదు. మేర రంగయ్య మీద భరింపరాని అనుమానం మొదలైంది వాళ్లకి! ఇది ఇట్లా ఉండగా మేరరంగయ్య జేబూ గుడ్డలో కత్తెరా, టేపూ పెట్టుకొని అవి కనబడకుండా

వాటిమీద నాలుగు బత్తాయిలూ పెట్టి కట్టుకొని ఆ భామ మేడలోకి వెళ్లాడు.

'ఈ రంగిగాడెంత అదృష్టవంతుడు!' అనుకొన్నారందరూ!

ఆచార్యులు వాణ్ని రాగానే నిలేసి అడిగాడు జరిగిందేమిటో చెప్పమని!

'నేనామె బ్లౌజు బాగా లేదన్నాను. మరయితే ఏం చెయ్యాలి? అని ఆమె అడిగింది. మేషర్‌మెంట్స్ సరిగ్గా తీయించుకొని వీ కట్ జాకెట్టు వేసికొంటే వెలిగిపోతారని చెప్పాను!'

'ఆ తర్వాత ఏమయింది?'

'ఏమయిందేమిటయ్యా ఆచార్యులూ! టేప్ తీసికొని ఆమె బ్లౌజుకి మెషర్‌మెంట్స్ తీసికొన్నాను. ఇంక చూడు ఎలా కుడతానో ఆ బ్లౌజుని! నా సామి రంగా!' అన్నాడు ఉత్సాహంగా మేర రంగయ్య. పైనుంచి రాజశేఖరం అదంతా వింటూ పండ్లు పటపటా కొరుకుతున్నాడు!

మేడ మీది భామ రాజశేఖరం పండ్లు కొరుక్కోవడం గమనించి నవ్వుకొంది. నిజానికి ఆమె ఈ నలుగురినీ గమనిస్తూనే వుంది. మేర రంగయ్య నంది వర్ధనం పాదులోకి బత్తాయిల్ని జార్చేసి లోపలికి వచ్చిన విషయమూ గమనించిందామె! అట్లాగే రోజూ ఆచార్యులు తక్కిన ముగ్గుర్నీ కలుసుకొని వింతగా ప్రవర్తించడమూ, ఆ నాడు తన నౌకరిని 'మీ దొర లేరా' అని ప్రశ్నించడమూ కూడా గమనించింది!

ఆ నాడు సాయంకాలం వీధిలో రాజశేఖరంతో తన నౌకరేదో మాట్లాడ్తూ వుండడం వాడికి అతనేదో సిగరెట్టు ఇవ్వడమూ కూడా ఆమె గమనించింది!

ఆమెతో పాటూ అందరూ ఆ విషయాన్ని గమనించారు కూడా!

ఆచార్యులు రాజశేఖరాన్ని అడిగాడు 'ఏమిటి సంగతి' అని.

'ఆ, ఏం లేదు! రేపుదయం నన్నొకసారి రమ్మని కబురంపించింది ఆమె!' అన్నాడు నిర్లిప్తంగా.

ఆ విషయం విన్నాక నిన్నగాక మొన్న పుట్టిన ఆ కుర్రాడి అదృష్టం తలుచుకొని అందరికీ తగని అసూయ కలిగింది.

మర్నాడు రానేవచ్చింది!

ఆమె షికారుకి వెళ్లివచ్చింది!

రాజశేఖరం గేటు తీసికొని లోపలికి వెళ్లాడు! అందరూ కుతూహలంగా చూస్తున్నారటువైపే!

'ఎప్పుడొస్తాడో రాజశేఖరం?'

ఎంతసేపు చూసినా అతను రాలేదు!

చివరకి ఓ గంట అయ్యాక అతను బైటకువచ్చాడు!

కుతూహలం ఆపుకోలేక డాక్టరుకూడా బైటకువచ్చాడు!

మేడమీదినుంచి అదంతా భామ చూస్తూనే వుంది!

జోస్యుల తిరువెంగళాచార్యులూ, మేర రంగయ్యా భామ కాంపౌండు ముందరే రాజశేఖరాన్ని పీకుతున్నారు లోలోపల ఏం జరిగిందో చెప్పమని!

అతనేం చెప్తాడోనని చెవులు రిక్కించుకొని సిద్ధంగావున్నాడు డాక్టర్ శ్రీపతి! కాని ఆ కుర్రాడేమీ మాట్లాడలేదు! చివరకి ఆ ఊ అనికూడా అనలేదు. పైనుంచి భామ అదంతా చూస్తూ తృప్తిగా నవ్వుకొంది!

'మేం ఇలాగే దాచుకొన్నామా?' నిసిగ్గుగా అడిగాడు ముసలి ఆచార్యులు పడుచు శేఖరాన్ని.

'నన్నెంత పీక్కుతిన్నావు ఆనాడు? నేనానాడు చెప్పకపోతే గుచ్చిగుచ్చి అడిగి చెప్పించుకోలేదూ నువ్వు' అన్నాడు మేర రంగయ్య అక్కసుతో.

రాజశేఖరం మౌనంగావున్న డాక్టర్ శ్రీపతివైపు చూశాడు! చెప్పనా అన్నట్లు!

అప్పుడే ఒక నల్లకారు వీళ్లందరికీ వార్నింగ్ – గా హారన్ మోగిస్తూ ఆ కాంపౌండ్‌లోకి వెళ్లింది. నశ్యంరంగు పుల్ సూట్‌లోవున్న ఒక యువకుడు కారుదిగి మేడలోకివెళ్లి కాస్సేపటికి బాల్కనీలో ఆమెపక్క నిలబడ్డాడు.

'అదిగో చూస్తున్నారా? అతనామె భర్త. ఆయన పెద్ద సర్జన్

హైద్రాబాద్‌లో! కావాలనే అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకోవడం కోసం ఈ వూర్లో ఈ మేడ కొన్నారు. అంతే తప్ప ఆచార్యులవారు మనకి చెప్పనట్లుగా ఆమె విధవాకాదు! ఆమెని ఏ దయ్యమూ పట్టలేదు! డాక్టరుగారు చెప్పినట్లుగా ఆమెకి ఏజబ్బూ లేదు! అసలామె ఆయనతో కనీసం మాట్లాడనుకూడా మాట్లాడలేదు.! మేర రంగయ్య చెప్పినట్లు ఆమె ఇంట్లో అతనామె మెషర్‌మెంట్సు తీసికోలేదు! అతను తీసికొన్న మెషర్‌మెంట్స్ ఆమె ఇంట్లోని సోఫాలవి!

'మరైతే నువ్వెందు కెళ్లావు?' కసిగా అడిగాడు రంగయ్య.

'అవును! నేనూ మీ వలెనే వెళ్లాను! పెళ్లాలు చచ్చిన మీ రంతా ఆమెని అంగడిలో మిఠాయిలా చూశారు! ఎగబడి తిందామనుకొన్నారు! కాని మీకు నిజానికి అంత సాహసంలేదు! దాన్తో మీ బుర్రల్లోని నీచమైన ఊహల్ని ఇలా ప్రచారం చేసికొని తృప్తిపడ్డారు. నేనామె నిజంగానే విధవ అనుకొని ఆమెని వివాహమాడ్తానని చెప్పడానికి వెళ్లాను.'

'ఆమె నవ్వుతూ తాను విధవని కాననీ, తెల్లచీరా సింధూరం పెట్టుకోక పోవడం కేవలం తనకు నచ్చిన అలవాట్లనీ చెప్పింది!'

'ఆమె నిజంగా గొప్పది! మీరు తుచ్ఛమైన మనుష్యులు!'

ఇలా ఆ కుర్రాడిచేత మాటలు పడి చేసేదేమీలేక వాళ్లెవరి దారిన వాళ్లు పోయారు.

'ఈ కుర్రాడెవ్వడో గొప్పవాడిలా వున్నాడు' అన్నాడు బాల్కనీలోని భామతో ఆమె భర్త.

దానికామె ఫక్కున నవ్వింది.

'ఏమిటలా నవ్వుతావు?' అన్నాడాయన.

'అతను నన్నీ ఇంట్లో పోర్షన్ ఏదైనా వుంటే అద్దెకివ్వమని అడిగాడు.'

'మరి నువ్వేం చెప్పావు?'

'ఆ ఆచార్యులూ, డాక్టరూ, దర్జీ రోజూ తననిచూసి ఏం మాట్లాడు కొంటున్నారో చెప్తే పోర్షన్ ఇస్తానన్నాను. వెంటనే అతను వాళ్లనుకొన్నవీ అన్నవీ

అన్నీ చెప్పేశాడు!'

'నేను మనసంగతంతా చెప్పి మీరిప్పుడే కార్లో వస్తున్న సంగతి చెప్పేశాను!'

ఆ మాటల్ని విని అతను పెద్దగా నవ్వాడు!

అందర్నీ దుఃఖసాగరంలో ముంచినా రాజశేఖరానికి మాత్రం సంతృప్తి కలగలేదు! ఆ మేడమీది బాల్కనీలో ఆ సూట్‌లోని రోగ్, బహుశః తననిచూసే నవ్వుతుంటాడు.

డామిట్ కథ అడ్డం తిరిగింది!

(08.11.1968 నాటి ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురితం)

మళ్ళీ చిగిర్చిన వసంతం

భర్త ఇంకా ఇంటికి రాకపోవడంతో సుశీల మనస్సు పరిపరివిధాలా పోయింది. ఎన్నడూలేని రకంగా ఇవేళ భాస్కరం ఇంత ఆలస్యం ఎందుకు చేస్తున్నాడు? రోజూ ఎనిమిది గంటలు దాటకుండానే ఇంటికి వచ్చే మనిషి అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటినా రాకపోవడానికి కారణమేమయి వుంటుంది?


సుశీల కిటికీ తలుపులు తీసి బైటి చీకట్లోకి చూసింది. హిమాయత్‌నగర్ నల్లమందు తిని పండుకొన్నది. దూరాన నౌబత్ పహాడ్ ప్రాణాలు పోబోతున్న మానవుడిలా మినుకుమినుకు దీపాలతో వెలుగుతోంది.

చల్లని చలిగాలి ఒకటి రావడంతో సుశీల కిటికీ రెక్కలు మూసేసి మళ్ళీ మంచంమీద వచ్చి కూర్చుంది. విలువైన ఆస్పెన్సర్ కంపెనీ బెడ్డూ – దానిమీద రెడ్ కవరూ – ఇవేళ సుశీలతో పాటుగా ఆమె భర్తయైన భాస్కరం కోసం ఎదురుచూస్తున్నవి.

'రాలేదు! భాస్కరం ఇంకా రాలేదు.' దుఃఖంతో పైకి అనేసిన సుశీల మాటలకి గోడగడియారం శృతి కలిపి తెల్లవారు జామున మూడు గంటలు కొట్టింది.

ఇంక నిబ్బరంగా ఉండలేక సుశీల పడకగది వదిలి గబగబా స్టెయిర్‌కేస్ దిగి కాంపౌండ్‌లోకి వెళ్లి గేటు తెరిచి ఫుట్‌పాత్ మీద చాలాసేపు నిల్చుంది. ఇంతలో ఎవరో వెనుక కొంగు లాగినట్లయితే తిరిగి చూసింది భయంతో –

'అరె! రామూ వచ్చిందే తనవెంట' అంటూ ఆ ఆల్సేషియన్ కుక్కపిల్ల తో పాటు కాంపౌండ్‌లోకి నడిచింది సుశీల. గేటునానుకొనివున్న కారుగ్యారేజి ఖాళీగా బోసిగా కనబడి ఆరాత్రి ఏదో భయాన్ని కలిగించిందామెకు. గబగబా ఆమె ఇంట్లోకి వచ్చి ముందు హాల్లో కాస్సేపు కూర్చుంది. అక్కడే సోఫాలో అలసటతో దుఃఖంతో సుశీల జారగిలబడింది. ఉదయం ఫోను మోగుతుంటే సుశీల ఉలిక్కిపడి లేచింది. కళ్లు తెరవగానే ఆమెకు తనభర్త ఇంకా ఇంటికి రాలేదనే ఆలోచనతోపాటు – బహుశః ఆఫోన్ ఆయనే రింగ్‌చేసి వుంటాడనే


మళ్ళీ చిగిర్చిన వసంతం

ఊహ కలిగి గబగబా మేడ మీదికి వెళ్లి రిసీవర్‌నెత్తింది. కాని అవతలివైపు నుంచి కంఠం వినిపించగానే సుశీల వుత్సాహమంతా నీరుగారి పోయింది. అది ఆమె భర్త భాస్కరం సీనియర్ లాయర్ నీలకంఠరావు గారి కంఠం! భాస్కరాన్ని వెంటనే తన ఇంటికి పంపవలసిందిగా ఆయన చెప్పాడు. రాత్రినుంచి భాస్కరం ఇంటికి రాలేదనీ రాగానే అలాగే పంపిస్తాననీ చెప్పింది సుశీల.

ఉదయం తొమ్మిది గంటలయింది.

భాస్కరం రాలేదు. వంట మనిషి టిఫినూ కాఫీ బెడ్‌రూమ్‌కే తెచ్చి టీపాయ్‌మీద పెట్టి వెళ్లింది. కాని దుఃఖంతో సుశీల టిఫిన్ తినలేకపోయింది. వీధిలో కారు హారన్ వినబడితే చాలు భాస్కరం వస్తున్నాడేమోనని కిటికీ దగ్గరకు వెళ్లి చూస్తోంది. సుశీల! కాని ప్రతిసారీ ఆమెకి ఆశా భంగమే అవుతోంది.

టేబిల్ మీద భాస్కరం ఫోటో సుశీలని గంభీరంగా చూస్తోంది. గడియారంలో ముళ్లు నెమ్మది నెమ్మదిగా ఎగబ్రాకుతూ దిగబ్రాకుతూ వున్నవి. అవతల చలికాలపుటెండ చల్లగా కాస్తోంది. ఫతేమైదాన్ క్లబ్బుకి ఫోన్ చేసింది సుశీల. అక్కడ ఎవరూ ఫోన్‌ని కనీసం రిసీవైనా చెయ్యలేదు. నీలకంఠరావు గారి కోసం హైకోర్టుకి ఫోన్‌చేసింది. కాని ఆయన కోర్టుకి రాలేదని విని సుశీల ఆశ్చర్యపడి పోయింది.

ఏమైంది? భాస్కరం ఎక్కడికి వెళ్లివుంటాడు? సరిగ్గా భాస్కరం తనని వదిలి ఇరవైనాల్గు గంటలయింది. ఇంక సుశీలకి ధైర్యం చాలలేదు. గబగబా మొఖం కడుక్కుని పౌడరయినా వేసికోకుండా బైటకువచ్చి ఒక టాక్సీ తీసికొని నీలకంఠరావు గారింటికి వెళ్లింది. ఆయన ఇంట్లో లేకపోతే ఆయన కొడుకు రమాపతికైనా విషయం చెప్పి భాస్కరం జాడ తెలుసుకోనే ఏర్పాటు చేయిద్దామని ఆమె ఊహించింది. కాని అనుకొంది ఒకటీ – జరిగింది మరొహటీ!

కాలింగ్‌బెల్ నొక్కగానే సుశీల వయస్సుదే అయిన ఒక యువతి వచ్చి తలుపు తీసింది.

'నీలకంఠరావు గారున్నారా?'

'లేరు.'

'వారి అబ్బాయిగారు రమాపతి ఉన్నారా?'

'వారు మూడురోజులుగా సంజీవరావుగారి ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో వుంటున్నారు.'

'పోతే నీలకంఠరావుగారు కూడా అక్కడికే వెళ్లారా?'

'అవును' అన్నదాయువతి.

ఏం చేయాలో దిక్కుతోచక సుశీల టాక్సీలో ఇంటికి తిరిగి వచ్చింది. టాక్సీ దిగగానే కాంపౌండ్‌లో తమ కారు ఆగివుండడం చూసి పుట్టెడు సంతోషంతో సుశీల గబగబా టాక్సీదిగి వెయ్యిమైళ్ల వేగంతో లోపలికి పరుగెత్తింది. డ్రాయింగ్ రూమ్‌లో ఎవరో ఒక అపరిచిత వ్యక్తితో పాటు తన భర్త సీనియర్ నీలకంఠరావుగారు కూర్చుని వున్నా కనీసం నమస్కరించనైనా నమస్కరించక భర్తని చూద్దామన్న ఆదుర్దాతో వేగంగా మేడ మెట్లెక్కి సుశీల పడకగదిలోకి దౌడు తీసింది. అక్కడ భాస్కరం లేకపోవడంతో అతను బాత్‌రూమ్‌లో వుండివుంటాడని భావించి చీర మార్చుకుని నుదుట తిలకందిద్ది సుశీల నెమ్మదిగా కిందికి వచ్చింది – అతిథుల్ని సత్కరించడం కోసం!

ఆమె వచ్చేటప్పటికి నీలకంఠరావుగారు అటూ ఇటూ పచారు చేస్తున్నారు. సుశీల రాకని చూసి ఆయన అర్థవంతంగా ఆగిపోయారు.

'ఈయన డాక్టర్ సంజీవరావుగారు.'

'వోహో! అలాగా! మీ అబ్బాయి రమాపతిగారీయన వద్దనే వైద్యం చేయించు కొంటున్నారు కదూ!' అన్నది సుశీల.

ఆ మాటతో నీలకంఠరావుగారు ఒక్కక్షణం స్తబ్దుడై పోయాడు. ఆయన కళ్లలో నీరు నిండింది. డాక్టర్ సంజీవరావు మొగంలో కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు. అది గమనించిన సుశీల ఏదో కీడు శంకించి 'ఏమైంది? అలా అయిపోయారు' అన్నది ఆశ్చర్యంగా.

'మీరోసారి మా హాస్పిటల్‌కి రావాలి.' అన్నాడు డాక్టర్ సంజీవరావు.

'అదేమిటి డాక్టరుగారూ! ఆరోగ్యంగా వున్న వాళ్లని కూడా మీ

నర్సింగ్‌హోంలో జాయిన్ చేసికొంటారా ఏమిటి?' అన్నది నవ్వుతూ సుశీల.

'నువ్వోసారి వెంటనే హాస్పిటల్‌కి రావాలమ్మా' ఆమె మాటల్ని లక్ష్యపెట్టక గంభీరంగా అన్నాడు నీలకంఠరావు.

'సరే అలాగే వస్తాను. మా శ్రీవారు స్నానం చేస్తున్నట్లున్నారు. ఆయన స్నానమయ్యాక ఆయనా, నేనూ కలిసి వస్తాం' అన్నది సుశీల వినయంగా.

నీలకంఠరావు సుశీలను సమీపించి –

'సుశీలా! నీభర్త కూడా అక్కడే వున్నాడు. నువ్వు అర్జంటుగా రావాలి.'

ఆ మాటతో సుశీల దిగాలుపడిపోయింది. వాళ్లతోకలిసి కాంపౌండ్‌లోని కారుదాకా వెళ్లింది.'అరే ఇది తమకారు కాదే – ఇందాక పొరపాటున తమ కారనే అనుకొన్నాను' అనుకుంటూ లోపల కూర్చుంది. వీళ్లు తనని అర్జంటుగా నర్సింగ్ హోంకి ఎందుకు తీసికొని వెళ్తున్నారు? తానెవరికైనా అక్కడ రక్తదానం చేయాలా? తానలా రక్తదానం చేస్తే ఇప్పుడు తిరిగినంత ఆరోగ్యంగా ఇకముందు కూడా వుండగలదా? రక్తదానం చేసిన వాళ్లకి తిరిగి రక్తం పెట్టడానికిగాను డాక్టర్లు వో పదిరోజులదాకా ఉచితంగా బత్తాయిపండ్లు ఇస్తారట! అయినా తాను బత్తాయి పళ్లు కొనుక్కోలేనంత బీదదా? మళ్లీ సుశీల మనస్సులోకి భాస్కరం వచ్చాడు – ఆ రోజల్లా భాస్కరం హాస్పిటల్‌లోనే వున్నాడా? బహుశః నీలకంఠరావు గారి అబ్బాయి రమాపతికి ఏదో సీరియస్ అయి ఉంటుంది. స్నేహితుడి దగ్గర ఉండిపోవాల్సి వచ్చివుంటుంది.

సంజీవ్ నర్సింగ్‌హోం కాంపౌండ్‌లోకి కారువచ్చి ఆగింది. సంజీవరావు కారుదిగి తలుపు తీశాడు. సుశీలని కారుదిగమన్నట్లుగా! సుశీల కారు దిగింది. ఆమెకి ఒకవైపున నీలకంఠంరావూ – మరోవైపున డాక్టర్ సంజీవరావూ నడిచారు. హాస్పిటల్ మూడో అంతస్తుకి లిఫ్ట్‌మీద వెళ్లారు. వార్డుల్లో నర్సులూ డాక్టర్లూ సంజీవరావుని చూసి విష్ చేస్తూ సుశీలవైపు భావగర్భితంగా చూశారు.

ఆ ముగ్గురూ మూడో అంతస్తులో నలభయి నాలుగో గదిలోకి వెళ్లారు. గదిలోకి వెళ్లగానే సుశీలకి ఎంతో చల్లగా అనిపించింది. డోర్‌కి ఎదురుగా టేబిల్ మీద ఎవరినో పడుకోబెట్టి దుప్పటి కప్పినట్లున్నారు.

సుశీల భయంతో వాళ్లిద్దరితోపాటు ఆ టేబిల్ దగ్గరకు చేరింది. డాక్టరు సంజీవరావు టేబిల్‌మీద పండుకొని వున్న వ్యక్తి మొగం మీదనుంచి దుప్పటి తొలగించాడు.

సుశీల అతణ్నిచూసి కెవ్వున కేకవేసి అతని గుండెలమీద వాలిపోయింది.

అతడే భాస్కరం.

ఆ రోజల్లా అతనికోసమే సుశీల వేచివున్నది.

ఇక ఆమె అతనికోసం వేచి వుండాల్సిన పనిలేదు.

పై లోకాల్లో అతనే ఆమెకోసం వేచి వుంటాడేమో?

ఆ రోజల్లా సుశీల బంధువులు వచ్చారు. ఆమె తల్లీ తండ్రీ అన్నగారైన డాక్టర్ నాగమణి సుశీలని వోదార్చారు.

డాక్టర్ నాగమణి సుశీలని వోదార్చి తన బావగారి కారు ఆక్సిడెంట్ వివరాల్ని, సంజీవరావు చేసిన చికిత్సనీ తెలిసికొన్నాడు. అతని మనస్సులో ఏదో అనుమానం కల్గింది. వెంటనే అతని తండ్రికి చెప్పి బావగారి అంత్యక్రియల్ని తాను వచ్చేవరకు ఆపి వుంచవలసిందని కోరి తనకి కాలేజీలో ప్రొఫెసరూ ఉస్మానియా హాస్పిటల్‌లో పెద్ద సర్జనూ ఐన డాక్టరు దాస్ గుప్త గారిని కలిసి తనకి కలిగిన అనుమానాన్ని వెలిబుచ్చాడు. ఆయన వెంటనే అతనితోబాటు వచ్చి భాస్కరం శవాన్ని నిశితంగా పరిశీలించాడు. భాస్కరం వక్షస్థలంవద్ద నోసెస్ మెథడ్ ఆపరేషన్‌తో అతని గుండెని ఎవరో దొంగిలించారు! భాస్కరం శరీరంలో అతని గుండె లేదు!

డాక్టర్ దాస్‌గుప్త పోలీసులకి ఫోన్‌చేసి పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ వ్రాసి భాస్కరం శవాన్ని అతని కుటుంబానికి అప్పగించాడు.

వివాహమయి మూడు నెలలయినా కాలేదు! కాని సుశీల విగతభర్తృక అయిపోయింది.

ఈ కథ ఇక్కడికి ముగియలేదు!

ఇక్కడినుంచే ప్రారంభమైంది.

డాక్టరు సంజీవరావుని పోలీసులు అరెస్ట్ చేశారు.

అతనిమీద పోలీసులు చార్జిషీట్ తయారుచేసి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసుపెట్టారు. హైద్రాబాద్ నగరమంతా ఆవార్త బాంబులా పేలింది. వార్తాపత్రికలన్నీ ఒకేరోజున – 'డాక్టర్ సంజీవరావుగారు చేసిన గుండెమార్పిడి ఆపరేషన్ విజయం' – అనే వార్తనీ 'హత్యానేరం, గుండెని దొంగిలించిన నేరం ఆరోపించి డాక్టరు సంజీవరావుని అరెస్ట్ చేశారు' – అనే వార్తనీ పతాక శీర్షికలుగా ప్రచురించినవి.

ఎన్నడూ మేజిస్ట్రేట్ కోర్టుకి రాని అడ్వొకేట్ నీలకంఠరావు కోర్టుకి వచ్చి విశ్వప్రయత్నంమీద డాక్టర్ సంజీవరావుని బెయిల్‌మీద విడుదల చేయించాడు.

ఆనాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చార్జీషీట్ చదివాడు. కోర్టంతా నిశ్శబ్దమైంది. ఆ ఆశ్చర్యాన్ని స్వయంగా అనుభవిద్దామని ఎందరెందరో గొప్పవాళ్లు కార్లలో వచ్చి సికింద్రాబాద్ మేజిస్ట్రేట్ కోర్టులో కిటకిటలాడిపోయారు. చార్జిషీట్ చదువుతున్నంత సేపై వాళ్లంతా నిశ్శబ్దంగా వుండిపోయారు.

– 'హైద్రాబాద్ నగరంలోని సంజీవ్‌నర్సింగ్ హోమ్ అధికారి – డాక్టర్ కొల్లా సంజీవరావు – కొల్లా ప్రభాకరంగారి కుమారుడు – ప్రముఖలాయరు తన స్నేహితుడైన పన్నగాల నీలకంఠరావుగారి కొడుకు రమాపతిగారి గుండెజబ్బుకి చికిత్సచేస్తూ – అతను మరణోన్ముఖుడయివుండగా అదే హాస్పిటల్‌కి సీతాపతిగారి కుమారుడైన లాయర్ భాస్కరం గారు కారుప్రమాదంలో గాయపడిన స్థితిలో తీసికొని రాబడగా – అతనికి చికిత్స చేయడానికి బదులు అతని సజీవమైన గుండెని బయటకు తీసి నీలకంఠరావుగారిచ్చే పెద్ద ఫీజుకి ఆశపడి – భాస్కరావు మరణానికి కారణమైనాడు. అందువల్ల డాక్టర్ సంజీవరావు మీద ఐ.పి.సి. 302 సెక్షన్ ప్రకారం కోర్టువారు తగు శిక్షను విధించి అమలు పరచవలసిన సౌకర్యాన్ని కల్గించడం కొరకుగాను ఈ కేసుని సెషన్స్‌కి కమిట్ చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను' –

చార్జిషీట్ చదువుతున్న సమయంలో డాక్టర్ సంజీవరావు మొగం కిందికి దిగిపోయింది. దీనంతటికీ కారణమైన సుశీల అన్నగారైన డాక్టర్ నాగమణి విజయగర్వంతో సంజీవరావు వైపు చూశాడు.

కేసుని సెషన్స్‌కి కమిట్ చేశారు. ప్రేక్షకులంతా కోర్టు వదిలి వెళ్లిపోయారు. సుశీల కోర్టుకి రాలేదు. అప్పటికి భాస్కరం చనిపోయి సరిగ్గా మూడునెలలయింది. సుశీలకి దుఃఖతీవ్రత కాస్తకాస్తగా తగ్గుతోంది. ఆరునెల్ల జీవితంలో మూడునెల్లు విధవగాను గడిచినవి సుశీలకి.

పెంపుడు కుక్క రామూ సుశీల పాదాలు నాకుతోంది. తనకోసం ఎవరో యువతి వచ్చిందని వంటమనిషి వచ్చి చెప్పగా ఆమెని పైకి తీసుకొని రావలసిందిగా సుశీల ఆజ్ఞాపించింది.

ఆ యువతి మేడపైకి వచ్చింది.

ఆమెని చూడగానే సుశీల ఆశ్చర్యపడి 'మీరా' అన్నది.

'అవును! నేనే! రమాపతిగారి చెల్లెల్ని. నీలకంఠరావుగారి ఏకైక పుత్రికని.'

'కూర్చోండి.'

ఆ యువతి కూర్చున్నది. చాలాసేపు ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు. కాస్సేపటికి నిశ్శబ్దాన్ని చీల్చుకుని ఆ యువతే మాట్లాడింది.

'మా అన్నయ్య మీకేం ద్రోహం చేశాడు?'

హఠాత్తుగా విన్న ఆ ప్రశ్నకి ఆశ్చర్యపడింది సుశీల.

'ఏమిటి మీరంటున్నది?' అని అమాయికంగా అడిగింది.

'ఐతే మీకేమీ తెలియదా?'

'డాక్టర్ సంజీవరావు మీద పోలీసులు కేసు పెట్టారని తెలుసు, కాని....'

'కాని మా అన్నయ్యమీద మీకేమీ శత్రుత్వం లేదంటారు.'

'అవును' అన్నది సుశీల.

'కాదు. మీకు మా అన్నయ్య బ్రతకడం ఇష్టంలేదు. కావాలంటే నెలరోజుల తర్వాత సెషన్స్ కోర్టుకి మీ అన్నగారు నాగమణి గారితో కలిసిరండి. నేనివాళ అన్నమాటలెంత సత్యమో ఆనాడు తెలుస్తవి మీకు' ఆమె ఎంతో వ్యాకులతతో

అన్నదా మాటల్ని.

సుశీల మౌనంగా వుండిపోవడం చూసి ఆ యువతి లేచి సుశీల దగ్గరకు వచ్చి ప్రార్థనా పూర్వకంగా అన్నది –

'ప్రాణదానం చేసిన వ్యక్తిని మానసికంగా ఈ పోలీసు కేసు ఖూనీ చేస్తోంది. ఈ దుస్థితినుంచి సంజీవరావుగారిని మీరొక్కరే రక్షింపగలరు.'

ఆ మాటలకి సుశీల విచలిత అయింది. మళ్లీ వస్తానని చెప్పి ఆ యువతి వెళ్లిపోయింది. టేబిల్‌మీది ఫోటోలోంచి భాస్కరం కళ్లు తనని గంభీరంగా చూస్తున్నవి –

డాక్టర్ సంజీవరావు ఎవరికి ప్రాణదానం చేశాడు? ఎవరికో ప్రాణమివ్వ గల్గిన వ్యక్తి భాస్కరానికే ఎందుకివ్వలేకపోయాడు? నిజంగా నీలకంఠరావు గారిచ్చే పెద్ద ఫీజుకి ఆశపడే భాస్కరానికి చికిత్స చేయకుండా అతని గుండెని అపహరించి రమాపతికి అమర్చాడా? – మూడునెలల్లోనే తనకు జీవితమంతా ముగిసింది. తనకు కనీసం చిరస్మరణీయమైన స్మృతులైనా లేవు! ఛ! తానెంత దురదృష్టవంతురాలు. ఐశ్వర్యం, మేడా, నగలూ, పెంపుడుకుక్కా తప్ప తనకేం మిగిలినవి? ఎవరిని చూసికొని ఎవరికోసం తానీ జీవిత కారాగారంలో ఈ శిక్షననుభవించాలి? – భర్త ఫోటో తనని చూసి నవ్వినట్లనిపించింది. వెంటనే లేచి లజ్జతో ఆ ఫోటోని వెనక్కి తిప్పేసింది సుశీల! అంతలో ఫోను మోగింది. ఎవరయి వుంటారో అనుకొంటూ రిసీవర్ నెత్తింది సుశీల.

'ఎవరండీ మీరు?' అడిగింది సుశీల.

'నేను రమాపతిని. మా పద్మ ఇంకా ఇంటికి రాలేదు మీ దగ్గరకని బయలుదేఇరింది. ఒకవేళ మీ ఇంట్లో వుంటే....'

'ఇప్పుడే ఆమె వెళ్లిపోయింది.'

'వోహో! అలాగా థాంక్యూ!' అతను రిసీవర్ పెట్టేశాడు.

ఈ రమాపతి భాస్కరంతోపాటు తమ ఇంటికి వో పది పదిహేనుసార్లు వచ్చాడు. అంత ఆరోగ్యంగా పొంకంగా వుండే రమాపతికి అంత భీకరమైన హృద్రోగం వుందని తాను కలలోనైనా వూహించలేదు. మొత్తానికి అదృష్ట

వంతుడు! ఆ ఊహతో సుశీల కళ్లల్లో నీళ్లు నిల్చినవి – అవును. అతని ఈ అదృష్టానికి తన భర్త హృదయమే కారణం! అవును! తన భర్తే కారణం! కాకపోతే తన భర్త వెళ్లిన చోటికే ఈ రమాపతీ వెళ్లి వుండేవాడు.

అనేక ఆలోచనల్తో సుశీలకి ఆరాత్రి నిద్రపట్ల లేదు. ఉదయం తొమ్మిది గంటలకి వంటమనిషి ఆమెని నిద్రలేపింది. సాయంత్రం నాలుగ్గంటలదాకా సుశీల శూన్యంలో గడిపింది – వోహ్! స్నేహితులు లేని ఈ శూన్య జీవితం.... ఛ!ఛ!.... ఎవరైనా స్నేహితులు లభిస్తే!.... అవును.... రమాపతి చెల్లెలు మంచి హృదయం కలదానిలా కనిపిస్తోంది – వెంటనే సుశీల నీలకంఠరావు గారింటికి ఫోను చేసింది ఆ యువతికోసం. కాని అవతలి నుంచి రమాపతి ఎత్తుకొన్నాడు రిసీవర్ని.

'ఎవరు కావాలి?'

'మీ చెల్లాయి పద్మ'

'పద్మ ఎక్కడికో వెళ్లింది. ఇంటికింకా రాలేదు.'

'రాగానే ఆమెను టాంక్‌బండ్ పక్కనున్న పార్కులో నన్ను కలుసుకోమనండి' అన్నది సుశీల.

'అలాగే'

'థాంక్యూ!' అంటూ రిసీవర్ పెట్టేసింది సుశీల.

మొఖం కడుక్కొని తెల్లని చీరకట్టుకొని డ్రెస్సింగ్ టేబిల్ ముందర నిలబడింది సుశీల. ఎదురుగా అద్దంలో సుశీలకి తన ప్రతిబింబం తనకే తెల్లని పాలరాయిలా కన్పించింది – నొసట సింధూరం లేకపోయినా.... ఆ ఆలోచనతో ఆమె కంపించిపోయి గిరుక్కున వెనక్కి తిరిగి గబగబా కిందికి వచ్చి తలుపులువేసి గారేజిలోంచి కారు బైటకు తీసింది. సుశీల కారులో టాంక్‌బండ్ వైపుగా బయలుదేరింది. ఇదే కారులో తన భర్త చనిపోయాడు. కారుకి రిపెయిర్ చేయగలిగారు కాని తన భర్తలోని అవయవాన్ని మాత్ర స్పేర్‌పార్ట్‌గా చేసి రమాపతికి వాడగల్గారు! సుశీల ఉద్విగ్నతతో గట్టిగానే కారుహారన్ మోగించింది. అంతలో టాంక్‌బండ్ పార్కు రాగా ఆమె కారుని పార్క్‌చేసి

లోపలికి వెళ్లింది.

సుశీల పార్కులోపల పద్మకోసం వెదికింది. కాని ఆమె ఎక్కడా కనపడలేదు. నిరాశతో వెనుదిరగబోతుండగా వెనకనించి ఎవరో –

'నమస్కారమండీ!' అన్నారు. ఎవరా అని సుశీల వెనుదిరిగి చూసేటప్పటికి ట్యూబ్‌లైట్ల వెలుగులో రమాపతి కన్పించాడు. అతణ్ని చూసి ఆశ్చర్యపడి ప్రతి నమస్కారం చేసింది సుశీల.

'మా చెల్లాయి ఇంతవరకు ఇంటికిరాలేదు. మీరామెకోసం ఈ చలిలో ఎంతసేపు వేచివుంటారోనని నేనే స్వయంగా వచ్చాను' అన్నాడతను తలదించుకొని.

మౌనంగా సుశీల పార్కవతల తన కారుదగ్గరకు వచ్చింది. ఆమె వెంటే రామపతీ వచ్చాడు. రమాపతీ కారు తలుపుతీసి ఆమెని లోపల కూర్చోమన్నాడు. 'నాకు డ్రైవింగ్ వచ్చును' అన్నదామె.

'నాకు వస్తుంది పదండి' అంటూ అతను స్టీరింగ్ దగ్గర కూర్చుని కారు స్టార్ట్ చేవాడు. కారులో చీకటి విచిత్రంగా వుంది. వెనకసీటులో కూర్చున్న సుశీల రమాపతిని పరకాయించి చూసింది. పూర్వం ఆ స్థానంలోనే భాస్కరం కూర్చునికారు నడిపేవాడు. ఆ చీకట్లో వెనకనుంచి చూస్తే రమాపతి అచ్చం భాస్కరంలాగే కన్పిస్తున్నాడు – 'హే భగవాన్! నీ మహత్తు చూపించి ఎలాగైనా భాస్కరాన్ని బ్రతికించకూడదూ!' – సుశీల కళ్లల్లో నీళ్లు నిలిచినవి. కారు తమ మేడ గేటులోంచి లోపలికి వచ్చి గ్యారేజిలో ఆగింది. రమాపతి కారుదిగి బ్యాక్‌డోర్ తీసి సుశీలని దిగమన్నట్లుగా చూశాడు. సుశీల కారు దిగింది. రమాపతి కారు హెడ్‌లైట్సు ఆఫ్ చేసి విండో గ్లాసెస్ ఎత్తేసి మెషిన్ లాక్ చేసి కారు తలుపులు వేశాడు – సరిగ్గా భాస్కరమూ అలాగే చేసేవాడు. ఆ గ్యారేజి చీకట్లో భాస్కరం తనని కవ్వించేవాడు – ఆ ఊహరాగానే గుండె స్తంభించి పోయి సుశీల గబగబా గ్యారేజి బయటకు వచ్చేసింది. రమాపతి గ్యారేజి తలుపులు వేసి ఆమె వెంట ఇంట్లోకి వచ్చాడు. రామూ తోక ఊపుకొంటూ వచ్చి అతని పాదాల నాకింది. ఆ దృశ్యం చూడగానే సుశీలకి దిగ్భ్రాంతి కలిగింది. ఇదివరకు రమాపతి ఎప్పుడు తమ ఇంట్లోకి వచ్చినా భవ్ భవ్ అని అతని మీదకి ఎగిరేది.

కాని ఇవాళ –

'వెళ్లివస్తాను' అంటూ నమస్కరించి రమాపతి వెళ్లిపోయాడు. సుశీల మనస్సులో అనేక ఆలోచనలు ముసిరినవి. ఇంతపెద్ద మేడలో తానెంత వంటరి! పైకివెళ్లి బెడ్‌మీద వాలింది. పద్మకి బదులు రమాపతి రావడం – అతనే కారు డ్రైవ్ చేయడం – కారు రాగానే ఎన్నడూలేనిది రామూ అతని పాదాల్ని నాకడం ఇవన్నీ భాస్కరాన్ని గుర్తుకు తెచ్చినవి సుశీలకి! కాని... కాని.... గ్యారేజిలో భాస్కరంలాగా.... హే భగవాన్! ఈ మొండి బ్రతుకు ఎన్నాళ్లు నాకు? దిండులో తలదూర్చి దుఃఖించింది సుశీల.

ఆ రోజున పోలీస్ ఆఫీసర్ ఇంటికి వచ్చాడు. ఆ కేసు బలే ఇంటరెస్ట్ అయిన కేసనీ తాము శిక్షణ ఇచ్చినట్లుగా సుశీల చీఫ్ ఎవిడెన్స్ ఇస్తే సంజీవరావు నేరస్తుడనే విషయాన్ని జడ్జిగారిట్టే నమ్ముతారని చెప్పి వెళ్లాడతను.

కేసు ఇంటరెస్టట! హు! జడ్జిగారు నమ్ముతారట! అంతే గాని డాక్టర్ సంజీవరావు నిజంగా నేరం చేసిందీ లేనిదీ ఆ ఆఫీసర్‌కి పట్టిలేదు! ఆ మధ్యాహ్నం ఆమె అన్నగారు డాక్టరు నాగమణి చెల్లెలికి ఫోను చేశాడు. మరో పది రోజులకి సెషన్స్‌లో ఎవిడెన్స్‌లూ ఆర్గ్యుమెంట్లూ ప్రారంభిస్తారనీ తాను వచ్చి అన్ని విషయాలూ మాట్లాడ్తాననీ చెప్పాడతను! అంతే తప్ప విధవయైన తన చెల్లెలి మనస్సులో ఏ ప్రభంజనాలు వీస్తున్నవో? ఎన్నెన్ని భూకంపాలు కల్గుతున్నవో? మోడువారిన ఆమె జీవన వృక్షం వసంతం కోసం అశ్రులు చాస్తున్నదో? లేదో? అనే ఆలోచనలే అతనికి పట్టలేదు! ఛీ! ఈ ధనవంతుల ఇళ్లలో పుట్టిన దానికన్నా కూలీ నాలీ చేసికొని బ్రతికే వాళ్లిళ్లలో పుడ్తేనన్నా కాస్త మానవత్వం వున్న మనుష్యులు లభించి వుండేవాళ్లు! – సుశీల కిటికీ దగ్గర నిల్చుని కాంపౌండ్ క్రోటన్స్‌ని చూస్తూ ఆలోచిస్తోంది. అంతలో రమాపతి కారులో రావడం గమనించింది సుశీల. అతను ముందు హాల్లో సోఫాలో కూర్చుని తన కోసం మనిషిని పంపిస్తాడు పైకి – అనుకొంటూ కుర్చీలో కూర్చుంది సుశీల! కాని మనిషికి బదులుగా రామూ సంతోషంగా పైకి వచ్చి సుశీల చేయి నాకి పమిట పట్టుకొని లాగింది. కాని సుశీల కదలకుండా అక్కడే కూర్చుండి పోయింది.... రామూ ఎంతో అల్లరి చేసి ఇంక సుశీలని కిందికి తీసికొనిపోవడం అసంభవమ నుకొన్నదేమో తోక ముడుచుకొని తానే కిందికి వెళ్లింది. మరుక్షణంలో రమాపతి

సుశీల గదిలో వున్నాడు. అతని చేతిలో ఏదో పాకెట్ వుంది!

అత నామె చేతిలో ఆ పాకెట్‌ను ఉంచి –

'ఇవేళ మీరు నా యీ కానుకని అంగీకరించాలి' అన్నాడు. సుశీల నిర్లిప్తంగా దాన్ని స్వీకరించి టేబిల్ మీద పెట్టేసింది. 'లోపల విప్పి చూడండి' అన్నాడతను తలదించుకొంటూ.

'విగత భర్తృక పరాయి మొగాళ్ల కానుకల్ని స్వీకరించడం మర్యాద కాదు' అన్నాదామె కిటికీలోంచి బైటకు చూస్తూ.

రమాపతి వంచిన తల ఎత్తలేదు.

ఇద్దరూ మౌనంగానే వుండిపోయారు.

అంతలో రామూ ఆ ప్యాకేజి కవర్‌ని లాగేయగా లోపలి ముద్దమందారం రంగు పీతాంబరం బయటపడింది. అది కళ్లబడగానే సుశీల కళ్లు జిగేల్‌మన్నవి. ఆమెకి తన హృదయం ఆగిపోయినట్లయింది. ఆ ఆవేశాన్ని ఆపుకోలేక ఆమె ఒక్కసారిగా లోపలి గదిలోకి పరుగెత్తుక వెళ్లింది. – 'వో భగవంతుడా! ఈ రమాపతి.... అచ్చం నా భాస్కరంలాగే ప్రవర్తిస్తున్నాడు.... లేకపోతే నాకీ ముద్ద మందారం రంగు నచ్చుతుందని ఇతని కెట్లా తెలుసు? వోహ్!' ఆమె కళ్లలోంచి కన్నీటి వరద పారింది. ఆమె ఆ గదిలో అలా దుఃఖించి దుఃఖించి చాలా సేపటికి ముందరి గదిలోకి వచ్చింది. రమాపతి ఇంకా అలాగే తలవంచుకొని నిలబడ్డాడక్కడ!

'మీ రింకా ఇక్కడే వున్నారా?'

అతను శిరస్సు నెత్తాడు. అతని కళ్లు భాష్పపూరితాలయి వున్నవి.

'అవును. నేను తప్పుచేస్తే క్షమించండి. నాకు గుండెనిచ్చి జీవం పోసిన ప్రాణమిత్రుడి భార్యకి కానుక నివ్వడం తప్పే అయితే...' అతని కంఠం గాద్గద్యంతో వణికి ఆగిపోయింది.

సుశీల మౌనంగా అతని వద్దకి వచ్చి 'క్షమించండి' అన్నది. అతను సెలవు దీసికొని నెమ్మదిగా మెట్లుదిగి వెళ్లిపోయాడు.

ఆనాడు కోర్టులో డాక్టర్ సంజీవరావుని ఛీఫ్ ఎక్సామినేషన్ చేశారు.

'డాక్టర్! మీరీ వృత్తిలో చేరిన నాటి నుంచి ఎన్ని ఆపరేషన్‌లు చేసివుంటారు?'

'లెక్క పెట్టలేదు గాని సుమారొక వెయ్యి దాటి వుంటవి?' అన్నాడా డాక్టర్.

'వాటిలో ఏ కేసయినా ఫెయిలయిందా?'

'ఫెయిలవుతే అంతమంది నా దగ్గర కెందుకు వస్తారండీ?'

'జీవితంలో ఎన్నడైనా మీరు నేరం చేశారా?'

'నోస్సర్!' అన్నాడు డాక్టరు సంజీవరావు దృఢంగా.

ఎక్సామినేషన్ చాలించి నీలకంఠరావు ప్రాసిక్యూటర్ వైపుకి చూశాడు – క్రాస్ ఎక్సామ్ చేసికోవచ్చు నన్నట్లు –

ప్రాసిక్యూటర్ లేచి

'డాక్టర్! మీరింతవరకు ఏమాత్రం సంపాదించి వుంటారు?' నెమ్మదిగా అడిగాడు.

'పది లక్షలదాకా!' అన్నాడు డాక్టర్.

'అందులో నీలకంఠరావు గారు ఫీజుగా ఇచ్చినవి ఎన్ని లక్షలో?'

ఆ ప్రశ్నకి నీలకంఠరావు కోపంగా లేచి

'ఐ ఆబ్జెక్ట్ మైలార్డ్! నన్నూ, నా క్లయింటునూ ప్రాసిక్యూటర్ అవమానిస్తున్నారు.'

'ఆబ్జెక్షన్ రూల్డ్ అవుట్. ప్రొసీడ్.' న్యాయాధికారి డెసిషన్ ఇచ్చారు.

'ఇంతవరకు నీలకంఠరావుగారి దగ్గరి నుంచి ఒక్క పైసా అయినా తీసికోలేదు.'

'ఐతే ధర్మానికి చేశారా?' ఎక సెక్కంగా అడిగాడాయన.

‘ఒక జీవిని మృత్యువు నుంచి రక్షిద్దామని చేశాను.’ అన్నాడు డాక్టరు నిబ్బరంతో.

‘ఒకరికి ప్రాణమిచ్చి మరొకరి ప్రాణం తీయమని ఏ ధర్మశాస్త్రం చెప్పింది?’ కఠినంగా అడిగాడు ప్రాసిక్యూటర్.

‘నే నెవరి ప్రాణాన్నీ తీయలేదు. భాస్కరంగారి గుండెని మాత్రమే నేను తీసింది.’

‘మీ గుండెని మరో డాక్టరెవరైనా తీస్తే ఊరుకొంటారా మీరు?’ కోపంగా అడిగాడు ప్రాసిక్యూటరు.

‘నేను చచ్చాక ఎవరి ప్రాణాన్నైనా రక్షించడం కోసం నా గుండెని తీసికొంటే ఊరుకొంటాను. అంతేకాదు. ప్రపంచ ప్రజలందరూ అలా తమ హృదయాల్ని దానంచేస్తే ఈ లోకంలో గుండె జబ్బులుండవనీ తద్వారా లోక కళ్యాణం జరుగుతుందనీ ఘంటాపథంగా చెప్పగలను.’

వెంటనే ప్రాసిక్యూటర్ దయాస్ కిందికి వచ్చి జడ్జిగారిని చూస్తూ

‘మై లార్డ్, దయచేసి ఈ విషయం నోట్ చేయండి! తన గుండెనేమో ఈయన తన మరణానంతరం తీసికోనిస్తాడట – కాని భాస్కరం గారి గుండెని మాత్రం అతనికి మృత్యువు ప్రాప్తించక ముందే తీసికొన్నాడీ మహానుభావుడు! దిస్ క్లియర్లీ షోస్ దట్ మిస్టర్ భాస్కరం వాస్ మర్డర్డ్ బై దిస్ డాక్టర్.’

సమయం కావడంతో ఆ నాటికి కోర్టు లేచింది. జనమంతా దిగ్భ్రాంతితో ఏం జరగనున్నదో అని కుతూహలంతో లేచారు.

సుశీల ఆనాడు కోర్టుకి రాలేదు. ఆ సాయంకాలం రమాపతి ఆమె వద్దకి వచ్చాడు. అతనికి సోఫా చూపించి కూర్చోమన్నది సుశీల. అతను కూర్చోక ఆమెనే చూస్తూ నిలబడ్డాడు.

“ఏం అలా చూస్తావు రమాపతీ?”

“మేమీ కేస్ వోడిపోతాం.”

“పోతే నాకేం?” గంభీరంగా కిటికీలోంచి బైటకు చూస్తూ అన్నది సుశీల.

"అప్పుడు నీ భాస్కరం గుండె నీకు తిరిగి లభిస్తుంది." అని అతను గబగబా అవతలకి వెళ్లిపోయాడు.

ఏమీ అర్థం కాక సుశీల నిశ్చేష్టయై నిలుచుండి పోయింది.

ఆ మర్నాడు డాక్టర్ సంజీవరావుని క్రాస్ ఎక్సామిన్ చేయడం తిరిగి మొదలయింది.

"భాస్కరం గుండెని తీసికోవడానికి అతని అనుమతిని మీరు తీసికొన్నారా?"

"లేదు."

"ఎందుకు?" గద్దించి అడిగాడు ప్రాసిక్యూటర్.

"చచ్చినవాణ్ని ఎలా అనుమతి కోసం మాట్లాడించను" –

"అప్పటికే భాస్కరం చచ్చిపోయాడా?" జడ్జి గారడిగారు.

"మైలార్డ్! మృత్యువు కింకా నిర్వచనం పూర్తికాలేదు. మొన్ననే సిడ్నీలో ఇంటర్నేషనల్ ఫిజిషియన్స్ అంతా సమావేశమయి మృత్యువుని నిర్వచించడానికి ప్రయత్నం చేశారు." అన్నాడు డాక్టర్.

"పోతే మీరు చేసికొన్న నిర్వచనాన్ని బట్టి భాస్కరం మీ దగ్గరకు చచ్చిపోయాకే వచ్చాడంటారు?" ప్రాసిక్యూటర్ ఎంతో తెలివిగా అడిగాడు!

"అవును!" అన్నాడు డాక్టర్.

"అయితే మీరు మరణించిన ఏ మనిషి గుండెనయినా తీసి దాన్ని ఇలా హృద్రోగులకి వాడగలరా?"

డాక్టర్ సంజీవరావు గారి జవాబు కోసం కుతూహలంతో జడ్జీగారి నుంచి అమీన్ వరకు అందరూ చూశారు. సుశీల తల వంచుకొని కూర్చుంది.

సంజీవరావు జవాబు చెప్పకపోయేటప్పటికి ప్రాసిక్యూటరే తిరిగి అడిగాడు.

"భాస్కరం గుండెని మీరు తీసి వేసే సమయానికి అతని గుండె

కొట్టుకొంటున్నదా లేదా?"

"కొట్టు కొంటోంది!"

కోర్టంతా సూది వేస్తే వినబడేటంత నిశ్శబ్దంగా కూర్చుంది.

"మైలార్డ్! గుండె కొట్టుకొంటుండగా భాస్కరం ఎలా చచ్చినవాడైనాడు? డాక్టర్ సంజీవరావు ఒట్టి హత్యనే కాదు గుండెని దొంగతనం కూడా చేశాడు – డియర్ డాక్టర్ మీరింక వెళ్లిపోవచ్చు." అని ప్రాసిక్యూటర్ విజయగర్వంతో రమాపతిని ఎక్సామిన్ చేయడం కోసం పిలిపించాడు. అన్ని లాంఛనాలు ముగిశాక–

"మీ పేరు?" అని అడిగాడు ప్రాసిక్యూటర్.

రమాపతి సమాధానం చెప్పలేదు. మళ్లీ అదే ప్రశ్నని రెట్టించి అడిగాడు ప్రాసిక్యూటర్. రమాపతి సమాధానం చెప్పలేదు. అతను మౌనంగా అలాగే బోనులో నిలబడ్డాడు.

"ఇది కోర్టు ధిక్కరణ నేరం"గర్జించాడు ప్రాసిక్యూటర్.

"అలా అయితే నా పేరు చెప్తాను."

"చెప్పమనే అడిగేది." ఎకసెక్కెంగా అన్నాడు ప్రాసిక్యూటర్.

"నా పేరు భాస్కరం."

కోర్టంతా దద్దరిల్లిపోయిందా జవాబుతో. సుశీల రమాకాంత్‌ని వెర్రిగా చూసింది. నీలకంఠరావు ఆశ్చర్యంగా చూశాడు తన కొడుకుని.

"అవుతే మీకు రెండు పేర్లున్నయ్యా?"

"నాకు రెండు జన్మలూ! రెండు పేర్లూ!" అన్నాడు రమాపతి గంభీరంగా.

కోర్టంతా నిస్తబ్ధమైపోయింది.

ఇంతలో నీలకంఠరావు కేదో పాయింట్ తోచి గభాల్న లేచి –

"మైలార్డ్! ఇప్పుడు భాస్కరం బ్రదికే వున్నాడు." అన్నాడాయన.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎకసక్కెంగా నవ్వాడు.

"నవ్వకండి ప్రాసిక్యూటర్! గుండె కొట్టుకొంటున్నది కాబట్టి భాస్కరం బ్రతికే వున్నట్టు జస్ట్ – ఇందాకనే మీరు సిద్ధాంతం చేశారు."

"అవును! అవుతే?" అన్నాడు ప్రాసిక్యూటర్.

"అవుతే – మై లార్డ్! నేను చెప్పబోయే ఈ పాయింట్‌ని దయచేసి జాగ్రత్తగా నోట్‌చేయండి. భాస్కరం గుండె ఇంతవరకు ఆగలేదు! నా కొడుకు రమాపతి గుండెనే ఆగింది! భాస్కరం శరీరం మార్చాడు! కాని నా కొడుకు రమాపతి చచ్చిపోయాడు! నా కిప్పుడు మిగిలింది వాడి శరీరమే!" కోర్టంతా హర్షధ్వానాలతో దద్దరిల్లిపోయింది.

ఈ విషయం మీద న్యాయశాస్త్రం ఇంకా ఏ సిద్ధాంతమూ సిద్ధం చేయలేదనీ – ఒక కొత్త సమస్యని లోకులు పాత ప్రమాణాల్తో పరిశీలించవద్దనీ – ఈ కేసుని కొట్టివేస్తున్నాననీ జడ్జిగారు చెప్పి ఆనాటికి విచారణ చాలించారు.

సుశీల కారు దగ్గరకు వెళ్లింది. ఆమెని వెన్నంటి రమాపతి వచ్చాడు.

"సుశీలా!"

"ఏమిటి రమాపతీ!"

"నీతో నేనూ వస్తాను పద!"

రమాపతి డ్రైవ్ చేస్తున్నాడు. కారు నెమ్మది నెమ్మదిగా హిమాయత్‌నగర్ చేరింది. అప్పటికే చీకటి పడిపోయింది. బయట వాన కురుస్తోంది. గేట్లోంచి కారు లోపలకి వచ్చి గ్యారేజిలోకి వెళ్లి ఆగింది. ఒక్కక్షణం పాటు ఇద్దరూ కార్లోనే కూర్చుండిపోయారు.

తర్వాత రమాకాంత్ లేచి బ్యాక్ డోర్ తీసి సుశీలని దిగమన్నాడు.

ఆమె దిగగానే అతను విండో గ్లాసెస్ పైకి ఎక్కించి కారు మెషిన్ లాక్ చేసి హెడ్‌లైట్స్ ఆఫ్ చేశాడు. ఆ చీకటిలో సుశీలకి భాస్కరం గుండె మునపటిలా కొట్టుకుంటుండడం విన్పించింది.

(04. 04. 1969 నాటి ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురితం)

మూడు చక్రాల సైకిల్


సుధాకరం సుజాతా బస్సులో మౌనంగా కూర్చున్నారు. సుజాత కిటికీలోంచి బైటకెటో చూస్తోంది. సుధాకరం తలదించుకొని తన అంతరంగంలోకి చూసుకొంటున్నట్లున్నది. బైటనుంచి చలిగాలి రివ్వున వస్తోంది. సుజాత షాల్‌ని చెవులమీదిగా కప్పుకొంది. బస్సులో అంతగా జనం లేరు. బస్సు ధ్వనీ, అప్పుడప్పుడు ఆ బస్సుని అధిగమించి వెళ్తున్న కారు హారన్ల చప్పుడూ తప్ప వాళ్లిద్దరి ఆలోచనల్లని ఆపేది మరేదీ అక్కడ లేదు.

అనుకోకుండా సుధాకరం తల ఎత్తాడు. అదే సమయానికి సుజాతకూడా తలెత్తింది. ఇద్దరి చూపులూ ఒకేచోట నిల్చినవి – ఒక అమ్మాయీ, ఒక అబ్బాయీ, తల్లీ తండ్రీ; నలుగురి ముఖాలూ వికసించి వున్నవి. – అదో ప్రకటన – దానికింద ఆ బొమ్మలో లాగుంటే ఎలా సుఖపడ్తారో ఒక నినాదం వుంది! అసలు ప్రకటనల రహస్యమే అది! జీవితంలో మనం సాధించలేని దానిని సాధించగలమేమో అన్న విశ్వాసాన్ని కల్గించేదే ప్రకటన. కాని మానవుడి ఆశలెలా ఘనీభవించి జీవితంలో ఏనాడూ సుఖాన్నెలా ఇవ్వలేవో అలాగే ప్రకటనలున్నూ!

అందరిలాగే సుధాకరమూ తన జీవితంలో నవ్వులు నింపుకుందా మనుకొన్నాడు. నిజానికి కొంతకాలం అతని జీవితంలో నవ్వులు విరిసినవికూడా! కాని... ఆ ఒక్క సంఘటన అతణ్ణి దుఃఖవైతరణిలోకి పడదోసింది. పంటల్ని పండించే వానతోబాటే పిడుగూ పడ్తుంది. కాని అది చెప్పి పడ్తుందా? పిడుగు పడ్తుందని వానలు కురవవద్దంటారా కర్షకులు....

– – – – –

సుజాత ఆనాడు కాలేజీనుంచి తిరిగిరాగానే ఇంటిల్లిపాదీ శోకాలు పెట్తుండడం చూసి ఏదో కీడు శంకించింది. చుట్టుపక్కలవాళ్లు వచ్చి సుజాత తల్లిని వోదారుస్తున్నారు. ఎవరో అసలు విషయం సుజాత చెవిలో వేశారు. సుజాత కుప్పలా కూలిపోయింది. ఆ రాత్రి సుధాకరము తన భార్యా పిల్లల శవాలతో టాక్సీలో వచ్చాడు.


మూడుచక్రాల
సైకిల్

ఎన్నో మరణాల్ని వీధుల్లో చూస్తుంటాము. ప్రతి మరణానికీ 'అయ్యో పాపం!' అని సానుభూతి చూపుతుంటాము. కాని ఆ మరణమే మనవాళ్లకి ప్రాప్తించినప్పుడు ఆ సానుభూతిని మనమే ఆశిస్తాము. మన దుఃఖం గుండెల్లోంచి చిమ్ముక వస్తుంది. కాని ఎవడి సానుభూతి ప్రదర్శనా దాన్ని ఆపలేదు. ఒక్క కాలమే ఆ దుఃఖోద్వేగాన్ని ఆపగలదు. కాని సుధాకరం మీద ఆ కాలంకూడా పనిచేయలేకపోయింది. అతననుక్షణం పిచ్చివాడిలా కాకుంటె విరాగిలా ప్రవర్తిస్తున్నాడు.

'సుశీ! చిట్టి ఏడుస్తోంది. కాస్త సముదాయించవూ!'

'సుశీ! బుజ్జిగాడు రేజర్ సెట్ తీస్తున్నాడు. కాస్త దాన్ని తీసి అలమారాలో పెట్టవూ!'

– ఇదీ అతని మాటలతీరు. అతనింకా వర్తమానంలోకి పడలేదు. అవును మరి! రమణీయమైన భూతకాలమున్నవాడు చూస్తూ చూస్తూ శోక సర్ప పరివేష్టితమైన వర్తమానంలో ఎలా బ్రతకగలడు?

కాని అతణ్ణి మళ్లీ వర్తమానంలోకి లాక్కుని వచ్చిందొక వ్యక్తి! ఇక్కడినుంచే ఈ కథ ప్రారంభం.

'బావా ఉద్యోగానికి ఎన్నాళ్లు సెలవు పెట్టావు?'

'ఈ జీవితానికే సెలవు పెడ్దామనుకొంటున్నాను సుజాతా! ఇంక ఉద్యోగం ప్రసక్తి ఎక్కడ?' పీక్కుపోయిన కళ్లల్లో రెండు కన్నీటి బిందువులు నిల్చినవి.

'బావా! సెలవు మంజూరు చేయడానికి ఆఫీసులో ఒక అధికారి అంటూ వుంటాడు. కాని ఈ జీవితంనుంచి సెలవు తీసికోడానికి ఏ అధికారికి సెలవు చిట్టీ పంపుతావు.'

'భగవంతుడికి!' అతని కళ్లల్లోని బిందువులు జారిపోయినవి.

'ఆయన లేడు బావా! ఉన్నది మనమే. అడవుల్లో పుట్టిన మానవుడు నగరాలు నిర్మించుకొంటున్నాడు. అనుక్షణం దుఃఖమయమైన తన జీవితాన్ని సుఖమయం కావించుకోడానికి విశ్వప్రయత్నం చేసికొంటున్నాడు. అంతేగాని దుఃఖభరితమైన ఈ జీవితాన్ని లాగలేక జీవితం నుంచి తొలి మానవులే

పారిపోయి ఉంటే మనమిలా పుట్టి వుంటేవాళ్లమా?' అతని చెక్కిళ్లు తుడుస్తూ అన్నది సుజాత.

ఇంకోరోజు సుజాత అతణ్ని మళ్లీ ప్రసంగంలోకి లాగింది.

'బావా! నా బి.ఏ. అయింది. మీ వూర్లో ఎం.ఏ వుందికదా! అక్కడ మీ ఇంట్లో వుండి చదువుకొంటాను.'

'తిరిగి నేనా ఇంటికి వెళ్లలేను సుజాతా!'

'ఏం ఫరవాలేదు బావా! జీవించడానికి కూడా కాస్త సాహసం కావాలి. మనం సాహసం చూపేవరకూ మనల్ని ఆ జీవితం దగ్గరకు రానీయదు.'

కొన్నాళ్లకి సుజాత సుధాకరాన్ని తీసికొని హైద్రాబాద్ చేరింది వాళ్ల ఇంట్లోనే వుండి సాంఘిక శాస్త్రంలో ఎం.ఏ. చేస్తోంది. సుధాకరం రోజూ ఆఫీసుకి వెళ్తున్నాడు. రోజూ ఆఫీసునుంచి తిరిగి రాగానే పడక గదిలోకి చేరి తన గతించిన భార్య చిత్రపటం చూస్తూ కూర్చుంటాడతను. అదే అతనికి తన దైనందిన కార్యక్రమంలో సంతోషాన్నిచ్చే ఏకైక ఘట్టం!

సుజాత అతనికి రోజూ వండి పెడ్తూ అతనికి ఏ లోటూ రానీయకుండా చూసికొంటోంది.

'బావా! భోజనానికి రా. అన్నం చల్లారిపోతోంది.'

'ఇవేళ భోజనం చేయను సుజాతా!'

సుజాత అతని గదిలోకి వచ్చింది. అతను తన భార్య చిత్రపటాన్ని చూస్తూ కన్నీరు కారుస్తున్నాడు.

'ఏం పని బావా అది – ఆడపిల్ల లాగా'!

'ఆడవాళ్లకి మాత్రమే కన్నీరు కార్చే హక్కుంటే నేను స్త్రీగా మారిపోతాను. ఈ అశ్రుతర్పణంలో వుండే సుఖం జీవితంలో మరి దేన్లోనూ లేదు' అన్నాడతను.

సుజాత భారం దిగిపోయినట్లుగా శ్వాస విడిచి అన్నది –

'అదే బావా! నేనూ అనాలనుకొంటున్నది. మానవుడెప్పుడూ సుఖాన్వేషి! అతని గుండె ఎప్పుడూ మృత్యువులో దివ్యత్వాన్నీ, ద్వేషంలో ప్రేమనీ, దుఃఖంలో

సుఖాన్నీ అన్వేషిస్తూంటుంది. కాని అదంతా కాల్పనిక జగత్తు బావా! దానిలో సుఖం లేదనడం లేదు నేను. కాని అది మిధ్యాసుఖం. ఈ శరీరానికి సంబంధం లేని సుఖం అది. శరీరంతో సంబంధంలేని సుఖం ఎక్కువకాలం ఈ శరీరాన్ని నిలపదు.'

'ఐతే ఇంకా మంచిదే కదా.'

సుజాత కళ్లల్లోనుంచి నీళ్లు కారినవి.

సుధాకరం వెంటనే లేచి,

'అదేమిటి సుజాతా! అలా ఏడుస్తున్నావ్?' ఆదుర్దాగా అడిగాడు.

'సంవత్సరంపాటు నీ కన్నీళ్లని నేను సహించగల్గాను కాని నా కళ్లల్లోంచి జారిన ఒక్క కన్నీటిబిందువుకే నువ్విలా బాధపడ్తున్నావ్ చూశావా బావా!'

'అవును సుజాతా! అవతలివాళ్ల దుఃఖాన్ని నేను చూస్తూ ఊరుకోలేను.'

'బావా? ఇలా చూడు నన్ను. నీ బాధకి నా గుండెలనిండా కన్నీరు నిండివుంది. కాని ఇవేళ తొలిసారిగా – అదీ నా ప్రమేయం లేకుండా – జారిపోయింది. అందుకెంతో బాధగావుంది నాకు,'

'బాధా? ఎందుకు సుజాతా?'

'నాకు కూడా చేతకానితనం ఆసన్నమౌతున్నందుకు' ఆ మాట అని సుజాత లోపలికి వెళ్లిపోయింది. ఆ మాటతో సుధాకరం చాలారోజులతర్వాత లౌకిక జగత్తులో పడ్డాడు. తన కన్నీటికి, తన శోకానికి తానే విచారించాడు. అతను వెంటనే గదిలో అటూ ఇటూ తిరిగాడు. ఒకమూలన చక్రాలు విరిగిపడిన మూడు చక్రాల సైకిలుబండి కనబడింది. అతనక్కడికి వెళ్లి ఒక చక్రాన్ని దాని కెక్కించి స్క్రూలు తిప్పుతున్నాడు.

అంతలో సుజాత మళ్లీ వచ్చింది.

'ఆ చక్రాన్ని నేనెక్కిస్తాగాని నువ్వు భోజనం చెయ్యి బావా!' అన్నదామె నవ్వుతూ.

అతను లేచి ఆమె కళ్లల్లోకి చూస్తూ ఆమెని సమీపించాడు.

'ఏం బావా! అలా చూస్తున్నావ్?' సంతోషంగా అన్నదామె.

'ఏంలేదు సుజాతా! ఈ సైకిల్‌కి ఒక్క చక్రమే ఎక్కుతుంది. తక్కిన రెండు ఎప్పుడూ ఎక్కవు!' అతను గబగబా వంటగదిలోకి వెళ్లి భోజనంమీద కూర్చున్నాడు. అతనిభోజనం సగమయ్యాక ఆమె వచ్చింది.

'నువ్వూ భోంచేయి సుజాతా!'

'అలాగే బావా!'

ఇద్దరూ కలసి భోజనం చేశారు....

'సుజాతా! విరిగిపోయిన, నా జీవన ఖండాల్ని అతికించబోయి నీ జీవితాన్నే విరుగ కొట్టుకొంటున్నావేమో'

'కాదు బావా! జీవితం ఎన్నడూ విరగదు. అది ఆగుతుంది తప్ప. నా జీవితం ఆగిపోయేటంతవరకు మన బంధాన్నిలాగే కాపాడు బావా!' ఆమె చెక్కిళ్లమీదనుంచి జలజలా కన్నీరు కారింది.

'పిచ్చి సుజాతా! ఎందుకూ ఏడుస్తున్నావ్? ఏడవ్వాకు.'

అప్పటినుంచి సుజాత నవ్వుతూనే వుంది. ఆమెకి ఏలోటూ కలగలేదు. ఆమె కాలేజీలో లెక్చరరయింది. సుధాకరంతో సహా అన్నీ సమకూరినవి ఆమెకి.

ఒక్కటి తప్ప!

సుధాకరమూ ఆమెతో బాటు నవ్వుతూనే బ్రతుకుతున్నాడు. సుధాకరానికి అందమైన భార్య లభించింది. తన జీవన వృక్షానికి కొత్త చిగుళ్లు వేయించగల్గిన వసంత రాణి లభించింది తనకి! కాని... కాని.... ఆమెకు తాను అన్నీ లభింప జేస్తున్నాడా? తొందరపడ్డాడు తాను. తన దుఃఖంతో ఒక అమాయకురాలిని తన వైపుకి ఆకర్షించుకొన్నాడు! ఛీ! ఛీ! ఒక పసిపిల్ల హృదయంలో తానెంతటి చిచ్చు పెడ్తున్నాడు!

– – – – –

అవతల వాన లంకించుకొంది. ఇద్దరూ బస్సుదిగే సమయానికింకా వాన నిలవలేదు. బస్సుదిగి వానలో తడుస్తూ గబగబా వాళ్లు ఇంటికి చేరుకున్నారు.

సుజాత సుధాకరం తల తువ్వాలతో తుడిచింది. ఇద్దరూ కలిసి భోజనం చేశారు.

'ఏమిటి సుజాతా ఇవ్వాళ నువ్వదోలా వున్నావ్!'

'ఏం లేదు బావా!' సుజాత మౌనంగా అతని కౌగిలిలో ఇమిడిపోతూ అన్నది.

'ఏం లేకపోవడమేమిటి? ఏదో వుండి వుంటుంది. అది నాకు చెప్పగూడనిదైతే చెప్పనక్కర్లేదులే సుజా!'

తల పైకెత్తి చూసింది సుజాత. చిబుకం మీది ఆకుపచ్చని రంగుపై తన చూపుడు వ్రేలిని త్రిప్పుతూ అన్నదామె.

'జీవితంలో రహస్యానికి స్థానం వుందా బావా?'

ఆ ప్రశ్నతో సుధాకరం గిలగిలలాడిపోయాడు. సూటిగా ఆ ప్రశ్న అతని గుండెల్లోకి వెళ్లిపోయింది. కొంపదీసి తమ డాక్టరా రహస్యాన్ని సుజాతకి చెప్పలేదు గదా! హే భగవాన్ నన్నీ ప్రమాదంలోంచి రక్షించవూ!

'ఏం బావా! సమాధానం చెప్పవూ!'

'సుజా! ఎందుకడుగుతున్నావీ ప్రశ్న?'

'ఊరికేనే తెలిసికొందామని.'

'రహస్యమే నాగరికత – బట్ట బయలే అనాగరికత.'

'కాని బావా! అవతలివాళ్ల జీవితాల్ని నమిలి మింగేయగల విషయం రహస్యంలో దాగిపోతేనో...'

ప్రభంజనానికి వణికిపోయే మొక్కలా సుధాకరం గుండె వణికిపోయింది.

'కాని అవతలవాళ్లకి కాస్త క్షమా హృదయం వుంటే ఎంత పెద్ద దెబ్బైనా తట్టుకోవచ్చేమో సుజాతా!'

'అవును బావా! సమాజంలో క్షమ అనే వస్తువు లేకపోతే సమాజమంతా రుద్రభూమిలో నివాసం చేసి వుండేది!'

మర్నాడు సుధాకరం ఆఫీసునుంచి ఇంటికి తిరిగి వచ్చేటంతవరకూ అదే విషయాన్ని ఆలోచిస్తున్నాడు. సుజాతకి తానా విషయం రహస్యంగావుంచి పెద్ద పొరపాటు చేశాడు. ఆమె తనని వివాహం చేసికోవడానికి ఉద్దేశించినప్పుడు అప్పటి తన ఆ వైరాగ్యంలోనూ బోలెడు స్వార్థం వుందన్నమాట! ఛీ! ఛీ! తానెంత దుర్మార్గుడు! వెధవ ఈ లౌకిక సుఖం కోసం శాశ్వతంగా ఒక అమాయకురాలి జీవితాన్ని దగ్ధం చేశాడు! తన పాపానికి ప్రాయశ్చిత్తం వుందా? తనని భగవంతుడు క్షమిస్తాడా? అయినా ఒక్క తన సుజాత క్షమిస్తే భగవంతుడు క్షమించక పోయినా ఫరవాలేదు.

ఎదురుగా అతణ్ని వెక్కిరిస్తూ మళ్లీ ఆ ప్రకటన ఇద్దరూ లేక ముగ్గురు చాలు! ఆ నలుగురి నవ్వుల్లో ఎంత ఆకర్షణ! వాళ్లలా నవ్వబోయి తన బ్రదుకు బండలైపోయింది! తన ముఖానికి మళ్లీ పెళ్లి చేసికొన్నాడు! ఛీ! ఛీ! ఎంతటి నేరం చేశాడు తాను.

సుధాకరం ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో ఎవరో పురుషుడి కంఠం వినబడ్తోంది. అతని రాకతో ఉద్రేకంగా మాట్లాడ్తున్న వాళ్లిద్దరి మాటలూ ఆగిపోయినవి. ఆ కొత్త వ్యక్తి సుధాకరాన్ని చూసి గబగబా బైటికి వెళ్లిపోయాడు.

'సుజాతా! ఎవరతను?'

'బి.ఏ. లో నా క్లాస్‌మేట్!' తల నేలకి దించుతూ అన్నదామె.

మౌనంగా ఇద్దరూ కాఫీ త్రాగారు. సుధాకరం ఆలోచనల్లో పడిపోయాడు. సుజాత పని ముగించుకొని వచ్చింది.

'బావా! ఒక విషయం సూటిగా అడుగుతాను సమాధానం చెప్తావా?'

'అడుగు సుజా.'

'నేనేదైనా తప్పు చేస్తే నువ్వు క్షమించగలవా బావా?'

'క్షమ - ద్వేషం - కోపం అనేవి మనకి తెలిసి రావు సుజాతా! అవి ఒక్కొక్కడి రక్తంలో జీర్ణించివుంటవి. ఇంతెందుకు? నేనే నిన్నో ప్రశ్న అడుగుతాను చెప్పు! మారుతున్న వ్యవస్థలో మార్పుకి నూటికి తొంభైమంది ఒప్పుకోరు, ఎందువల్ల?'

'ప్రాచీన వ్యవస్థమీది అనురాగాన్ని త్రెంపుకోలేక!'

'దాన్నే నా మాటల్లో చెప్పాలంటే ప్రాచీన భావాలమీద విప్లవం చేసినవాడి మీద వాళ్లకి కోపం వచ్చి వాడు చెప్పిన మాట వినకపోవడం వల్ల! కాని వాడు చూపిన విప్లవం జీవితానికి అవసరమైనదని తెలిసిననాడు తప్పక వాడిమీద, వాడి భావాలమీద కోపాన్ని చంపుకొని వాణ్ని అనుసరించి సుఖిస్తారు.'

'అంటే అనురాగానికీ, ప్రేమకీ కూడా ఒక ప్రయోజనం, ఒక అవసరం ఉంటుదంటావు.'

'అవును సుజా! ప్రయోజన రహితమైన గుడ్డి ప్రేమమీద నాకు నమ్మకం పోయింది.'

సుజాత ఆ మాటలకి చిరునవ్వు నవ్వింది.

'నాకు తెలుసు నువ్వెందుకు నవ్వుతున్నావో సుజా! కాల్పనిక జగత్తులోనో, భూతకాలపు మధురస్మృతుల్లోనో బ్రతికిన ఈ బావేనా ఇవేళ ఇంతటి లౌకికుడైంది! అని కదూ.'

'లౌకికుడు కాదు బావా! సాంఘికుడు బావా! నీలో చాలా మార్పు వచ్చింది, సాంఘిక అవసరాలు – అవి తీర్చుకునే అవకాశాల్ని బట్టే ఈ జీవిత నౌక తనదారిని ఎన్నుకొంటుంది. అది చేతకానివాడే కాల్పనిక జగత్తులోకో, భూతకాలానుభవాల్లోకో జారిపోతాడు.'

'అలాంటివాడు చచ్చినవాడితో సమానం సుజాతా!'

'బావా! ఇవేళే మనిద్దరం నిజంగా దంపతులమైనది.'

అతణ్ని సుజాత గట్టిగా కౌగిలించుకొంది.

'బావా! ఏం జరిగినా ఈ బంధాన్ని త్రెంచవు కదూ!'

'అదే ప్రశ్న నేనూ నిన్ను వేద్దామనుకొంటున్నాను సుజా!'

గడియారం జీరో అవర్‌లోకి వచ్చింది!

కొత్తజీవితం ప్రారంభమైంది.

నాలుగురోజుల తర్వాత సుధాకరానికి ఆఫీసు అడ్రెస్‌కి ఒక రిజిష్టర్ కవర్ వచ్చింది.

సుధాకరం దాన్ని విప్పి చదివాడు.

'డియర్ సుధాకర్!

ఈ ఉత్తరం నీకు వ్రాసి బాధపెడ్తున్నానని నాకు తెలుసును. కాని వ్రాయక తప్పడం లేదు. నన్ను బాధించినవ్యక్తి జీవితాన్ని ఇంత మధురంగా, ఇంత అమృతమయంగా నేను వుంచలేను! నాకది చేత కాని విషయం. ద్వేషంతోటే ఆ వ్యక్తి మీద కసి తీర్చుకుంటాను. డియర్ సుధాకర్! ఇవేల్టి నీ రెండో భార్య ఒకప్పుడు నా ప్రేయసి. ఈ మాటలు నువ్వు నమ్మవని నాకు తెలుసును. అందుకే ఆమె చదువుకొంటున్న రోజుల్లో నాకు వ్రాసిన ప్రేమలేఖ ఒకటి దీన్తోటి పంపుతున్నాను. ఇది చింపేసి కులాసాగా బ్రదుకుదామనుకొంటున్నావేమో! ఇలాంటి వుత్తరాలో పది నా దగ్గర వున్నవి. నువ్వు ఆమెని వదిలేయకపోతే మీ ఇద్దరి బ్రదుకులు బండలు చేస్తాను.

ఇట్లు

నీ హితైషి

సుధాకరం ఆ వుత్తరం జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టుకొన్నాడు. జరుగబోయే పరిణామాన్ని తలచుకొని అతని గుండె గుబగుబలాడిపోయింది. తనకి ఈ ఒక్క అవకాశం వచ్చింది – చేసిన తప్పు సరిదిద్దుకోవడానికి!

సుధాకరం సాయంత్రం ఆలస్యంగా ఇంటికి వెళ్లాడు.

'బావా! ఇవేళ ఆలస్యంగా వచ్చావేం'

'అవును సుజాతా!' అతని కంఠం వణకుతోంది. సుజాత అతణ్ని పరిశీలిస్తోంది. ఇవేళ అతనిముఖం రోజటిలాగా లేదు.

'సుజా! ఇవేళ నాకో వుత్తరం వచ్చింది.'

సుజాత గుండెల్లో బాంబు పడింది. ఆమె రక్తం అమితవేగంతో పర్వులెత్తింది. కళ్లు తిరిగి ఆమె పడిపోబోయింది – సుధాకరం ఆమెని పట్టుకొని,

'ఎందుకు సుజా! ఏమన్నానని అలా వాలిపోయావు?'

'ఆ వుత్తరం... ఆ వుత్త...రం...'

'అవును ఆ వుత్తరం అతని దగ్గరనుంచే వచ్చింది.'

'మరి'

'మరేమిటి పిచ్చి సుజాతా!'

'మరేమీ లేదా?'

'మరేమీ లేదు సుజా! నువ్వీ మొండి జీవితం నా దగ్గర గడుపదల్చు కొన్నన్ని రోజులు మరేమీ వుండదు – అని అభయమిస్తున్నాను సుజాతా!'

'అంతటి క్షమ నాకు భారమౌతుంది బావా!' అతని గుండెలమీద వాలి వెక్కుతూ అన్నది సుజాత.

'నా క్షమ కాదు నీకు భారమయ్యేది...'

'తక్కినది నాకు చెప్పకు బావా! అది నాకు తెలుసు.'

'తెలుసా?' ఆశ్చర్యంగా అడిగాడు సుధాకరం.

నవ్వుతూ సుజాత మూడు చక్రాల సైకిల్ వైపు చూపించింది. దానికి ఒక చక్రం బిగించబడి వుంది. తక్కిన రెండు చక్రాలు లేవు!

'ఇంక ఆ రెండు చక్రాల్లాంటి పిల్లలు మనకి వుండరంటావు బావా!' సుజాత శిరస్సుమీద రెండు చేతుల్తో వ్రాస్తూ.

'అవును సుజా! జీవితంలో సుఖాన్ని పొందుదామని మీ అక్కని కష్టపెట్ట కూడదని శాశ్వతంగా నేనే నివారించుకొన్నాను, ఈ జన్మకి మన ప్రతిబింబాలు అద్దంలో తప్ప మరెక్కడా కన్పించవు సుజాతా!'

'బావా! ఇంత పసిమనస్సు వున్న నువ్వే నా కొడుకువి! ఇంత క్షమా హృదయమున్న నీవే నా తల్లివీ దండ్రివీ! ఇంతటి అనురాగ హృదయమున్న నువ్వే నా భర్తవి!'

సుజాతని సుధాకరం నెమ్మదిగా ముద్దు పెట్టుకొన్నాడు.

'ఒక్క ప్రశ్న అడుగుతాను తప్పక సమాధానం చెప్తావా సుజా!'

'తప్పకుండా చెప్తాను బావా!'

'ఐతే నువ్వతనినే ఎందుకు పెళ్లి చేసుకోలేదు?'

'ద్వేషంతో అతను హృదయాల్ని చంపగలడే కాని నీవలె క్షమతో బ్రదికించ లేడు బావా! అందుకని.'

గడియారంలో రెండు ముళ్లూ కలిసి జీవన సంగీతం పాడినవి!.

(27.03.1970 నాటి ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురితం)



ముదిగొండ వీర భద్రయ్య – యాదగిరి

ముదిగొండ వీర భద్రయ్య వరంగల్లు నగరంలో 1942 వ సంవత్సరంలో జన్మించారు. బి.ఏ. వరకు వరంగల్లు సుబేదారీ కాలేజీలో, ఎం.ఏ. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివి, పి.హెచ్.డి. పట్టా కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పొందారు. 2004 లో హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షునిగా ఉంటూ పదవీ విరమణ చేసారు.

కవితలు, కావ్యాలు, శాస్త్ర గ్రంథాలు 60 కి పైగా రచించారు. ఈ సంకలనంలోని కథానికలు 1960 లలో వార పత్రికలలో ప్రచురణ అయినవి.